ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ తదియ ఉ.11.42 వరకు అనంతరం చవితి; నక్షత్రం: ధనిష్ఠ రా.12.55 వరకు, అనంతరం శతభిషం; అమృతకాలం: రా.1.05 నుండి 2.55 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి: 63 • సంచిక: 361 • బుధవారం 9 జనవరి 2019 • విజయవాడ ❋ పేజీలు: 16 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

అమరావతిలో వెంకన్న గుడి

రూ.27.29 కోట్లతో టెండర్లు ఖరారు

పలమనేరులో గోశాల అభివృద్ధికి రూ.40 కోట్లు

టీటీడీ నిర్ణయాలు

తిరుమల, ప్రభన్యూస్ : తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు వసతి కల్పించేందుకు మొదటి బ్లాక్‌లో 384 గదులను రూ. 67.29 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు చేసినట్లు టీటీడీ చైర్మెన్ పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన పాలకమండలి సమావేశం చైర్మెన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ➪ 7వ పేజీలో...



ఢిల్లీలో రాహుల్ గాంధీతో ఏపీ సీఎం చంద్రబాబు

పొత్తులపై కొలిక్కి?

రాహుల్‌గాంధీతో భేటీలో సుదీర్ఘ చర్చలు

కోల్‌కతా సభలో మహాకూటమి కార్యాచరణ

ఢిల్లీలో చంద్రబాబు సుడిగాలి పర్యటన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు కొనసాగింపు వ్యవహారం దాదాపుగా కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జరిపిన సుదీర్ఘ మంతనాల్లో ఈ అంశమే ప్రధాన ఎజెండాగా నిలిచింది. మరికొద్ది నెలల్లో జరగనున్న ➪ 2వ పేజీలో...



ఈబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

323 ఎస్

3 నో

నేడు రాజ్యసభకు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : చారిత్రాత్మక 124వ రాజ్యాంగసవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన ఈ బిల్లుకు 323 మంది సభ్యులు అనుకూలంగా, ముగ్గురు సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. మూడింట రెండొంతుల సభ్యులకు పైగా ➪ 6వ పేజీలో...

రిజర్వేషన్లు స్వాగతిస్తున్నాం

రఘువీరా స్పందన

6లో



సీబీఐ బాస్ ఈజ్ బ్యాక్

అలోక్ వర్మకు మళ్లీ పదవి

కేంద్రం ఉత్తర్వులకు విఘాతం

సెలవు ఆదేశాలు చెల్లవని సుప్రీం తీర్పు

నియామక కమిటీదే తుది నిర్ణయమని స్పష్టీకరణ

6లో

సూర్యోదయ ప్రదేశ్‌గా ఏపీ

నేను చేతల మనిషిని

ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా: చంద్రబాబు

కర్నూలు ఎయిర్‌పోర్టు జాతికి అంకితం 7లో



కర్నూలు ఎయిర్‌పోర్ట్‌ను జాతికి అంకితం చేసిన సీఎం చంద్రబాబు



సిద్ధాంత బలంలేని పార్టీలు తెదేపా, వైకాపా

దమ్మున్న నేతలు కావాలి

పోరాటాలకు సహనమే సాధనం

సంక్రాంతిలోగా కమిటీలు

కర్నూలు జిల్లా సమీక్షలో పవన్ కల్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ : సిద్ధాంత బలం లేకుండా కేవలం నాయకుల బలం మీద ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవని, అందుకు టీడీపీ, వైసీపీలే ఉదాహరణ అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశాల్లో ➪ 3వ పేజీలో...



ఐఎంఎఫ్ తొలి మహిళా చీఫ్ ఎకనమిస్టుగా గీతాగోపీనాథ్

గీత స్వస్థలం మైసూర్

6లో





రైల్లో ఉపరాష్ట్రపతి

తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టులపై ప్రయాణంలోనే సమీక్ష 9లో

నేడు ప్రజా సంకల్ప యాత్ర విజయ స్థూపం ఆవిష్కరణ



3,648 కిలోమీటర్లు

పాదయాత్ర @341 రోజులు

• భారీగా జన సమీకరణ • సర్వాంగ సుందరంగా పైలాన్ • 175 నియోజకవర్గాల పార్టీ ఇంచార్జీల రాక • బహిరంగ సభలో జగన్ ప్రసంగం

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర నేటితో ముగియనుంది. 341 రోజుల పాటు ఏకధాటిగా 3,648 కిలోమీటర్ల పొడవునా ఆయనీ పాదయాత్ర నిర్వహించారు. 2017 నవంబర్ 6న వైఎస్ఆర్ కడప జిల్లా ఇడుపులపాయ నుంచి మొదలెట్టిన ఈ పాదయాత్రను 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు నిరాటంకంగా కొనసాగించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం జగన్ బెంగుళూరులో వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు. అంతకుమించి తెలుగు రాష్ట్రాల్లో ఎలాంటి రాజకీయాల్లోనూ తలదూర్చేవారుకాదు. వైఎస్ ముఖ్యమంత్రి పదవిని ఉపయోగించుకుని ఆయన తన వ్యాపారాల్ని, పరిశ్రమల్ని విస్తరించుకున్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారితో తమ సంస్థల్లో పెట్టుబడి పెట్టించారు. అంతకుమించి ఏనాడూ నేరుగా ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాల్లో జోక్యం ➪ 3వ పేజీలో...




అదనపు పెన్షన్‌కు సీఎం ఓకే!

• ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు

అమరావతి, ఆంధ్రప్రభ: 70సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి కానుక అందించారని, వాళ్లకి 10శాతం అదనపు పెన్షన్ మంజూరు చేస్తూ సదరు దస్త్రానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 75 సంవత్సరాలు నిండితేనే 15శాతం అదనపు పెన్షన్ ఇచ్చేవారని, కాని ఏపీజేఏసీ అమరావతి తరుపున 70సంవత్సరాల విశ్రాంత ఉద్యోగులకు కూడా 15శాతం అదనపు పెన్షన్ ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశామన్నారు. ఈనిర్ణయం 4లక్షల పైచిలుకు ఉన్న విశ్రాంత ఉద్యోగులకు ఆనందాన్ని కలిగించిందని, అదేవిధంగా దాదాపు 70వేల పైచిలుకు ఉన్న ఫించనుదారులకు లబ్ధిచేకూరుతుందన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై దాదాపు రూ.200కోట్ల అదనపు భారం పడుతుందని, సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి పించనుదారులందరూ అండగా ఉంటారని స్పష్టంచేశారు.







పొత్తులపై కొలిక్కి?



(మొదటిపేజీ తరువాయి)

సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు, సీట్ల సర్దుబాటు కొనసాగించే విషయంపై రెండు పార్టీల అధినేతలు అవగాహనకు వచ్చినట్టు సమాచారం. ఈ మధ్యనే జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు ఫలించకపోగా వికటించాయని కాంగ్రెస్ నేతలు అధిష్టానం నేతలకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఏపీలో పొత్తుల కొనసాగింపుపై సందేహాలు నెలకొన్నాయి. అయితే ఏపీ కాంగ్రెస్ నేతల్లో ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండాలనే కోరుకుంటున్నట్టు తెలిసింది. పొత్తుంటే కొన్నిసీట్లయినా గెలిచి అటు అసెంబ్లీలో, ఇటు లోక్‌సభలో ప్రాతినిధ్యం పొందవచ్చని వారు అధిష్టానం నేతలకు సూచించినట్టు తెలిసింది. మరోవైపు చంద్రబాబు నాయుడు జాతీయస్థాయి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీతో చెలిమి, పొత్తులు కొనసాగించాలని భావిస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకతాటి మీదికి తీసుకొచ్చే ప్రయత్నాలు మరింత ముమ్మరం చేస్తున్న తరుణంలో రాహుల్ గాంధీతో భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే భేటీలో ఏయే అంశాలు చర్చించారన్న విషయంపై అధికారికంగా అటు ముఖ్యమంత్రి కార్యాలయం లేదా పార్టీ వర్గాలు ఎక్కడా మాట్లాడలేదు. రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఊమెన్ చాందీ ఉండడంతో పొత్తులు, సీట్ల సర్దబాటు అంశంపై చర్చ జరిగిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

రాహుల్ గాంధీతో భేటీ అనంతరం ఏపీ భవన్ సీఎం కాటేజికి చేరుకున్న చంద్రబాబు నాయుడును ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వచ్చి కలిశారు. జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటు, ఈనెల 19న కోల్‌కతాలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ (ర్యాలీ)కి హాజరయ్యే విషయంపై చర్చించినట్టు తెలుస్తోంది. ఆ సభ ద్వారా బీజేపీ వ్యతిరేక కూటమి బల ప్రదర్శన చేయాలన్న ఆలోచనలో చంద్రబాబు నాయుడు ఉన్నారని సమాచారం. కేజ్రీవాల్‌తో భేటీ అనంతరం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్‌ను ఆయన నివాసంలో చంద్రబాబు నాయుడు కలుసుకున్నారు. అదే సమయంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్నారు. కాసేపటి తర్వాత లోక్‌సభలో జరుగుతున్న రిజర్వేషన్ బిల్లుపై చర్చలో పాల్గొనేందుకు ఫరూఖ్ అబ్దుల్లా వెళ్లిపోగా, పవార్‌తో విడిగా మరికొంత సేపు చంద్రబాబు చర్చలు జరిపారు.

అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 19 మమతా బెనర్జీ తలపెట్టిన ర్యాలీకి రావాల్సిందిగా ఆహ్వానం అందిందని, ఆ సభకు విపక్ష పార్టీల నేతలందరూ హాజరవ్వాలని నిర్ణయించుకున్నామని చంద్రబాబు తెలిపారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా ఇదే విషయం చెబుతూ బహిరంగ సభ అనంతరం అక్కడే విపక్ష పార్టీల నేతలంతా కలిసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు జరుపుతామని అన్నారు. అక్కడ ఏకాభిప్రాయం కుదిరితే భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్తామని అన్నారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జాతీయస్థాయిలో పార్టీలన్నీ కలసికట్టుగా పనిచేయడం రాజకీయ అనివార్యతగా మారిందని వ్యాఖ్యానించారు. కొన్ని రాష్ట్రాల్లో పార్టీల మధ్య విబేధాలు ఉన్నప్పటికీ, జాతీయస్థాయిలో కలిసి పనిచేయక తప్పదని అన్నారు.

మరోవైపు రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ తామంతా సమర్థిస్తున్నామని అన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వానికి రిజర్వేషన్ల అంశంపై ప్రతిపాదనలు పంపాయని, ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్మీకి బోయలను ఎస్టీలలో చేర్చడం, కాపులకు రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన తీర్మానాలు, బిల్లులపై ఆమోదముద్ర వేయకపోవడంపై చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరి నిమిషంలో రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన బీజేపీ రాష్ట్రాల ప్రతిపాదనలపైనా స్పందించాలని డిమాండ్ చేశారు. అయినా సరే తాము రిజర్వేషన్ బిల్లును ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. శరద్ పవార్ నివాసం నుంచి తిరుగు ప్రయాణమైన చంద్రబాబు నాయుడు, తృణమూల్ కాంగ్రెస్ నేత దినేశ్ త్రివేదిని కలిసి కోల్‌కత్తా బల ప్రదర్శనపై చర్చించినట్టు తెలుస్తోంది.

విశాఖలో నేడు గవర్నర్ పర్యటన

• ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్సవాలకు హాజరు
• పలువురు ప్రముఖులకు అవార్డుల ప్రదానం
• ఆంధ్రా యూనివర్శిటీ స్నాతకోత్సవానికి హాజరు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ మంగళవారం విశాఖ చేరుకున్నారు. మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయంలో గవర్నర్‌కు సాదర స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, నేవీ పోలీస్ అధికారులు గవర్నర్‌ను సాదరంగా స్వాగతించారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. అనంతరం ప్రోటోకాల్ మర్యాదలు స్వీకరించారు. బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్స వంలో గవర్నర్ పాల్గొంటారు. వివిధ రంగాల్లో సేవలందించిన సుమారు 80 మందికి గవర్నర్ చేతులు మీదుగా అవార్డులు ప్రధానం చేయనున్నారు. సాయంత్రం ఆంధ్రా యూనివర్శిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 85, 86 స్నాతకోత్స వానికి గవర్నర్ ముఖ్య అతిధిగా హాజరవుతారు. తదుపరి స్కాలర్లు, వివిధ రం గాల విద్యార్థులకు మెడల్స్, పట్టాలు ప్రదానం చేస్తారు. గవర్నర్ రాక సందర్భంగా విశాఖ జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

రూ. 300 కోట్ల పెట్టుబడులకు

'లైట్ ఆటో' సుముఖత




అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పారిశ్రామికరంగంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాల ఆనంద్ జాలాది రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు సీఈఓ జాస్తి కృష్ణకిషోర్ సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో వాహనాల విడిభాగాల తయారీలో రూ.300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ ప్రై.లి. సంస్థ ముందుకు వచ్చింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏదో ఒక ప్రాంతంలో కంపెనీ పెట్టుబడులు పెట్టనుంది. మొదటి దశలో రూ.100 కోట్లు, రెండవ దశలో రూ. 200 కోట్లు పెట్టుబడులను ఈ సంస్థ పెట్టనుంది. ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా మరో 350 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాల ఆనంద్ జాలాది తెలిపారు. ప్రధానంగా ఈ కంపెనీలో అల్యూమినియానికి ప్రత్యామ్నాయంగా మెగ్నీషియం లోహంతో వాహనాల విడిభాగాలు తయారు చేయనున్నారు. మెగ్నీషియంతో వాహనాల విడిభాగాలు తయారు చేయడం వల్ల వాహనాల బరువు తగ్గడంతోపాటు, ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని కంపెనీ సీఈఓ సుభాష్‌చరణ్ మీడియాకు వెల్లడించారు.

20 ఏళ్లుగా టీడీపీలోనే ఉన్నా

• మంత్రి గంటాతో సినీనటుడు ఆలీ

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: తెలుగుదేశం పార్టీలో 20 ఏళ్లుగా కొనసాగుతున్నానని, భవిష్య త్తులో కూడా అదే పార్టీలో ముందుకు సాగుతానని ప్రముఖ సినీనటుడు ఆలీ అన్నారు. మంగళవారం నగరానికి వచ్చిన ఆలీ రాష్ట్ర మానవ వనరుల అభి వృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలుసుకు న్నారు. ఈ సందర్భంగా వీరు పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. తాను తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతానని అయితే ప్రభుత్వం ఏర్పాటు కాగానే తనకు మైనారిటీ కోటా లో మంత్రి పదవి కేటాయించాలని, ఈ విషయాన్ని అధిష్టా నానికి నివేదించాలని మంత్రి గంటాను కోరినట్లు సమాచా రం. ఇక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తనను ఎప్పుడూ పార్టీలోకి స్వాగతించలేదని, కేవలం తమ ఇద్దరి మధ్య మంచి స్నేహం మాత్రమే ఉందన్నారు.







నేడు ప్రజాసంకల్పయాత్ర విజయ స్థూపం ఆవిష్కరణ

• రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా నాయకుల రాక • 175 నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జిలు... • భారీగా జనసమీకరణకు యత్నాలు • సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన పైలాన్

శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర నేడు జిల్లాలోని ఇఛ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో ముగియనుండటంతో యాత్ర ముగింపు గుర్తుగా నిర్మించిన విజయ స్థూపాన్ని (పైలాన్) బుధవారం వైకాపా అధినేత, రాష్ట్ర ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కానుంది. 2003లో వైఎస్ రాజశేఖరెడ్డి నిర్వహించిన ప్రజాప్రస్థానం పాదయాత్ర ముగింపునకు చిహ్నంగా నిర్మించిన పైలాన్‌కు దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఇప్పటి ప్రజాసంకల్పయాత్ర విజయోత్సవ స్థూపం నిర్మించారు. అయితే ప్రస్తుత పైలాన్‌ను దాదాపు కోటి రూపాయిల వ్యయంతో నిర్మించినట్లుగా పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. పైలాన్‌ను బుధవారం జగన్ చేతులమీదుగా ఆవిష్కరించనున్న నేపథ్యంలో దానిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇఛ్ఛాపురంలో ఎక్కడ చూసినా వైకాపా జండాలే రెపరెపలాడుతున్నాయి. పైలాన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజాసంకల్పయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభ కూడా నిర్వహిస్తుండటంతో ఈ కార్యక్రమానికి భారీఎత్తున ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు పెద్దఎత్తున కసరత్తు నిర్వహిస్తున్నారు. పాదయాత్ర మొత్తంగా జగన్ వెంట ఉండి అన్నింటినీ పర్యవేక్షిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, జిల్లాకు చెందిన వైకాపా నాయకులు ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారామ్, ఇఛ్ఛాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు నర్తు రామారావు, పిరియా సాయిరాజ్, నరసన్నపేట మాజీ ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాస్‌తో పాటు అందరు నాయకులు ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలనుంచికూడాపెద్దఎత్తున పార్టీ కార్యకర్తలను తరలించే ఏర్పాట్లు చేశారు. జిల్లా చరిత్రలోనే కాకుండా రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయే విధంగా పైలాన్ నిర్మాణం చేపట్టడమే కాకుండాప్రజాసంకల్పయాత్ర ముగింపు సభను నిర్వహించాలన్న గట్టిపట్టుదలతో వైకాపా నాయకులు అవసరమైన జనసమీకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ షర్మిల, చంద్రబాబునాయుడు నిర్వహించిన పాదయాత్రల కంటే ఎక్కువ దూరం నడిచి జగన్మోహనరెడ్డి రికార్డు నెలకొల్పారని, అందుకు తగ్గ విధంగానే యాత్ర విజయవంతానికి చిహ్నంగా పైలాన్ నిర్మాణం చేపట్టడం జరిగిందని వైకాపా నాయకులు తెలియచేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఈ ఘట్టం నిలిచిపోతుందని పేర్కొంటున్నారు.



పాదయాత్ర @ 341 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోలేదు. ఆయన కున్న వ్యాపార దక్షత పెట్టుబడిదార్లకు కూడా బాగా లాభాలు తెచ్చిపెట్టింది. 2009 సాధారణ ఎన్నికల్లో ఆయన తొలిసారిగా కడప పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు కూడా రాష్ట్రప్రయోజనాల కోసం ఢిల్లీలో మాట్లాడ్డం వరకే తప్ప అంతకుమించి ఎలాంటి రాజకీయాల్లోనూ ప్రత్యక్షంగా భాగస్వాములయ్యేవారుకాదు. వైఎస్ హఠాన్మరణంతో ముఖ్యమంత్రి పీఠం వారసత్వ సంపదగా తనకే దక్కాలన్న ఆకాంక్ష జగన్‌లో వెల్లువెత్తింది. అయితే ఇందుకు సోని యా అంగీకరించలేదు. ముఖ్యమంత్రి పదవికి తగిన అనుభవం జగన్‌కు లేదని పార్టీ నాయకులు కూడా విశ్లేషించారు. వైఎస్ హఠాన్మరణంతో గుండెలవిసి మృతిచెందిన వెయ్యికిమందికి పైగా అభాగ్యుల కుటుంబాల్ని నేరుగా పరామర్శించేందుకు జగన్ చేసిన ప్రయత్నానికి సోనియా అడ్డంపడ్డారు. దీంతో ఆ పార్టీ నుంచి బయటపడి తండ్రి పేరు కలిసొచ్చేలా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓదార్పుయాత్ర చేపట్టారు. రాష్ట్రప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో ప్రజాసమస్యలపై పోరాటం చేయాల్సిన జగన్ అసెంబ్లీలో చర్చించి ప్రయోజనం లేదనుకున్నారు. నేరుగా ప్రజా క్షేత్రంలోకడుగెట్టాలని నిర్ణయించారు. సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.

2003లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ పాదయాత్రకు నాందిపలికారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో పదేళ్ళ తెలుగుదేశం పాలనకు గండికొట్టి అధికారంలోకొచ్చారు. 2012 అక్టోబర్ 3నుంచి చంద్రబాబు పాదయాత్ర చేశారు. అనంతరం రాష్ట్ర విభజన వంటి సమస్యలు తలెత్తినా చంద్రబాబు సునాయాశం గానే అధికారంలోకొచ్చేశారు. ఈసారి జగన్ అంతకుమించిన సుదీర్ఘ యాత్ర తలపెట్టారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేవలం పారిశ్రామికవేత్తల్తో భేటీకి పరిమితమైన జగన్ పాదయాత్ర సందర్భంగా ఏ ఒక్క పారిశ్రామికవేత్తను దరిచేరనీయలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి 50వ సంవత్సరం తర్వాత పాదయాత్ర చేస్తే చంద్ర బాబు 60ఏళ్ళుదాటిన అనంతరం పాదయాత్ర నిర్వహించారు. కాగా 50ఏళ్ళ లోపు వయసులోనే జగన్ పాదయాత్ర నిర్వహించారు.

ఈ పాదయాత్రలో జగన్ 2516 గ్రామాల్ని సందర్శించారు. 231 మండల కేంద్రాలు, 51 పురపాలక సంఘాలు, 8 నగరపాలక సంస్థల మీదుగా ఈ పాదయాత్ర సాగింది. ప్రతిరోజు ఆయన నేరుగా 50 నుంచి 70 వేల మంది వరకు ప్రజల్ని కలుసుకునేవారు. ఇంత వరకు 123 సభల్లో ప్రసంగించగా సభ 124వ సభను ఇచ్ఛాపురంలో నిర్వహిస్తున్నారు. పాదయాత్ర సందర్భంగా ఆయన సమాజంలో సమస్యలెదుర్కొంటున్న వివిధ వర్గాల్తో ప్రత్యేకంగా భేటీలు జరిపారు. గుంటూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాకు కనకదుర్గ మ్మవారధి మీదుగా జగన్ పాదయాత్ర సాగిన సమయంలో జనం ఒత్తిడికి వంతెన కంపించింది. అలాగే కొవ్వూరు నుంచి రాజమండ్రి వరకు రోడ్‌కమ్‌రైలు వంతెన మీదుగా లక్షమందితో కలసి జగన్ పాదయాత్ర నిర్వహించారు. ఎదుర్లంక నుంచి యానాం వరకు గౌతమీ నదిపై కూడా వేలాదిమందితో నిర్వహించిన పాదయాత్ర ఈ ప్రాంతంలో ప్రకంపనలు సృష్టించింది. దారిపొడవునా జగన్ చూసేందుకు యువత, మహిళలు పోటీలుపడ్డారు. కాగా ఈ సారి పాదయాత్రలో సెల్ఫీలు ప్రత్యేక ఆకర్షణగా నిల్చాయి. జగన్‌తో సెల్ఫీల కోసం జనం ఎగబడ్డారు. ప్రతి ఒక్కర్ని కూడా దగ్గరగా తీసుకుని జగనే స్వయంగా సెల్ఫీ తీసుకుని తిరిగి వారికివ్వడం నవ్వుతు సాగనంపడం అందర్నీ ఆకట్టుకుంది. ఈ పాదయాత్ర సందర్భంగా సుమారు 5 లక్షలకుపైగా సెల్ఫీలు దిగుంటారని ఓ అంచనా. పాదయాత్రలో ఆయన వ్యవహరించిన తీరు అడుగడు గునా తండ్రి వైఎస్‌ను గుర్తుకు తెచ్చింది.

దమ్మున్న నేతలు కావాలి

(మొదటిపేజీ తరువాయి)



భాగంగా మంగళవారం విజయవాడ రాష్ట్ర కార్యా లయంలో కర్నూలు జిల్లా నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 ఎన్నికలు జనసేనకు మొదటి పోరాటమేనని, ఇదే ఆఖరి పోరాటం కాదని, రాజకీయాల్లో ఓ స్థాయికి రావాలంటే కనీసం ఓ దశాబ్దం ఓపిక ఉండాలన్నారు. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఆసన్నమైందని, అయితే కొత్తవాళ్లు ఎంతవరకు నిలబడతారన్నదే అసలు సమస్యని, దెబ్బ కొడితే అంతకు మించి బలమైన పోరాటం చేసే శక్తి ఉన్నవాళ్లు కావాలని, అలాంటి వారిని గుర్తించాలంటే, తయారు చేయాలంటే సమయం కావాలన్నారు. కర్నూలు జిల్లాతో తనకున్న అనుబంధం ఈనాటిది కాదని, అయితే హత్తి బెళగళ్ పేలుళ్లు జరిగినప్పుడు తాను బాధితుల్ని పరామర్శించేందుకు బయలుదేరినప్పుడు జనం రారని చెప్పారని, కానీ రోడ్లు పట్టనంత జనం వచ్చినప్పుడు సగటు కుటుంబాలు ఏస్థాయిలో మార్పు కోరుకుంటున్నాయో అర్థమయిందన్నారు. 2014లో అతికొద్ది మంది తో పార్టీ ప్రారంభించాక ఇంత మంది అభి మానం చూరగొనడానికి ప్రజలకు రాజకీయాలపై ఉన్న వ్యతిరేకతే కారణమన్నారు.

పాలకులు అందుబాటు లో ఉన్న వనరుల్ని అందరికీ ఆమోదయోగ్య రీతిలో పంచితే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావని, అందరికీ సమానమైన రీతిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే జనసేన లక్ష్యమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నాయకులకి కోట్లు దోచు కోవడంలో ఉన్న తెలివి తేటలు, శ్రద్ధ యువతికి ఉపాధి కల్పించడంలో ఉండవని, స్థానిక పరిస్థితులు అర్థం చేసుకోకుండా రాజకీయాలు చేయ లేమన్నారు. కులాల కాన్సెప్ట్‌తో అసలు నడపలేమని, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని బలంగా నిలబడగలగాలన్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు మెజారిటీ శాతం కొత్తవారే ఉండాలన్న లక్ష్యంతో 60శాతం సీట్లు ఇస్తానని చెప్పానని, సంక్రాంతి పండగ లోపు స్వల్ప కాలిక కమిటీలు వేసి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. అవసరం అనుకుంటే మధ్యలో మార్పులు చేర్పులు చేద్దామని, యువతకి రాజకీయంగా ఎదగాలన్న కసి ఉన్నా పొలిటికల్ శక్తులు ఎదగనివ్వవని, కర్నూలు లాంటి జిల్లాలో అయితే ప్రజలు కుంటుంబాల మధ్య నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో రెండు రకాల శక్తులు ఉంటాయని, ఒకటి పాలసీ మేకింగ్ అయితే రెండోది మాస్ ఫాలోయింగ్అని, జనసేనకి రెండు రకాల బలం ఉన్నవాళ్లు కావాలన్నారు. కొత్త పార్టీ అంటే అంతా కొత్త నాయకులే ఉన్నా నిలబడలేమని, అనుభవం, మన సిద్ధాంతాలకి దగ్గరగా ఉన్న సీనియర్ల అవసరం కూడా ఉందన్నారు. 175 స్థానాల్లో పోటీపై తనకు స్పష్టత ఉందని, ఎన్ని స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలన్న అంశం మీద కూడా స్పష్టత ఉన్నట్లు తెలిపారు.

హాస్టళ్ళకు కులాల పేర్లు తీసేస్తాం : పవన్

అమరావతి, ఆంధ్రప్రభ: విద్యార్థి దశనుంచే బీసీ హాస్టల్స్, ఎస్సీ హాస్టల్స్ అంటూ కుల వ్యవస్థని పెంచి పోషిస్తున్నారని, జనసేన పార్టీ మాత్రం అలా చేయదని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టంచేశారు. మంగళవారం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జనసేన పార్టీ పాటుపడుతుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం రావాలని, అందుకోసం అవకాశం చిక్కినప్పుడల్లా వివిధ అంశాలపై లోతైన చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు రాజకీయాల మీద ఆసక్తి చూపడం మార్పుకి సూచకమని పవన్ కళ్యాణ్ తెలిపారు.

నేడు తిరుమలకు వైసీపీ అధినేత జగన్

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్ర ముగింపు అనంతరం బుధవారం రాత్రి బయలుదేరి తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్ళనున్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దగ్గర తనపాదయాత్ర ముగియనుంది. సాయంత్రం 6గం.లకు ఇచ్ఛాపురంలో బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా విజయ నగరం చేరుకుంటారు. అక్కడి నుండి 8.30గం.లకు రైలులో బయలుదేరి 10వ తేది ఉదయం 10గం.లకు చిత్తూరుజిల్లా రేణిగుంట చేరుకుంటారు. రేణిగుంట నుండి బయలుదేరి 10.30గం.లకు తిరుమల పద్మావతి గెస్ట్‌హౌస్ కు వెళ్తారు. మధ్యా హ్నం 1గం.లకు బయలుదేరి తిరుమల వెళ్ళి స్వామివారిని దర్శించుకోనున్నారు. తిరిగి 5.30గం.లకు పద్మావతి గెస్ట్‌హౌస్ చేరుకుని అక్కడవిశ్రాంతి తీసుకోనున్నా రు. 11వతేది ఉదయం 6గం.లకు తిరుమల నుండి బయలుదేరి పులివెందుల వెళ్తారు. మ. 12గం.లకు పులివెందుల చేరుకుంటారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆయనకు జెడ్ క్యాటగిరిలో బందోబస్తు కల్పించనున్నారు.

భారత్ - నార్వే సహజ భాగస్వాములు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్




న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఇండియా వంటి కార్యక్రమాలకు నార్వే సహకారం అందించాల్సిందిగా ఆ దేశ ప్రధాన మంత్రి ఎర్న సొల్‌బెర్గ్‌ను భారత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కోరారు. మొదటి సారిగా భారత పర్యటనకు వచ్చిన ఆమె రాష్ట్రపతి భవన్‌లో రామ్ నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య స్నేహపూర్వకమైన బంధాలు ఉన్నాయని, సహజ భాగస్వామ్య దేశాలని రాష్ట్రపతి కోవింద్ అన్నారు. న్యాయం, భిన్న సంస్కృ తులు, మానవ హక్కులకు గౌరవం ఇవ్వడంతొపాటు ఇరు దేశాలు ధృఢమైన ప్రజా స్వామ్యాన్ని కలిగివుండడంతో హజ భాగస్వాములని రాష్ట్రపతి అభిప్రాయపడ్డా రు. ఇందిరా గాంధీ హయాంలో ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాలు వృద్ధి చెందాయని, కానీ శక్తి, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాలలో బంధాలు మరింత వృద్ధి సాధించాల్సి ఉందని రాష్ట్రపతి అన్నారు. షిప్పింగ్, పోర్టు నిర్వహణ, చేపల వేట, రక్షణ, శక్తి రంగాల్లో నార్వే సామర్థ్యం ప్రపంచానికి తెలుసునని, మేక్ ఇన్ ఇండియా, స్మార్ట్ సిటీస్, క్లీన్ ఇండియా, సాగర్ మాల వంటి ప్రాజెక్టులకు నార్వే సహకారం కోరుతున్నామని కోవింద్ వెల్లడించారు.

మోడీతో ఎర్న సొల్‌బెర్గ్ భేటీ

రాష్ట్రపతితో భేటీ అనంతరం ఎర్న సొల్‌బెర్గ్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. కీలకమైన ద్వైపాక్షిక అంశాలపై ఇరువురూ చర్చించారు. సముద్ర ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకరిస్తామని నార్వే ప్రధాని అంగీకరించారు. ఈ మేరకు ఇరుదేశాల మధ్య ఎంఓయూ కుదిరింది. అత్యధిక జనాభా కలిగివున్న భారతలాంటి దేశం సహకారం లేకుండా సుస్థిర అభివృద్ధి సాధ్యం కాదని, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సహకరిస్తామని ఎర్న సొల్‌బెర్గ్ స్పష్టం చేశారు. భారతలోని మహిళ సాధికారత తనకు నచ్చిందని ఆమె తెలిపారు. 2017లో జరిగిన జీ-20 సదస్సులో నార్వే ప్రధాని ఎర్న సొల్‌బెర్గ్‌ను తాను కలిసినప్పుడు ఆమె తనకు ఓ ఫుట్‌బాల్ బహుకరించారని, ఈ ఫుట్‌బాల్ గోల్(లక్ష్యం)ను సూచిం చిందని, సుస్థిర అభివృద్ధికి సంకేతమని, పలు రంగాల సహకారంలో ఇరు దేశాలు విజయవంతమయ్యాని మోదీ అన్నారు.

ANDHRA PRADESH
India's Sunrise State

EDB
ANDHRA PRADESH ECONOMIC DEVELOPMENT BOARD



ప్రకాశంకే.. మహాప్రకాశం
పారిశ్రామిక మహా వికాసం

పైలాన్ ఆవిష్కరణ
ఆసియా పల్ప్ మరియు పేపర్
రావూరు (గ్రామం), చేవూరు (గ్రామం), గుడ్లూరు (మండలం), ప్రకాశం జిల్లా

శంఖుస్థాపన
రామాయపట్నం పోర్ట్
ప్రకాశం జిల్లా

ప్రారంభకులు
మాన్యశ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వారిచే
దిII 09 జనవరి 2019

ఆంధ్రప్రదేశ్, మహానాయకుని సమర్ధ నేతృత్వంలో, పెట్టుబడుల రంగంలో అభివృద్ధి దిశగా మరో సరిక్రొత్త మైలురాయిని సాధిస్తుంది. ఈ రెండు మహా సంస్థలు ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలుపుతాయి. 2022 నాటికి భారతదేశంలో అత్యంత మూడు అభివృద్ధిచెందిన రాష్ట్రాల్లో ఒకటిగా అత్యున్నత స్థానం సంపాదిస్తాయి.

ఆసియా పల్ప్ మరియు పేపర్

ప్రపంచ అతిపెద్ద పేపర్‌మిల్లుల్లో ఒకటి

రూ. 24500 కోట్లు — ఇటీవలి కాలంలో భారతదేశంలో అతిపెద్ద విదేశీపెట్టుబడి
2500+ — ఎకరాల ప్రాజెక్టు విస్తీర్ణం
50000+ — కాగితగుజ్జు తయారి రైతులకు లబ్ధి
16000+ — ఉద్యోగ అవకాశాలు (ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగాలు)

APP sinarmas

పప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో భారతదేశంలో అతిపెద్ద విదేశీపెట్టుబడి రూ. 24500 కోట్లతో, ఆసియా పల్ప్ మరియు పేపర్ (ఏపిపి) ఇండోనేషియా సంస్థ తన కర్మాగారం నెలకొల్పుతోంది. ఏటా ఐదు మిలియన్ టన్నుల ఉత్పత్తితో, రాష్ట్రంలో తొలి గ్రీన్‌ఫీల్డ్ పల్ప్ మరియు పేపర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తోంది. ఈ నూతన ప్లాంట్-ప్రపంచంలోనే అతిపెద్ద పేపర్ మిల్లుల్లో ఒకటి. ఏపిపి విశ్వవ్యాప్తంగా 120 దేశాలలో విస్తరించిన అతిపెద్ద పల్ప్ మరియు పేపర్ కంపెని.

రామాయపట్నం పోర్ట్

ఆంధ్రప్రదేశ్‌లో 15వ పోర్టు

రూ.5000 కోట్లు — ప్రాథమిక పెట్టుబడి
3500+ — ఎకరాల ప్రాజెక్టు విస్తీర్ణం
25000+ — ఉద్యోగ అవకాశాలు (ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగాలు)
సదవకాశం — విదేశీపెట్టుబడులను ఆకర్షించే ప్రతిపాదిత పామూరు నిమ్జ్ & దొనకొండ పారిశ్రామిక కారిడార్

RAMAYAPATNAM PORT
GOVERNMENT OF ANDHRA PRADESH

ఆంధ్ర ప్రదేశ్, ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం పోర్ట్ - అత్యంత అభివృద్ధి కారక ప్రాజెక్టు. ఆంధ్ర ప్రదేశ్‌లో 15వ పోర్టు. రూ.5,000 కోట్ల ప్రాథమిక పెట్టుబడితో 3,500 ఎకరాల విస్తీర్ణంలో 1,200 ఎకరాల ప్రైవేటు భూమితో సహా విస్తరించి ఉంది. ఇది పారిశ్రామికాభివృద్ధికి స్వాగత ద్వారంలా నిలిచి, సిమెంటు పరిశ్రమకు వెన్నముకగా మారుతుంది. ప్రత్యక్ష, పరోక్షంగా 25,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 9 జనవరి 2019

శిష్యుడి వల్ల మోడీకి అన్నీ షా కులే!

ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ-2 ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ పూర్తిగా స్వయం కృతమే. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరక్టర్ పదవి నుంచి నాలుగు నెలల్లో రిటైర్ కానున్న అలోక్ వర్మను గత అక్టోబర్ లో మోడీ ప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపడాన్ని సుప్రీంకోర్టు తప్పు పడుతూ, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కొట్టి వేసింది.వర్మను ఆ పదవిలో కొనసాగించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.ప్రజాస్వామ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి కీలకమైన అంశంపై నోటిఫికేషన్ కొట్టివేయడం, ఆదేశాలు జారీ చేయడం ఏ ప్రభుత్వానికైనా ఘోరమైన అవమానం.ఇంతటి అవమానం మోడీ ప్రభుత్వానికి కలగడానికి కారణం ఆయన శిష్యుడు,బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాయే .రాకేష్ ఆస్తానా అనే ఐపీఎస్ అధికారిని గుజరాత్ నుంచి తీసుకుని వచ్చి సీబీఐ ప్రత్యేక డైరక్టర్‌గా చేయించింది అమిత్ షాయే. అమిత్ షా కేసుల కారణంగానే వర్మకూ,ఆస్తానాకూ మధ్య విభేదాలు పొడసూపాయి.

అవి చివరికి పరస్పరం ఆరోపణలు చేసుకోవడం వరకూ వెళ్ళాయి.మాంసం వ్యాపారి మొయిన్ ఖురేషి నుంచి ఆస్తానా లంచం తీసుకున్నట్టు కేసు నమోదు అయింది.ఆ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ డీఐజీ మనీష్ కుమార్ సిన్హాను నాగపూర్‌కు బదిలీ చేయించడంతో ఆయన కోర్టుకు వెళ్ళారు.ఈ కేసులో ఆస్తానాను అమిత్ షా వెనకేసుకొస్తున్నారనీ, ఈ కేసులో కేంద్ర మంత్రి హరిభాయ్ పార్థిభాయ్ చౌదరికి ముడుపులు అందాయనీ, ఈ కేసు దర్యాప్తులో ఆస్తానాకు అనుకూలంగా వ్యవహరించాలని తనపై ఒత్తిడి వచ్చాయంటూ అప్పట్లో చేసిన ఆరోపణ పెను సంచలనాన్ని సృష్టించింది. ఆస్తానాను అమిత్ షా కాపాడుతున్నారంటూ ఎంపీల నుంచి ఆరోపణలు కూడా వచ్చాయి. ఆస్తానా అప్పటి సీబీఐ డైరక్టర్ అలోక్ వర్మపై ఎదురు దాడి చేశారు. ఖురేషీ కేసులో కీలక సాక్షి అయిన హైదరాబాద్‌క ు చెందిన సానా సతీష్ బాబును ప్రశ్నించవద్దని అలోక్ వర్మ ఫోన్ చేశారని ఆస్తానా బహిరంగంగానే ఆరోపించారు. దానిని అలోక్ వర్మ ఖండించారు.సీబీఐ ప్రత్యేక డైరక్టర్ ఆస్తానా, డైరక్టర్ అలోక్ వర్మలు బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని అలోక్ వర్మను సెలవులో పంపింది.ఆయన స్థానే ఎం నాగేశ్వరరావును తాత్కాలికంగా నియమించింది.తనను సెలవులో పంపడాన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ న్యాయపోరాటంలో వర్మ గెలిచారు.ఆయనను తిరిగి డైరక్టర్ పదవిలో నియమించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.ఈ మొత్తం వ్యవహారం అంతా బహిరంగంగానే చోటు చేసుకోవడంతో సీబీఐ విశ్వసనీయత దెబ్బతింది. పంజరంలో పక్షిలా సీబీఐ పని చేస్తోందంటూ గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య అక్షరాలా నిజం అయిందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

బొగ్గు కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించిన పత్రాలను సీబీఐ నుంచి పూర్వపు యూపీఏ ప్రభుత్వం తెప్పించుకున్నందుకు సీబీఐని సుప్రీంకోర్టు పంజరంలో పక్షి అని అభివర్ణించింది. యూపీఏ ప్రభుత్వం అమిత్ షాపై దర్యాప్తు చేసినప్పుడు సీబీఐని యూపీఏ ప్రభుత్వం జేబు సంస్థగా వాడుకుంటోందంటూ కమల నాథులు ఆరోపించారు. టూజీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే నాయకుడు,అప్పటి మంత్రి ఎ రాజానూ, డిఎంకె ఎంపీ కనిమొళిని అరెస్టు చేసినప్పుడు సీబీఐపై డీఎంకే నాయకులు ఇదే మాదిరి ఆరోపణలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల ఆదేశాల ప్రకారం సీబీఐ పని చేస్తుందన్న అపవాదును ఆ సంస్థ మూటగట్టుకుంది.రాష్ట్రా ల్లో కుంభకోణాలు వెలుగులోకి వచ్చినప్పుడు సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిన నాయకులే తాము సీబీఐ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రాడర్‌లోకి వచ్చినప్పు డు ఆ రెండు సంస్థలపైనా ఆరోపణలు చేయడం సర్వసాధారణమైంది.

అందుకు తగినట్టుగానే సీబీఐ అధికారులు అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తుండటం కూడా సర్వసాధారణమైంది. యూపీఏ ప్రభుత్వాన్ని గతంలో తీవ్రంగా విమర్శించిన కమలనాథులు తమ ప్రభుత్వంలో కూడా సీబీఐని రాజకీయ ప్రయోజనాల కోసం పావుగా ఉపయోగించుకుంటున్నారనడానికి రాకేష్ ఆస్తానా, అలోక్ వర్మలు బహిరంగంగా చేసుకున్న ఆరోపణలే ప్రత్యక్షనిదర్శనం.

అలోక్ వర్మ పదవీ కాలపరిమితి జనవరి 31వ తేదీతో ముగియనుంది.అలోక్ వర్మ తన అవినీతిపై దర్యాప్తునకు ఆదేశించినందుక ు ప్రతీకారంతో వర్మపై ఆస్తానా ఎదురు దాడి చేశారు.వర్మపై ఆస్తానా చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది.అది పూర్తి అయ్యే వరకూ ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని వర్మను సుప్రీంకోర్టు ఆదేశించింది.ఆయన అగౌరవంగా రిటైర్ కాకుండా,గౌరవ ప్రదంగా రిటైరయ్యేందుకు సుప్రీంకోర్టు తాజా తీర్పు వీలు కల్పించినట్టయింది.ఆస్తానా గుజరాత్‌లో ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పుడు అప్పట్లో రాష్ట్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా ప్రాపకంతోనే అంచలంచెలుగా పదోన్నతులు పొందాడు.అప ్పట్లో అమిత్ షా ఎన్‌కౌంటర్ల షాగా పేరుమోసారు. మౌఖికంగా ఇచ్చిన ఆదేశాలతోనే పోలీసు ఎన్‌కౌంటర్లు చేసినట్టు చాలా కాలం జైలు శిక్ష అనుభవించిన పోలీసు ఉన్నతాధికారి వంజారా ప్రత్యేక దర్యాప్తు విభాగం సిట్‌కి వాంగ్మూలం ఇచ్చారు.

అలాగే,అమిత్ షా ఆదేశాలను పాటించనందుకు సంజీవ్ భట్ అనే పోలీసు అధికారి జైలు పాలయ్యాడు.అమిత్ షా వల్ల ఎంతో మంది నిజాయితీ పరులైన పోలీసు అధికారులు వేధింపులకు గురయ్యారు.అదే మాదిరిగా అమిత్ షా ఆదేశాలను పాటించినందుకు జైలుపాలైన అధికారులూ ఉన్నారని విమర్శలున్నాయి. ప్రధాని మోడీ తన శిష్యుడు అమిత్ షాని గుడ్డిగా నమ్మినందుకు ఇటీవల మూడు రాష్ట్రా ల్లో పార్టీ ఓటమి సంభవించిందని పార్టీలో విస్తృతంగా చర్చ సాగుతోంది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానంలో ఎదురు దెబ్బతగిలింది.

పాదయాత్రలు - ప్రభావాలు!







భారత దేశం ఆది నుంచి పాదయాత్రలకు పెట్టింది పేరుగా గుర్తింపు పొందింది. ఆధ్యాత్మిక, రాజకీయ, ప్రజాసమస్యలకు పాదయాత్రలు పరిష్కార వేదికలుగా మారాయి. చరిత్రలోకి వెళ్ళి చూస్తే పాదయాత్రలు మన దేశంలో కొత్త కాకపోయినా.. ప్రతి విజయం ఒక కొత్త సందేశానికి సంకేతంగా నిలుస్తూ వస్తున్నాయి. ప్రజలను నేరుగా కలుసుకోడానికీ, వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకోవడానికి పాద యాత్రలు ఎంతో ఉపయోగపడతాయి. పాదయాత్రలు చేసిన వారిలో ఎక్కువమంది రాజకీయ నాయకులే ఉన్నారు. ఆధ్యాత్మిక ప్రచారానికి వివిధ మతాధిపతులూ, పీఠాధిపతులూ కూడా దేశమంతటా పర్యటిస్తూ ఉంటారు. అయితే, నడిచే దైవంగా ఇప్పటికీ భక్తుల కైమోడ్పులు అందుకుంటున్న కంచికోటి పీఠం పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతి మహాస్వామి పాదయాత్ర చరిత్రలో ఒక సువర్ణ ఘట్టాన్ని ఆవిష్కరించింది. ఆది శంకరుల స్ఫూర్తితో ఆయన దేశమంతటా పాదయాత్ర జరిపారు.

చరిత్రలోకి వెళితే, స్వాతంత్ర్య సంగ్రామానికి సారథ్యం వహించిన మహాత్మాగాంధీ జరిపిన పాదయాత్ర చరిత్ర లిఖితమైంది. మహాత్మాగాంధీ వడిగా నడిచేవారనీ, పరుగుమాదిరి సాగిన ఆయన పాదయాత్రలో పాల్గొన్న మన తెలుగు స్వాతంత్ర్య యోధులు తమ అనుభవాలను గ్రంథస్థం చేశారు. పాదయాత్రలు జరిపితే ప్రజల గుండె చప్పుడు వినవచ్చు. ప్రజల ఈతి బాధలను కళ్ళారా చూడవచ్చు. రహదారులు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేక అల్లాడుతున్న ప్రజల కష్టాలనూ, కడగండ్లనూ స్వయంగా చూడవచ్చు. ఈ ఉద్దేశ్యంతోనే నాయకులు పాదయాత్రలు జరుపుతూ ఉంటారు. 1930వ దశకంలో మహాత్మాగాంధీ జరిపిన దండి యాత్ర ప్రజల్లో సమైక్యతా భావాన్ని ప్రోది చేసింది. ఉప్పుసత్యాగ్రహం కూడా ప్రజల్లో జాతీయ భావాలను పాదుకొల్పింది. మన ఉప్పుపై ఆంగ్లేయులు పన్నువేయడమేమిటన్న ప్రశ్న ప్రజల హృదయాలను తాకింది. అందుకే, ఆయన జరిపిన పాదయాత్రల్లో, సత్యాగ్రహాలలో సామాన్యులే కాకుండా, సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తుల్లో ఉన్నవారు ముందూ వెనకా ఆలోచించకుండా వచ్చి చేరారు. గాంధీగారి తర్వాత భూదానోద్యమ నాయకుడు ఆచార్య వినోబాభావే నిర్వహించిన పాదయాత్ర మన తెలుగు రాష్ట్రాల మీదుగా సాగింది. వినోబాభావే పిలుపుపై తెలంగాణలో పోచంపల్లి గ్రామవాసులు వందలాది ఎకరాల భూములను దానం చేశారు. ఆ కారణంగానే ఆ గ్రామానికి భూదాన్ పోచంపల్లి అనే పేరు స్థిరపడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎందరో నాయకులు రథయాత్రలూ, బస్సు యాత్రలు జరిపి చరిత్ర సృష్టించారు. రథయాత్ర అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చేది బీజేపీ అగ్రనాయకుడు ఎల్ కె అద్వానీ అయోధ్యకు జరిపిన రథయాత్ర. 1990వ దశకంలో ఇరవై ఏడేళ్ళ క్రితం అద్వానీ నిర్వహించిన రథయాత్ర లోక్‌సభలో బీజేపీ బలం రెండు స్థానాల నుంచి 200 స్థానాలకు పెరిగేందుకు దోహదం చేసింది. ఆయన పాదయాత్రను బీహార్‌లో అప్పటి ముఖ్యమంత్రి లాలూ ఆపేశారు. ఆయనను అరెస్టు చేశారు. దేశ రాజకీయ చరిత్రలో పెద్ద మలుపునకు కారణమైంది. బీజేపీలో అద్వానీ తరానికి చెందిన డాక్టర్ మురళీ మనోహర్ జోషి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ నిర్వహించిన ఏక్తా యాత్ర కూడా బీజేపీ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్ళేందుకు తోడ్పడింది. మాజీ ప్రధాని, జనతా పార్టీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ జనతాపార్టీ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత 1980లో జరిపిన పాదయాత్ర కూడా యువకులను ఉత్సాహ పర్చింది. లోక్ నాయక్ జయప్రకాష్ భావజాలాన్ని వ్యాపింపజేయడం కోసం ఆయన కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు 4,200 కిలోమీటర్ల ఆ పాద యాత్ర ఆయన ప్రధాని అయ్యేందుకు సోపానమైంది. ఉత్తరాఖండ్‌లో పర్యావరణవేత్త సుందర్‌లాల్ బహుగుణ పర్యావరణ పరిరక్షణ గురించి జనాన్ని జాగృతం చేయడం కోసం సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. పర్యావరణ వేత్తలందరికీ పితామహునిగా ఇప్పటికీ జేజేలు అందుకుంటున్న సుందరలాల్ బహుగుణ ఈ ఉద్యమంలో మేధాపాట్కర్, వందనా శివ, వంటి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమయ్యారు.

ఉత్తరప్రదేశ్‌లో షెట్కారీ సంఘటన్ నాయకుడు మహేంద్రసింగ్ తికాయిత్ రైతుల సమస్యల సాధన కోసం ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మహారాష్ట్రలో రైతు నాయకుడు శరద్ జోషి పాదయాత్రను నిర్వహించారు.

వెనకటి తరానికి చెందిన బాలీవుడ్ నటుడు, మాజీ కేంద్రమంత్రి సునీల్‌దత్ 1987లో ముంబాయి నుంచి అమృతసర్‌కు జరిపిన పాదయాత్ర చారిత్రాత్మకమైంది. ఆయన కుమార్తె, మాజీ ఎంపీ ప్రియాదత్ కూడా ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఖలిస్తాన్ తీవ్రవాదుల దాడుల కారణంగా పంజాబ్ అగ్నిగుండంగా మారిన సమయంలో ప్రజలకు ధైర్యాన్ని కలిగించేందుకు సునీల్‌దత్ జరిపిన పాదయాత్ర ఆయనకు శాంతిదూత అనే పేరు వచ్చేట్టు చేసింది. పాదయాత్ర కాకపోయినా ఆ రోజుల్లో ఆయన ఎత్తయిన సియాచిన్ ప్రాంతానికి వెళ్ళి సరిహద్దులను పరిరక్షించే జవాన్లకు స్థైర్యాన్ని కలిగించారు. స్వాతంత్ర్య సమరంలో తూర్పు బెంగాల్‌లోని నౌఖాలి ప్రాంతంలో 1946 లో మత ఘర్షణలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు మహాత్మాగాంధీ పాదయాత్ర జరిపారనీ, కేరళలో మాప్లాల తిరుగుబాటు బాధితులనూ, నైజాంలో రజాకార్ల దాడులలో బాధితులకు ధైర్యం చెప్పేందుకు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పాదయాత్రలు జరిపినట్టు స్వాతంత్ర్య యోధుడు క్రొవ్విడి లింగరాజు పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పదహారేళ్ళ క్రితం 2003లో ఆనాటి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుంచి ఇచ్ఛాపురం వరకూ దాదాపు 1500 కిలోమీటర్లు మహాప్రస్థానం పేరిట జరిపిన పాదయాత్ర తెలుగు జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ పాదయాత్ర కారణంగానే ఆయన ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడు అయ్యారు. 2004లో ముఖ్యమంత్రి పదవికి ఎంతోమంది పోటీపడినా, ఆయనకున్న జనాదరణను గీటురాయిగా తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం ఆయననే ఆ పదవికి ఎంపిక చేసింది. అత్యున్నత పదవిని చేరేందుక ు పాదయాత్ర సోపానంగా వైఎస్‌ఆర్ హయాంలో స్థిరపడింది. ఆయన కర్నూలు జిల్లా పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో దుర్మరణం పాలై దాదాపు పదేళ్ళు కావస్తున్నా, తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు అసంఖ్యాకంగా ఉన్నారు. వైఎస్‌ఆర్ అమలు జేసిన ఉచిత విద్యుత్, కార్పొరేట్ వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఆయనకు విశేషమైన జనాదరణ లభించేట్టు చేశాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరిట ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ జనం నాలుకల మీద నడయాడుతున్నాయి. ఆయన కుమార్తె షర్మిల ఇడుపులపాయ నుంచి 2012 అక్టోబర్‌లో పాదయాత్ర ప్రారంభించి 3,112 రోజులు పాదయాత్ర జరిపారు. ఆమె పాదయాత్ర ప్రభావం కూడా మహిళలపై ఎక్కువ కనిపించింది. ఆ తర్వాత అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా హిందుపురం నుంచి విశాఖ వరకూ 2,800 కిలోమీటర్ల పాదయాత్ర జరిపి ప్రజల సమస్యలను ఆకళింపు చేసుకున్నారు. ఆ పాదయాత్రలో జనాభిప్రాయానికి అనుగుణంగానే రైతుల రుణమాఫీ పథకాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు జేశారు. 2012 అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమైన ఆయన పాదయాత్ర 2013 ఏప్రిల్ 13వ తేదీతో ముగిసింది. చంద్రబాబు పాదయాత్రకు విశేషమైన జనాదరణ లభించింది. పాదయాత్రలో అడుగడుగునా ఆయన సామాన్య జనావళితో మమేకమై కదిలారు. నిత్యం జనంలో ఉండే నేతగా ముద్రపడిన చంద్రబాబు ఆ పాదయాత్రతో జనం గుండెలను తాకగలిగారు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యేందుకు దోహదం అయింది. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జనసంపర్క్ పాదయాత్ర జరిపారు. పోలవరం ప్రాజెక్టు సాధన కోసం వడ్డి వీరభద్రరావు సుదీర్ఘ పాదయాత్ర జరిపారు. పాదయాత్రల పర్వంలో బుధవారంనాడు వైఎస్ జగన్ ముగించనున్న ప్రజాసంకల్ప యాత్ర కూడా రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఈ యాత్ర సందర్భంగా ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నా, మొక్కవోని ధైర్యంతో ఆయన ముందుకు సాగారు. ప్రతి శుక్రవారం ఆస్తుల కేసులో హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. బాలలు, వృద్ధులు, యువకులు, మహిళలతో సహా అన్ని వర్గాల ప్రజలు ఆయనకు నీరాజనం పలికారు. జగన్ పాదయాత్రకు గత అక్టోబర్ మాసంలో కొద్ది రోజుల బ్రేక్ వచ్చింది. హైదరాబాద్ వెళ్ళేందుకు విశాఖ విమానాశ్రయం చేరుకున్న ఆయనపై అక్కడి క్యాంటిన్‌లో పనిచేసే శ్రీనివాసరావు అనే యువకుడు దాడి చేయడంతో జగన్ పదిహేను రోజుల పాటు హైదరాబాద్‌లో చికిత్సపొంది మళ్ళీ పాదయాత్ర ప్రారంభించి 3,600 పైగా కిలోమీటర్ల దూరం నడిచి అందరి రికార్డులను అధిగమించారు. ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు సుదీర్ఘ పాదయాత్ర జరిపిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుంది. జగన్ పాదయాత్రకు అపూర్వమైన ప్రజాస్పందన కనిపించింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా పాదయాత్ర చిహ్నంగా ఇచ్ఛాపురంలో 88 అడుగుల ఎత్తున 13 అంతస్తుల స్థూపాన్ని బుధవారం జగన్ ఆవిష్కరించనున్నారు.

-తేజోన్మయ్

ఆసియాలో అస్థిరతకు చైనా ఆజ్యం!

అంతర్జాతీయ రాజకీయాలు ఆసియా దేశాలలోనే జరుగుతున్నాయి. గల్ఫ్ దేశం అయిన ఇరాన్ మీద అమెరికా ఆంక్షలు, చమురు రాజకీయాలు, ఒపెక్ చమురు దేశాల నిర్ణయాలపై అమెరికా పెత్తనం, పాకిస్తాన్‌ను చైనా లోబరచుకోవడం పాక్ - చైనాల మధ్యా సియాచిన్ మంచు కొండల్లో రోడ్డు నిర్మాణం, నేపాల్ కారిడార్‌లో డోక్లాం ప్రాంతంలో ఉల్లంఘనలు,మయన్మార్ (బర్మా)లో రోహింగ్యాలు ముస్లింలను వెళ్ళగొట్టడం దక్షిణ చైనా సముద్రంలో సైనిక విన్యాసాలు మొదలైన వాటితోపాటు అమెరికా చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ....ఇవన్నీ ఆసియాదేశాల్లోనే...

లంకలో చైనా సైనిక స్థావరాల నిర్మాణంః శ్రీలంక తాజా సంక్షోభానికి ఆర్థిక లొంగుబాటు మరియు శ్రీలంక పార్లమెంటులో ఆధిపత్యపోరు అన్ని చైనా దక్షిణాసియా ప్రాంతంలో ఆధిపత్యం చివరకు చైనా అగ్రరాజ్యం హోదాను పొందేందుకు చేసే ఎత్తుగడలే కారణం. శ్రీలంకలో ఏమి జరుగుతుందో పరిశీలిస్తే మనకు స్పష్టంగా అర్థం మవుతున్నదేమిటి? అందుకు పరిష్కారం ఏమిటి?

1990 వ దశకంలో శ్రీలంక జాతుల సమస్య చెలరేగినపుడు భారతదేశం శ్రీలంకకు భారత సైన్యాన్ని పంపి పెద్ద సమస్యలను ఎదుర్కొంది. శ్రీలంకలో అధికులు సింహళీయులు, మైనారిటీలుగా బ్రిటిష్ వలస ప్రాంతాల నుండి శ్రీలంకకు వెళ్ళిన వారిలో తమిళులు అధికులు. వీరు తూర్పు ఈలం ప్రాంతంలో రబ్బరు తోటలు, వ్యవసాయం చేసుకొనే కూలీలు. గత 150 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో అధికులుగా ఉండి శ్రీలంక దేశ అభివృద్ధిలో భాగం పంచుకొంటున్నారు. 1970 దశకం తరువాత తమిళులు తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తున్నారు. కాని అందుకు సింహళీయులు అంగీకరించుట లేదు. దాంతో 1970 దశకంలో కొన్ని తమిళ ఉగ్రవాద గ్రూపులుగా మారి మాకు ప్రత్యేక తమిళ్ ఈలం కావాలని గెరిల్లా యుద్ధంను శ్రీలంక ప్రభుత్వంకు వ్యతిరేకంగా పనిచేసింది. అలాంటి సమయంలో శ్రీలంక ప్రభుత్వం ఇండియాను తమ దేశంలో జరుగు ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయుటకు సహాయాన్ని కోరింది. దాంతో ఆనాటి ఇండియా ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీలంక అధ్యక్షుడు జయవర్ధనేల మధ్య శ్రీలంక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నారు. ఆ శ్రీలంక - ఇండియా ఒప్పందం ప్రకారం శ్రీలంకలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఇండియా సైన్యాన్ని పంపింది. ఇండియా సైనికులు శ్రీలంక తమిళులకు వ్యతిరేకంగా పనిచేయుట. అంతకు ముందు ఇండియా లిబరేషన్ ఫర్ తమిళ్ టైగర్స్ ఆఫ్ ఈలం వారికి (ఎల్‌టిటిఇ)కి సైనిక శిక్షణను మద్రాసు పట్టణ సైనిక బేస్‌లలో ఇవ్వడం జరిగింది. అపుడే ఆ ఎల్‌టిటిఇ చేస్తున్న విమోచన ఉద్యమ పోరాటం చేయుటకు ఇండియా సైన్యాన్ని పంపింది. దీనిని తమిళ ఆర్గనైజేషన్స్ వ్యతిరేకించాయి. అయినా ఇండియా శ్రీలంక ఒప్పందం 1986 ప్రకారం ఇండియా సైన్యంను పంపింది. ఆ చర్య తమిళుల ఉద్యమం ఆపడంలో అటు శ్రీలంక సైన్యంకు సహాయపడి ఇండియా సైన్యం కూడా అణచలేకపోయింది. దాంతో ఇండియా సైన్యం కొద్ది కాలం తర్వాత సమస్య పరిష్కారం కాకముందే వెనుదిరిగి వచ్చింది. ఆ కక్షతో ఇండియా ప్రధాని రాజీవ్‌గాంధీని ఎల్‌టిటిఇ మానవ బాంబులు శ్రీ పెరంబుదూర్ ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీని కాల్చి చంపాయి.

అక్కడితో ఆగకుండా అంతర్జాతీయ తమిళుల సహాయంతో ఎల్‌టిటిఇ శ్రీలంక రాజ్యంపై దాడులు జరుపుతూనే ఉంది. వాటిని అణచివేయుటకు శ్రీలంక అంతర్జాతీయంగా యుఎన్ ఫోర్స్‌ను ఆహ్వానించింది. కాని శాంతి భద్రతలు ఏర్పరచిన ఎల్‌టిటిఇ దాడులు ఆగలేదు. ఆనాటి సింహళ పార్టీ ప్రధాని రాజపక్సే చైనా సహాయాన్ని కోరారు. చైనా ఇదే అదనుగా శ్రీలంక సైన్యానికి శిక్షణ ఇచ్చేందుకు తన సైనిక స్థావరాన్ని ఏర్పరచింది. అప్పటి నుండి అంటే 1992 నుండి 2004 మధ్యకాలంలో శ్రీలంక సైన్యానికి ఎల్‌టిటిఇ ల మధ్య భీకర పోరులో పూర్తిగా ఎల్‌టిటిఇ నాయకులను సైన్యాన్ని మరియు పౌరులను ఊచకోత కోసి మారణహోమంలో లక్షలమంది తమిళులు ప్రాణాలు కోల్పోయారు. తమిళ్ ఈలం డిమాండ్ తగ్గింది. కాని పూర్తిగా తొలగిపోలేదు. ఎందుకు ఈ విషయాలు పేర్కొనడం జరిగిందంటే శ్రీలంక సంక్షోభంలో భారత దేశ సహాయాన్ని కోరేందుకు శ్రీలంక ప్రధానమంత్రి విక్రమసింగే ఇండియా ప్రధానిని కలిసి సహాయాన్ని అర్థించాడు కాని ఇండియా గతంలో 1987 -88 లో చేసిన తప్పును చేయకుండా శ్రీలంకకు సహాయాన్ని అందించుటకు నిరాకరించింది. కాని అప్పటికే శ్రీలంకలో సైనిక స్థావరాలను ఏర్పరచుకొన్న చైనా శ్రీలంకలో ఎన్నికకాబడిన విక్రమసింగేని తొలగించి చైనాకు అనుకూలుడైన రాజపక్సేను పార్లమెంటులో మెజారిటీ లేకున్నా ప్రధానిగా నియమించడం జరిగింది. చైనా తనకు అనుకూలుడైన రాజపక్సేను నియమించి తన ఆర్థిక, వాణిజ్య, సైనిక కార్యకలాపాలను శ్రీలంకలో కొనసాగించడం. అప్పటికే శ్రీలంక ఆర్థిక ఇబ్బందులు విదేశీ రుణం అప్పులతో బాధపడుతోంది. తిరిగి ఎన్నికల సమయం రాకుండా ముందుగా ఎన్నికలు జరిపిస్తే, మరింత ఆర్థిక భారం పడుతుందని తెలిసిన శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన చైనా వత్తిడితో విక్రమ సింఘేను ప్రధానిగా తొలగించి రాజపక్సేను ప్రధానిగా నియమించారు. దాంతో సంక్షోభం నెలకొంది. కాని శ్రీలంక పార్లమెంటులో రాజపక్సేకు మెజారిటీ లేదు. దాంతో అధ్యక్షుడు మైత్రి పాల సిరిసేన పార్లమెంటును రద్దు చేశాడు. మాజీ ప్రధాని విక్రమసింగే శ్రీలంక సుప్రీం కోర్టును ఆశ్రయించగా శ్రీలంక పార్లమెంటును రద్దు చేయడం చట్టానికి శ్రీలంక రాజ్యాంగానికి విరుద్ధమని ప్రకటించగా అధ్యక్షుడు మైత్రిపాల పార్లమెంటును సమావేశపరచి రాజపక్సేను మెజారిటీ నిరూపించుకోమని కోరాడు. దాంతో మెజారిటీ లేని ప్రధాని రాజపక్సే, పార్టీయులు పార్లమెంటును రద్దుచేసి ఎన్నికలకు వెళ్ళాలని పట్టుపడుతున్నారు. కాని విక్రమసింఘే ప్రభుత్వం (చైనాకు వ్యతిరేకం)ను ఏర్పరచమని కోరడం లేదు. దాంతో శ్రీలంకలో పాలన సంక్షోభం, ఆర్థిక వైఫల్యం, అప్పులతో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాని చైనా, తానిచ్చిన అప్పులను తిరిగి చెలించమని వత్తిడి చేయడంతో దిక్కుతోచని స్థితిని శ్రీలంక ఎదుర్కొంటోంది. ఇలా చైనా శ్రీలంకలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు వెనుకాడడం లేదు.

అదేవిధంగా మయన్మార్‌లో కూడా చైనా, ఎన్నికయిన సాన్‌చూకిని ప్రధాని కాకుండా చేసి మయన్మార్ అధ్యక్షుడినిగా సైన్యాధ్యక్షునిచేసి పాలనను ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో మయన్మార్ నుంచి ముస్లిం రోహింగ్యాలను మయన్మార్ నుండి దాదాపు 4.5 లక్షల మందిని వెళ్ళగొట్టింది. ఆ మయన్మార్ రోహింగ్యాలు బంగాళాఖాతం ద్వారా బంగ్లాదేశ్, ఇండియాలోకి ప్రవేశించి ప్రాణాలను కాపాడుకొంటున్నారు. ఇదే సమయంలో మయన్మార్‌లో మానవ హక్కులను కాపాడడంలో మయన్మార్ పార్టీ ఎన్నికైన నాయకురాలు అంగసాన్ సూకీ రోహింగ్యాల మానవ హక్కులను కాపాడలేకపోయిందని విమర్శలను ఎదుర్కొన్నారు.ఆమెకు గతంలో ఇచ్చిన నోబుల్ శాంతిబహుమతిని తిరిగి వెనక్కి తీసుకొన్నారు. మయన్మార్‌లో సైనికులు రోహింగ్యాలను చిత్రహింసలుపెడితే వారు ఇతర దేశాలకు వలస పోతున్నారు. దీనివలన మయన్మార్ ప్రభుత్వం ఇరకాటంలో పడి చైనా చెప్పుచేతల్లోనే నడుస్తుంది.

-డాక్టర్ కె.ఆసయ్య, ఐఏఎస్, 8008359912

తగ్గిన ప్యాసింజర్ కార్ల అమ్మకాలు

• ఏప్రిల్ – డిసెంబర్‌లో..

న్యూఢిల్లీ: గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్యాసింజర్ వాహనాలు (పీవీ) రెండు శాతం తగ్గాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫెడా) మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 19,17,750 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. కాగా అంతకు ముందు ఏడది ఇదే కాలంలో మొత్తం 19,65,630 యూనిట్లు విక్రయించినట్లు ఫెడ్ పేర్కొంది. కాగా ఫెడా దేశంలోని మొత్తం 1,431 ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్‌టీఓ)లకు గాను 1,072 ఆర్‌టీఓల నుంచి వాహనాల రిజిస్ట్రేషన్ సమాచారాన్ని సేకరించి వివరాలు వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఒక మిగిలింది మూడు నెలలు మాత్రమే కాబట్టి..చివరి త్రైమాసికంలో అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయని ఫెడా అధ్యక్షుడు ఆశిష్ హర్షరాజ్ కాలే ఆశాభావం వ్యక్తం చేశారు. జనవరి నుంచి షోరూంలకు కస్టమర్ల సందడి మొదలైందని ఆయన అన్నారు. పండుగ సీజన్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. కానీ అటు తర్వాత డిసెంబర్‌లో ద్రవ్యలభ్యత కఠినతరం కావడంతో అమ్మకాలు మందగించాయని ఆయన వివరణ ఇచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీల్లో ద్రవ్యకొరత ఏర్పడితే దాని ప్రభావం ప్రత్యక్షంగా ఆటోపరిశ్రమపై పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐ గవర్నర్ ఎన్‌బీఎఫ్‌సీలతో చర్చలు జరిపి పరిస్థితిని చక్కబెడతారని ఆశిస్తున్నామని కాలే అన్నారు.

మోన్‌సాంటోకు ఊరట!

హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన వ్యవ సాయ విత్తనాలు ఉత్పత్తి చేసే మోన్‌సాం టోకు సుప్రీంకోర్టులో మంగళవారం నాడు ఊరట లభించింది. బిటీ పత్తివిత్తనాలకు బొల్లాగార్డ్ టెక్నాలజీ పెటెంట్ హక్కులపై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవా రం నాడు సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. కాగా సుప్రీంకోర్టు పాత ఆర్డరును తిరిగి పునరుద్ధరించింది. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు చెల్లదని పేర్కొనకుండానే ఇంతకు ముందు మాదిరిగానే కొనసాగాలని సుప్రీంకోర్టు ఆర్డర్ జారీ చేసింది. మోన్‌సాంటో బిటి పత్తి విత్తనాల ట్రేడ్ మార్కును నూజీవుడ్ సీడ్స్ లిమిటెడ్ వాడకంపై మోన్‌సాంటోకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో మోన్‌సాంటో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. కాగా మోన్‌సాంటో పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు బెంచ్ ధర్మాసనం న్యాయమూర్తులు ఆర్‌ఎఫ్ నారిమన్, నవీన్ సిన్హాలు.. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టి... సింగిల్ జడ్జి మార్చి 28, 2017న ఇచ్చిన ఆర్డర్‌ను యధావిధిగా కొనసాగించాలని కోరింది. సింగిల్ జడ్జి చట్టం ప్రకారం ఎలాంటి తీర్పు ఇవ్వాలో అధ్యయనంచేసి తీర్పు ఇవ్వవచ్చునని పేర్కొంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల ప్రకారం రెండు పార్టీలు ఒకరితో ఒకరు సహకరించుకుని సింగిల్ జడ్జి ముందు ఈ కేసును పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ కేసుకు సంబంధించి మోన్‌సాంటో నూజీవీడు సీడ్స్‌తో పాటు ఇతర వ్యవసాయ సంస్థలు తమ ట్రేడ్ మార్కు 'బోలాగార్డ్' - 'బోలాగార్డ్-2' బ్రాండ్ పత్తి విత్తనాల టెక్నాలజీని వినియోగించకుండా శాశ్వతంగా ఇంజెక్షన్ ఆర్డరు ఇవ్వాలని సుప్రీంకోర్డును కోరింది.

సుప్రీంకోర్టు ఆర్డర్‌పై బయార్ హర్షం

ఇదిలా ఉండగా విత్తనాల పరిశ్రమల సంఘాలు ఎఫ్ఎస్ఎస్ఐ, ఏఏఐ కంపెనీలు ప్రధానంగా ఇవి అన్నీ బహుళజాతి సంస్థలు ఢిల్లీ హైకోర్టును ఆర్డర్‌ను సుప్రీంకోర్టు పక్కన పెట్టడాన్ని ఆహ్వానించింది. అమెరికా ఆగ్రో దిగ్గజం మోన్‌సాంట్ బోలార్డ్ టెక్నాలజీ ద్వారా బీటి పత్తి విత్తనాల పెటెంట్ హక్కులను ఇతర కంపెనీలు వినియోగించకుండా ఆర్డర్ ఇవ్వడాన్ని హర్షించాయి. అయితే జాతీయ సీడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఎం ప్రభాకరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ అంశంపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తరగి ఈ కేసును సింగిల్ జడ్జి బెంచ్‌కు తిప్పి పంపడం జరిగిందని.. కేసు మళ్లీ మొదటికి వచ్చిందని వివరించారు.

డిజిటల్ పేమెంట్ కమిటీ చైర్మన్‌గా

నందన్ నీలేకని

• మరో నలుగురు సభ్యులను నియమించిన ఆర్‌బీఐ • 90 రోజుల్లో నివేదిక



ముంబై : డిజిటల్ చెల్లింపులను బలోపేతం చేయడానికి నందన్ నీలేకని నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి ప్యానెల్‌ను రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా మంగళవారం నాడు ఏర్పాటు చేసింది. ఆధార్ సృష్టికర్త అయిన నీలేకని ప్యానెల్ డిజిటల్ చెల్లింపులను భద్రతతో పాటు మరింత బలోపేతం చేయడా నికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆర్‌బీఐకి సిఫార్సులు చేస్తుం ది. ఐదుగురు సభ్యుల బృందం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి, అలాగే బ్యాంకింగ్ సేవలన్నీ డిజిటైజేష న్ చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేసి నివేదికను ఆర్‌బీఐకి అందిస్తుంది. ఈ కమిటి మొదటి సమావె శం తర్వాత 90 రోజుల్లోగా తుది నివేదిక ఆర్‌బీఐకి అందిస్తుందని ఆర్‌బీఐఒక ప్రకటనలో పేర్కొంది.

ఇదిలా ఉండగా నీలేకని ప్యానెల్ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న డిజిటైజేష న్ ద్వారా చెల్లిపుల వ్యవస్థ ఎలా పనిచేస్తుం దో సమీక్షిస్తుంది. అలాగే ఎక్కడైతే లోపాలు ఉన్నాయో వాటిని గుర్తించి వాటికి పరిష్కాలు కనుగొంటుంది. అలాగే డిజిటల్ చెల్లింపుల్లో మరింత భద్రత కోసం .. డిజిటల్ చెల్లింపు లను బలోపేతం చేయడా నికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేస్తుం ది. వీటిలో ఏదైతే అత్యుత్తమం గా ఉంటుందో వాటి ని అమలు చేయాలని సిఫారసు చేస్తుంది. డిజిటల్ చెల్లింపులకు ముందు గా కొత్త ప్యానెల్ మధ్య కాలికానికి కొన్ని సిఫారసులు అందిస్తుందని ఆర్‌బీఐ పేర్కొం ది. ఈ ప్యానెల్‌లో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నీలేకనితో పాటు ఇతర సభ్యులు ఉన్నారు. వారిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్, విజయాబ్యాంకు మాజీ ఎండీ, సీఈవో కిశోర్ సాన్సీ, ఐటీ, స్టీల్ మంత్రిత్వశా ఖలో మాజీ కార్యదర్శి అరుణ్‌శర్మ, ఐదవ సభ్యులుగా సంజయ్ జైన్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, సెంటర్‌ఫ ర్ ఇన్నోవేషన్, ఇన్‌క్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూ ర్ షిప్ (సీఐఐఈ) ఐఐఎం అహ్మదాబాద్‌లు సభ్యులుగా ఉంటారు.ఇక డిజిటల్ చెల్లింపుల విష యానికి వస్తే 2017-18 ఆర్థిక సంవత్స రంలో దేశంలో కార్డుల ద్వారా చెల్లింపు లు అంతకు ముందు సంవత్సరంతో పో ల్చుకుంటే 43 శాతం పెరిగాయి. రూ. 10.61 లక్షల కోట్ల వరకు చెల్లింపులు జరిగా యి. అలాగే ప్రభుత్వరంగానికి చెందిన యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్ ద్వారా చెల్లింపులు ఏడాది ప్రాతిపదికన చూస్తే రూ. 1.01 లక్షల కోట్లకు చేరాయని గత ఆగస్టులో ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపులు 2023 నాటికి ఐదు రెట్లు పెరిగి లక్ష కోట్ల డాలర్లు .. భారతీయ కరెన్సీ ప్రకారం ప్రస్తుతం ఉన్న మారకం రేటు ప్రకారం చూస్తే రూ.70 లక్షల కోట్ల వరకు డిజిటల్ చెల్లింపులు జరుగుతాయని క్రెడిట్ సూయిస్ అంచనా వేసింది.




ఇదిలా ఉండగా చెల్లింపుల వ్యవస్థకు ప్రత్యేకంగా నియంత్రణా సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్యానెల్ సిఫారసు చేసింది. దీన్ని రిజర్వుబ్యాంకు తీవ్రంగా వ్యతిరేకించింది. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ మంగళవారం నాడు కార్డుల ద్వారా చెల్లింపులకు కొన్ని గైడ్‌లైన్స్ విడుదల చేసింది.

గృహ అమ్మకాల్లో6 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలోని మొత్తం ఎనిమిది నగరాల్లో గత ఏడాది గృహ అమ్మకాల్లో ఆరు శాతం వృద్ధి కనిపించింది. కస్టమర్లను ఆకర్షించేందుకు డెవలపర్లు ధరలు తగ్గించడమే కాకుండా పరోక్షంగా డిస్కౌంట్లతో ఆఫర్ల వర్షం కురిపించారని స్థిరాస్తుల కన్సెల్టెంటట్ నైట్ ఫ్రాంక్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడించింది. ఆరు నగరాల విషయానికి వస్తే ఢిల్లీ - ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో అమ్మకాలు పెరిగితే... కోలకతా, పూనేలలో అమ్మకాలు తగ్గాయి. అమ్ముడుపోకుండా నిలిచిపోయిన గృహాలు 11 శాతం తగ్గి 4.7 లక్షల యూనిట్లకు దిగివచ్చాయి. అయితే ఇతర స్థిరాస్థి కన్సెల్టెంట్లు ఉదాహరణకు జెఎల్‌ఎల్ ఏడు నగరాల్లో అమ్మకాలు 47 శాతం పెరిగాయని పేర్కొనగా.. అనెరాక్ మాత్రం ఏడు నగరాల్లో 16 శాతం, ప్రాటైగర్ విషయానికి వస్తే మొత్తం తొమ్మిది నగరాల్లో అమ్మకాలు 25 శాతం వరకు పెరిగాయని పేర్కొన్నాయి.

జేఎల్‌ఆర్ అమ్మకాల్లో 16.23 శాతం వృద్ధి




న్యూఢిల్లీ : టాటామోటా ర్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాం డ్ రోవర్ అమ్మకాలు గత ఏడాది భారత్ మార్కెట్లో 16.23 శాతం వృద్ధితో 4,596 యూనిట్లు విక్రయించాయి. క్రితం ఏడాది 3,954 యూనిట్లు విక్రయించినట్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా ఒక ప్రకటనలో వెల్లడించింది. కంపెనీకి చెందిన మోడల్స్ విషయానికి వస్తే ల్యాండ్ రోవర్ డిస్కవరి స్పోర్ట్, రేంజి రోవర్ ఈవోక్, జాగ్వార్ ఎఫ్-పెస్, ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎఫ్ బ్రాండ్ కార్లను విక్రయిస్తోంది. అమ్మకాల గురించి కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి మాట్లాడుతూ, గత ఏడాది ఆటో పరిశ్రమ పలు సవాళ్లను ఎదుర్కొందని.. ముఖ్యంగా ద్వితీయార్థంలో ద్రవ్యలభ్యత క్లిష్టంగా మారిందని, దీంతో పాటు బీమా ఖర్చులు పెరిగిపోవడంతో పాటు వడ్డీరేట్లు పెరిగాయని వివరించారు. అయినా జాగ్వార్ ల్యాండ్‌రోవర్ అమ్మకాలు బాగా పుంజుకున్నాయని ఆయన అన్నారు. గతేడాది కంపెనీ మొత్తం పది మోడల్స్‌ను మార్కెట్లో విడుదల చేసిందని ఆయన తెలిపారు.

ఆర్‌బీఐ మిగులు నిల్వలపై జలాన్ నివేదిక ఏప్రిల్‌లో

న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న మిగులు నిల్వలపై అధ్య యనం చేయడానికి ఏర్పాటు చేసిన జలాన్ ప్యానెల్ మంగళవారం నాడు మొట్టమొదటి సమావేశం ఏర్పాటు చేసింది. ఈసమా వేశం లో ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిధుల్లో బ్యాంకు తమ వద్ద ఎంత నిల్వలు ఉంచుకోవచ్చు... ఎంత మొత్తం డివిడెండ్ రూ పంలో ప్రభుత్వానికి చెల్లించవచ్చు తదితర అంశాలపై చర్చలు జరిపింది. ఆరుగురు సభ్యుల ప్యానెల్ తుది నివేదికను ఏప్రిల్ లో ప్రభుత్వానికి సమర్పించవచ్చునని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కాగా ఆర్‌బీఐ బోర్డు కొత్త ప్యానె ల్‌కు పని అప్పగించి .. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సెంట్రల్ బ్యాంకులు ఎలా పని చేస్తు న్నా యి, వారి బ్యాలెన్స్‌షీట్ల పై అధ్యయ నం చేయాలని జలాన్‌ప్యానె ల్‌కు బాధ్యతలను అప్పగించింది. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ బిమల్‌జలాన్ ప్యా నెల్‌లో మాజీ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాకేశ్ మోహన్ వైస్ చైర్మన్‌గా వ్య వహరిస్తారు. కొత్త ప్యానెల్ లాభాల పంపిణిపై తగిన విధంగా ఒక విధానాన్ని తీసుకొచ్చి ఆర్‌బీఐ తమ వద్ద ఎంత మొత్తం నిధులు ఉంచుకోవ చ్చు..ప్రభుత్వా నికి ఎంత బదిలీ చేయాలనే అంశంపై అ ధ్యయ నం చేస్తుంది. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ వద్ద ఉన్న రూ.9.6 లక్షల కోట్లు మిగులు నిధులపై ఆర్థిక మంత్రిత్వశాఖకు మాజీ ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు మధ్య పెద్ద రగడ జరి గిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐపై ప్రభు త్వం ఒత్తిడి పెంచి అదనపు నిధులు ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరడం.. దీనికి ఆర్‌బీఐ గవర్నర్ ససేమిరా అనడంతో ఆర్‌బీఐకి ఆర్థిక మంత్రిత్వశాఖకు మధ్య అగాధం పెరిగింది. ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఉర్జిత్ పటేల్ గత నెలలో రాజీనామా చేసి వెళ్లిపో యారు. అయితే చివరగా నవంబర్ 19, 2018 న జరిగిన ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో మిగు లు నిధులు ఏ విధంగా పంప కం చేయాలో అధ్యయనం చేయడానికి ఒకప్యానెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది. అటు తర్వాత బిమల్ జలాన్ కమిటి ఏర్ప డింది. ఈ కమిటిలో ఆర్థిక వ్యవహారాల కా ర్యదర్శి సు భాష్ చంద్రగార్గ్‌తో పాటు ఆర్ బీఐ సెంట్రల్ బోర్డుకు చెందిన ఇద్దరు సభ్యులు.. భరత్‌దోషి, సుధీర్‌మం కడ్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ ఎస్ విశ్వనాథన్ కమిటీలో ఆరవ సభ్యుడిగా ఉంటారు.




గతంలో కూడా ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిధుల పంపకంపై అధ్యయనం చేయడానికి మూడు కమిటిలను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిలో వి సుబ్రహ్మణ్యం (1997), ఉషా తోరాట్ (2004) వై హెచ్ మలేగాం (2013)లో ఏర్పాటు చేశారు. అయితే సుబ్రహ్మణ్యం కమిటి మాత్రం ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిల్వలు 12 శాతం మాత్రం తమ వద్ద ఉంచుకోవాలని సిఫారసు చేస్తే.. తోరాట్ కమిటి మాత్రం 18 శాతం వరకు ఆర్‌బీఐ ఉంచుకోవచ్చునని సిఫారసు చేసింది. అయితే తోరాట్ కమిటి సిఫారసులను ఆర్‌బీఐ బోర్డు తిరస్కరించింది. అంతకు సుబ్రహ్మణ్యం ప్యానెల్ సిఫారులకే మొగ్గు చూపింది.

అదనపు మూలధనంలో..

బ్యాంకుల ఎన్‌పీఏలు అదుపులోకి...

• రేటింగ్ ఏజెన్సీ ఇక్రా

ముంబై : ప్రభు త్వరంగానికి చెందిన బ్యాంకులకు కేంద్రప్రభుత్వం రూ.41వేల కోట్ల మూలధనం సమకూరు స్తామ్మని ప్రకటించడం బ్యాంకులకు అనుకూలమైన పరిణా మమని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదికలో వెల్లడించిం ది. బ్యాంకులకు ప్రభుత్వం అదనపు మూలధనం సమకూ ర్చడం వల్ల బ్యాంకులు నష్టాలను తగ్గించుకోవచ్చు.. మొం డిబకాయిలను తగ్గించవచ్చునని నివేదికలో పేర్కొంది. డిసెంబర్ 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు రూ. 41వేల కోట్ల మూలధనం సమకూర్చడానికి లోకసభ అను మతి తీసుకున్న విషయాన్ని నివేదికలో గుర్తు చేసింది. దీం తో ఈ ఆర్థికసంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వం పీఎస్ యు బ్యాంకులకు రూ.1.06 లక్షల కోట్ల మూలధనం సమ కూరుస్తుంది. ఇదిలా ఉండగా గతేడాది కేంద్రప్రభుత్వం బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనం సమకూ రుస్తామని ప్రకటించింది. అటు తర్వాత ఈ బ్యాంకులు మార్కెట్ల నుంచి మూలధనం సమకూర్చలేని పరిస్థితి ఏర్పడిందని ఇక్రా మంగళవారం నాడు విడుదల చేసిన నివే దికలో వివరించింది. తాజాగా ప్రభుత్వం సమ కూరు స్తామ న్న రూ.41వేల కోట్ల మూలధనంలో బ్యాంకులకు ప్రభు త్వం సమకూర్చే మొత్తం మూలధనం 2015 నుంచి 2019 ఆర్థిక సంవత్స రం వరకు చూస్తే రూ.2.56 లక్షల కోట్లు సమ కూర్చినట్లుగా తేలింది. తాజాగా సమకూరుస్తున్న మూలధ నంతో ఇప్పటి వరకు ఆర్‌బీఐ పరిధిలో ఉన్న 11 బ్యాంకులు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) ఫ్రేంవర్కును నుంచి బయటపడ్డానికి వీల వుతుంది. ప్రస్తుతం ప్రభుత్వరంగానికి చెం దిన బలహీ నమైన బ్యాంకులు దేనా, విజయా బ్యాంకులను బ్యాంకు ఆఫ్ బరోడాలో విలీనం చేస్తున్న విషయం తెలి సిందే. ఈ విలీ నం తర్వాత పీఎస్‌యు బ్యాంకు సంఖ్య 21 నుంచి 19కి దిగి వస్తాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభు త్వం సమకూరుస్తా మన్న అదనపు మూలధనంలో కొన్ని బ్యాంకులకు ఎక్కువ మొత్తంలో మూలధనం కేటాయిం పులు చేయడం జరిగిం ది. తాజాగా మూలధనం రావడంతో బ్యాంకులు మొండిబ కాయిలను కాస్తా తగ్గించుకొనే వెసులుబాటు లభిస్తుందని ఇక్రా నివేదికలో వివరించింది.







ఐఎంఎఫ్ తొలి మహిళా చీఫ్ ఎకనమిస్టుగా గీతాగోపీనాథ్



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనామిస్ట్‌గా భారత్ లోని కర్ణాటక రాష్ట్రానికి చెందిన గీత గోపీనాథ్ నియమితులయ్యారు. ఐఎంఎఫ్ లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా గీత ఘనత సాధించారు. గీతా ఐఎంఎఫ్ కు 11వ చీఫ్ ఎకనామిస్ట్. గీత హార్వర్డ్ యూనివర్శిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ లో ఇంటర్నేషనల్ ఫైనాన్స్, మాక్రో ఎకనామిక్స్ ప్రోగ్రామ్ కో డైరక్ట్ గా కూడా గీత వ్యవహరిస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుగా కూడా గీత గోపినాథ్ వ్యవహ రిస్తున్నారు. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరక్టర్ గా పనిచేసిన మౌరీ అబ్‌స్టెఫెల్డ్ డిసెంబర్ 31న పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత గీతకు చీఫ్ ఎకనామిస్ట్ గా పదవి దక్కింది. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీత ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో గీత ఒకరని, అక్టోబర్ 2018లోనే గీతను ఐఎమ్ఎఫ్ రీసెర్చ్ డిపార్ట్ మెంట్ ఎకనామిక్ కౌన్సిలర్, డైరక్టర్ గా ఐఎంఎప్ మేనేజింగ్ డైరక్టర్ క్రిస్టీన్ లగార్డే నియమించారు. 1971 డిసెంబర్ 8న మైసూర్ లో జన్మించిన గీత మైసూర్ లోని నిర్మలా కాన్వెంట్ స్కూల్ లో పాఠశాల విద్యనభ్యసించింది. లేడీ శ్రీరామ్ కాలేజ్ ఫర్ ఉమెన్(ఢిల్లీ యూనివర్శిటీ),లో 1992లో బీఏ పట్టా అందుకొంది. 1994లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎకనామిక్స్ లో మాస్టర్స్ పట్టా పొందింది. 1996లో వాషింగ్టన్ యూనివర్శిటీలో ఎమ్ఏ పూర్తి చేసింది.2001లో ప్రిన్సిటాన్ యూనివర్శిటీలో పీహెచ్ డీ పూర్తి చేసింది.

పట్టు విడువలేదు.. మెట్టు దిగలేదు

◆ చివరిరోజూ ఆగని ఆందోళన
◆ పార్లమెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీల నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల ఆరంభం నుంచి అంతం వరకూ టీడీపీ ఎంపీలు పట్టు విడువలేదు - మెట్టు దిగలేదు. చివరి రోజూ అదే నిరసన. అదే ఆందోళన. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం ఆ పార్టీ రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలు ధర్నా నిర్వహించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై నినాదాలతో హోరెత్తించారు. రోజుకో వినూత్న గెటప్‌తో నిరసన తెలిపే చిత్తూరు ఎంపీ డాక్టర్ నారమల్లి శివప్రసాద్ చివరి రోజు చాణక్యుడి వేషధారణలో తన గళం వినిపించారు.

రిజర్వేషన్ల బిల్లు ఎన్నికల జిమ్మిక్కు - సుజనా చౌదరి

బీఏసీలో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల బిల్లును స్వాగతించాం. అయితే చివరి నిమిషంలో హడావుడిగా తీసుకురావడాన్ని మేం తప్పుబట్టాం. ఇది రాజకీయ ప్రయోజనాల కోసం అనే కంటే ఎన్నికల జిమ్మిక్ అని మేము అంటున్నాం. నిజంగా అగ్ర వర్ణ పేదలపై చిత్తశుద్ధి ఉంటే ఇంత కాలం బీజేపీ ఎందుకు కాలయాపన చేసింది.

కాపు రిజర్వేషన్ల పైనా నిర్ణయం తీసుకోవాలి: అవంతి

ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించినట్టే కాపులకు తక్షణం 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. కాపులు కొత్తగా రిజర్వేషన్లు కోరడం లేదు. స్వాతంత్రం అనంతరం కాపులకు రిజర్వేషన్ ఉండేది. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కాపుల రిజర్వేషన్లు ఎత్తి వేశారు. కాపు రిజర్వేషన్ బిల్లుపైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

బాబును గెలిపిస్తాం - మోడీ ఓడిస్తాం : శివప్రసాద్

చాణక్యుడి వేషధారణతో మోడీకి వ్యతిరేకంగా శపథం చేస్తున్నాను. ఇన్ని రోజులుగా ఏపీ హక్కుల కోసం ఎంపీలు చేస్తున్న పోరాటం కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నాను. ఇలాగే చేస్తే రేపు ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాను. మళ్లీ చంద్రబాబును గెలిపిస్తూ మోడీని ఓడించేలా చాణక్య శపథం చేస్తున్నాను.

కేంద్రంపై మెహబూబా ఫైర్

శ్రీనగర్: సీబీజే, ఏఎన్ఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేయడం నిలిపివేయాలని కేంద్రంపై పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మండిపడ్డారు. మంగళవారం సీబీఐ వర్సెస్ సీబీఐ కేసులో సుప్రీం తీర్పును ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఇది పెద్ద చెంపపెట్టని ఆమె అభివర్ణించారు. అలోక్‌వర్మను తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా నియమించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన విషయం విదితమే. ఈ తీర్పును మెహబూబా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రజాస్వామ్య వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలు మూల స్థంభాలని, అయితే వాటిని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ఇలాంటివి ఇకనైనా మానుకోవాలని మెహబూబా పేర్కొన్నారు.

మోడీ, ట్రంప్ మధ్య ఫోన్‌లో చర్చలు

న్యూఢిల్లీ వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఫోన్ లో చర్చలు జరిగాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఈ చర్చల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్న ఇరువురూ భారత్, అమెరికా మధ్య కీలకమైన వాణిజ్య, రక్షణ అంశాలపై చర్చించారు. 2018లో భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం వృద్ధి, 2 ప్లస్ 2 చర్చల ప్రక్రియ ప్రారంభం, భారత్, అమెరికా, జపాన్ మధ్య మొదటిసారిగా జరిగిన త్రైపాక్షిక సమావేశం పట్ల ఇరువురు సంతృప్త వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావంతో నష్టపోయిన ఆఫ్ఘనిస్తాన్ కు ఇరుదేశాల సహకారం పెంచాలని నిర్ణయించారు. యూఎస్ - ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్యం-2019కి అంగీకారం, భారత్ తో అమెరికా వాణిజ్యలోటు భర్తీ అంశాలపై ఇరువురు చర్చించారు. ఇండో - ఫిసిఫిక్ ప్రాంతంలో రక్షణ, సంపద విషయాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారులు వెల్లడించారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)
E Procurement Short Tender Notice (Second call)
NIT No. 73/PROC/CRDA-14022(104)/2/2018-HO4-LSENV-APCRDA/2nd call Dated:08.01.2019
Name of Work: "Development and maintenance of greenery on the tank front of Kokkiraigunta tank of Aatkuru village, Unguturu mandal"- ECV. Rs. 7,06,353/-
The bid can be downloaded on AP e-procurement portal from 09.01.2019 to 21.01.2019 up to 14.00 Hrs. Due date for submission of Bid 21.01.2019 up to 15.00 Hrs, Technical bid opening 21.01.2019 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.: ఇఇ/(ఆర్&బి)/జిఎన్‌టి/149 టు 176/2018-19 తేది: 03-01-2019
సుమారు రూ.75.376 లక్షల విలువ గల 28 (ఇరవై ఎనిమిది) ప్యాకేజి రహదారుల వార్షిక మరమ్మతులు చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలుచేయుటకు చివరి తేది:21-01-2019 సా. 4.00.గం. వరకు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు (ర.భ) డివిజన్, గుంటూరు
Ro.No.3820/CL/Advt/1/1/2018-19, Dt: 08.01.2019

ఈబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు పలకడంతో బిల్లు పాసైనట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. మంగళవారం ఈ బిల్లుపై లోక్‌సభ సుదీర్ఘంగా చర్చించింది. ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఆర్థిక వెనుకబడిన తరగతులకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 124వ రాజ్యాంగ సవరణ బిల్లు కేంద్ర సామాజికన్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గ్లెహట్ ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 15, 16కు సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లు తెచ్చామని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గ్లెహట్ తెలిపారు. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగ సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అనే విధానంలో భాగంగానే బిల్లు తెచ్చామని లోక్‌సభలో వివరించారు. రాజ్యాంగసవరణ ద్వారా ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నందువల్ల దీనిని సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకునే అవకాశం లేదని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏ మతానికి చెందిన పేదలైనా పదిశాతం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతుల్లో లేని అందరికీ రిజర్వే షన్ల ప్రయోజనం కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చామని తెలిపారు. ఈ బిల్లుతో కోట్లాదిమందికి లబ్ధి చేకూరుతుదని చెప్పారు. ముస్లిం, క్రైస్తవులతో సహా అన్ని మతాలలోని పేదలకు న్యాయం చేసేందుకు ఈ బిల్లు తెచ్చామన్నారు.

బిల్లు జేపీసీకి పంపాలి: కాంగ్రెస్ డిమాండ్

తొందరపాటుతో ఈ రాజ్యాంగసవరణ బిల్లు తెచ్చారని కాంగ్రెస్ ఎంపీ కెవి.థామస్ లోక్‌సభలో అన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఈ బిల్లు తెచ్చారని అన్నారు. ఎనిమిది లక్షల రూపాయల పరిమితి విధించడం వల్ల సంపన్నులకు సైతం ప్రయోజనం కలుగుతుందన్నారు. హడావిడిగా బిల్లు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని అన్నారు. ఈ బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకించడం లేదని అయితే జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేశారు. సభ్యులకు సరైన కారణం తెలపకుండా, నిబంధనలకు విరుద్ధంగా బిల్లు ప్రవేశపెట్టారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. రిజర్వేషన్లు లేని పేదవర్గాలకు లాభం చేకూర్చేందుకు రాజ్యాంగసవరణ బిల్లు తెచ్చామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయమైనందున దీనికి రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు లేని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నాయని తెలిపారు. ఆర్టికల్ 16(4)కు సంబంధించి కుల పరమైన రిజర్వేషన్లు విషయంలోనే రిజర్వేషన్లు సుప్రీంకోర్టు పరిమితి విధించిందని చెప్పారు. తాము కులం ఆధారంగా కాకుండా, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తు న్నామని చెప్పారు. ఈ రిజర్వేషన్లకు ఎవరు అభ్యంతర పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలోనే కాంగ్రెస్ పార్టీ ఆర్థిక వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హృద యపూర్వకంగా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈబిసి రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. భేదభావాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని మతాలలోని అగ్రవర్ణ పేదలకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. పేదరికానికి కులం, మతం ఉండదన్నారు. గతంలో పివి నరసింహారావు ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుపై కేవలం నోటిఫికేషన్ విడుదల చేసిందే తప్ప చట్టం చెయ్యలేదన్నారు.

దేశ చరిత్రలో ఇదో మైలురాయి : మోడీ

జనరల్ కేటగిరిలోని పేదలకు ఉద్యోగ, విద్యావకాశాలు కల్పించేందుకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంకల్పించాం. సమాజంలోని అన్ని వర్గాల వారికీ న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రతీ పేద వ్యక్తి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలి. సమాజంలోని అవకాశాలను అందుకోవాలి. ఈబీసీ బిల్లు లోక్ సభలో ఆమోదం పొందేందుకు సహకరించిన అన్ని పార్టీల ఎంపీలకు ధన్యవాదాలు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ మంత్రంతో ముందుకెళ్తాం.

సమానత సాధనలో భాగంగా జనాభా ప్రాతిపదికన అందరికీ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, ఆర్జెడీ ఎంపీ జయప్రకాష్ నారాయణ్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. జనాభాలో ఏ వర్గానికి ఎంత సంఖ్య ఉందో దాని ప్రకారమే రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు.

అత్యంత వెనుకబడిన వర్గాలు అధికంగా ఉన్న దేశంలో రిజర్వేషన్ల శాతాన్ని 69శాతంకుపెంచుతూ రాజ్యాంగ సవరణ తీసుకురావాలని అన్నాడిఎంకె పక్ష నేత తంబిదొరై డిమాండ్ చేశారు. ఈ బిల్లును సుప్రీంకోర్టు కొట్టివేయడం ఖాయమన్నారు. ఈ బిల్లుతో అవినీతికి ఆస్కారం కలుగుతుందన్నారు. నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు.

ఈబిసి బిల్లుకు తాము మద్దతు తెలుపుతున్నామని టిఆర్ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. అయితే తెలంగాణ రిజర్వేషన్ల విధానానికి కూడా కేంద్రం ఆమోదం తెలపాలని కోరారు.

ముస్లింలకు రిజర్వేషన్ బిల్లు ఎందుకు ఆమోదించలేదు: ఓవైసి

ఆర్థికబాటు వెనుకబాటు అంశాన్ని గుర్తించేందుకు ఎటువంటి ఆధారం లేకుండా బిల్లు ఎలా తీసుకువచ్చారని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ముస్లింలలో సైతం చాలా ఆర్థిక వెనుకబాటు ఉందని అనేక కమిషన్‌లు నివేదికలు ఇచ్చాయన్నారు. కానీ ముస్లింలకు మాత్రం రిజర్వేషన్లు కల్పించడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన చట్టానికి కేంద్రప్రభుత్వం ఆమోదం ఎందుకు తెలపలేదని ప్రశ్నించారు. ఈ బిల్లు సుప్రీంకోర్టులో కొట్టివేయడం ఖాయమని అన్నారు.

రెండు బిల్లులకు ఆమోదం

పౌరసత్వ సవరణ బిల్లుకు, డిఎన్ఎ చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభ చర్చించింది. అనంతరం రెండు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. ఇటు రాజ్యసభలో విపక్షా ల గందర గోళంతో సభా కార్యక్రాలు ముందుకుసాగలేదు. విపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అడ్డుతగిలారు. దాంతో సభ బుధవారానికి వాయిదా పడింది. లోక్‌సభ రిజర్వేషన్ల బిల్లు పాస్ చేయడంతో నేడు బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

భారత్- పాక్ యుద్ధం ఆత్మహత్యవంటిదే


పాక్ ప్రధాని ఇమ్రాన్



ఇస్లామాబాద్: పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరోసారి భారత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం అనివార్యమైతే అది ఆత్మహత్యాసదృశ్యమే అని హెచ్చరించారు. తను చేస్తున్న శాంతి యత్నాలకు భారత ప్రభుత్వం స్పందించడంలేదని ఆరోపించారు. అణ్వా యుధ సామర్థ్యం ఉన్న రెండు దేశాలు యుద్ధంలో తలపడటమంటే ఆత్మహత్య చేసుకున్నట్టే అన్నారు. భారత్‌తో చర్చలకు పాక్ సిద్ధంగా ఉందని ఇమ్రాన్ పునరుద్ఘాటించారు. టర్కిష్ న్యూస్ ఏజెన్సీకు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు అణ్వాయుధ దేశాలు యుద్ధం గురించి కనీస ఆలోచన కూడా సరికాదన్నారు. యుద్ధంవల్ల పరిస్థితి దయ నీయంగా మారుతుందన్నారు. ద్వైపాక్షిక చర్చలు మాత్రమే శాంతికి ఏకైక మార్గమని చెప్పారు. ద్వైపాక్షిక చర్చల ద్వారా ఇరు దేశాలు సమస్యల పరిష్కా రానికి చొరవచూపాలన్నారు. కశ్మీరీల హక్కులను భారత్ ఎప్పుడూ అణచి వేయాలేదని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు.

ఈబీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈబీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు ఎన్. రఘు వీరారెడ్డి అన్నారు. గతంలోనే ఈబీసీ రిజర్వేషన్లు కల్పించా లని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరంకు లేఖ రాశామని ఆయన చెప్పారు. 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తామని, గత ఏడాది అక్టోబర్ నెల నుంచి ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం చేస్తుందన్నారు. మంగళవారం ఇందిరా భవన్‌లో జరిగిన మీడియా ప్రతి నిధుల సమావేశంలో పాల్గొన్న రఘువీరారెడ్డి మాట్లాడారు.. నాలుగేళ్ళగా కనిపించని ఈబీసీ రిజర్వేషన్లను తెరపైకి కేంద్రప్రభుత్వం తెచ్చిందని, దీనిలో నిజాయితీ కనిపించడం లేదన్నారు. రైతులు, నిరుద్యోగుల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపు చ్చుకోవడానికే ఈబీసీ రిజర్వేషన్ల ప్రకటన చేశారని తాము భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేవలం ఓట్లు దండుకోవడానికే ఈబీసీ రిజర్వేషన్ల ప్రస్తావిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీ జనాభా లెక్కలను బహిర్గతం చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

సీబీఐ బాస్ ఈజ్ బ్యాక్..

◆ అలోక్ వర్మకు మళ్లీ పదవి ◆ కేంద్రం ఉత్తర్వులకు విఘాతం ◆ సెలవు ఆదేశాలు చెల్లవని సుప్రీం తీర్పు ◆ నియామక కమిటీలే తుది నిర్ణయమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: దేశసర్వోన్నత న్యాయస్థానంలో సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మకు ఊరట లభించింది. సీబీఐ బాస్‌గా విధులు నిర్వర్తించేందుకు ఆయనకు మార్గం సుగుమం అయింది. అలోక్ వర్మను సెలవుపై పంపిస్తూ సీవీసీ, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు చెల్ల బోవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా కొనసాగించాలంటూ కేంద్ర ప్రభు త్వానికి ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్యం, సమైక్యతకు సీబీఐ అధిపతి ఆదర్శంగా ఉండాలని, ఇతర శక్తుల జోక్యాన్ని నియంత్రించి స్వేచ్ఛను కల్పించినప్పుడే ఇది సాధ్యపడు తుందని, సీబీఐ స్వతంత్రంగా వ్యవహరించగలుగుతుందని, స్వేచ్ఛగా ధైర్యంగా ప్రజల అభీష్టం మేరకు తన విధులను కొన సాగించగలుగుతుందని జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృ త్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. చట్టం ప్రకారం సీబీఐ డైరెక్టర్ కార్యాకలాపాల్లో ఇతరుల జోక్యం ఉండకూడదని, ఇతర జోక్యం కారణంగా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రధాని, ప్రధాన న్యాయ మూర్తి, ప్రతిపక్షనేత సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ అను మతి లేకుండా తొలగించడం కుదరదని స్పష్టం చేసింది. సీబీఐ అధిపతిని మధ్యలో తొలగించాల్సిన అవసరం ఏర్పడి నప్పు డు చట్టం ప్రకారం వ్యవహరించాలని, ఎంపిక చేసిన కమిటీ నిర్ణయం తప్పనిసరని పేర్కొంది. ఇదిలావుండగా గతేడాది అక్టోబర్ 23న సీవీసీ, డీపీటీ(డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) ఆదేశాల మేరకు సీబీఐ అధిపతి విధులు నిర్వర్తించేందుకు మధ్యంతర డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వర్ రావు నియమించడంపై అలోక్ వర్మ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.అసాధారణ పర్యవసానాలు సీవీసీ ఆదేశాలకు కారణమయ్యాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సీవీసీ విచారణకు సహకరించికపోగా అవినీతి ఆరోపణలపై కేబినెట్ సెక్రటరికీ ఎవరు ఫిర్యాదు చేశారని సీవీసీని అలోక్ వర్మ ప్రశ్నిం చారని సుప్రీంకోర్టు తెలిపింది. అస్థానా అవినీతి ఆరోపణలను అలోక్ వర్మ సీవీసీ దృష్టికి తీసుకెళ్లారని వెల్లడించింది. పలు సెక్షన్ల కింది అలోక్ వర్మను సెలవు పంపించడం సబబేనని సీవీసీ భావించిందని తెలిపింది.



ఇదిలావుండగా అలోక్ వర్మతోపాటు వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులకు ఎలాంటి ఊరట దక్కలేదు. బదిలీలకు సంబంధించి బదిలీల పర్యవసనాలను తెలియజేస్తూ సంబంధిత ఫోరంలను ఆశ్రయించాల్సిందిగా న్యాయస్థానం సూచించింది.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

స్వాతంత్ర్యం, సమైక్యతకు సీబీఐ డైరెక్టర్ ఆదర్శంగా ఉండాలి. పార్లమెంట్ మినహా ఇతర జోక్యాలు, నియంత్రణల నుంచి స్వేచ్ఛ కల్పించనప్పుడే ఇది సాధ్యపడుతుంది.

స్తంభించిన రవాణా

◆ కార్మిక సంఘాల సమ్మె ప్రభావం
◆ పలు రాష్ట్రాల్లో జనజీవనానికి అంతరాయం



న్యూఢిల్లీ: కార్మిక వ్యతిరేక విధానాలను నిర సిస్తూ కార్మిక సంఘాల సమ్మెతో దేశ వ్యాప్తంగా రవాణా, బ్యాంకింగ్ తదితర రంగాలు స్తంభిం చాయి. కనీస వేతనాలు, సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలని డిమాండ్‌తో పాటు, ప్రభు త్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ట్రేడ్ యూనియన్లు దేశవ్యాప్త బంద్ పిలుపుతో మంగళవారం పలు రాష్ట్రా ల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రైళ్ల రాకపో కలను అడ్డుకోవడం, హైవేల దిగ్బంధం వంటి ఘటనలు చోటుచేసు కోవటంతో రవాణా స్తంభించింది. పలు ప్రాంతాల్లో బస్సులపై రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత నెలకొంది. సమ్మెకు కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాలుమద్దతు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ర్యాలీ, రాస్తారోకోలు, ధర్నాలు జరిగాయి. చాలా రాష్ట్రాల్లో విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఐఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ, ఏఐసీఐటీయూ, హెచ్ఎంఎస్, యూటీయూసీ, టీయూసీసీ తదితర కార్మిక సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఆందోళనలు మిన్నంటాయి. కేరళలో కార్మిక సంఘాల ప్రభావంతో ప్రజాజీవనం స్తంభించింది. ఒడిశాలోనూ రవాణా వ్యవస్థ స్తంభించింది. కార్మికులు రోడ్లపై ఆందోళన చేపట్టి, టైర్లకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలో సమ్మె కారణంగా ముంబైలో బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బంద్ సంద ర్భంగా ప్రధాని మోడీ దిష్టిబొమ్మలు తగల బెట్టారు. కోల్‌కతాలో సమ్మెకు దిగిన సీపీఎం కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పది కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘ టిత కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె లో పాల్గొన్నారు. మరోవైపు కార్మిక సంఘాల సమ్మెకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, ప్రభుత్వబ్యాంక్‌ల ఉద్యోగ సంఘాలు, దేశవ్యాప్తంగా రైతులు కూడా మద్దతు తెలిపారు. కాగా 8,9వ తేదీల్లో తాముకూడా సమ్మె చేపట్టినట్టు బ్యాంక్ ఉద్యోగాలు ప్రకటించడంతో ప్రభుత్వ బ్యాంక్‌ల సేవలకు అంతరాయం కలిగింది. కర్ణాటకలోని ముందగొడిలో బంద్ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్త అక్కడికక్కడే కుప్పకూలి కన్నుమూసింది. పుదుచ్చేరిలో బస్సుపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. కాగా ఛత్తీస్‌గఢ్‌లో బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. త్రిపురలోనూ బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. బుధవారం కూడా దేశవ్యాపంగా కార్మిక సమ్మె కొనసాగనుంది.


భారత్- టిబెట్ సరిహద్దులో చైనా ఫిరంగుల మోహరింపు



బీజింగ్: టిబెట్‌లో చైనా దళాలను మరింతగా మోహరిస్తోంది. భారత్‌తో టిబెట్ సుదీర్ఘ సరిహద్దు కలిగి ఉంది. కొత్త వాహన వ మౌంటైన్ హౌటిజర్స్ అధిక ఎత్తులో ఉన్న కొండల్లో సైతం పోరాట సామర్థ్యం మెరుగుపరుచుకునేందుకు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) సన్నాహాలు చేస్తోందని నిఘా వర్గాల నివేదికలు మంగళవారం తెలిపాయి. డోక్లాంలో 73రోజులుపాటు చైనా-భారత్ సరిహద్దు దాడుల సమయంలో ఫిరంగి దళంను ఉపయోగించిన తరహాలోనే టిబెట్ అటానమస్ రీజియన్ (టీఏఆర్) సరిహద్దు ప్రాంతాల్లో చైనా వాహన మౌంటెడ్ కేనాన్లను మోహరిస్తుంది. భారత్, భూటాన్‌లతో చైనా సరిహద్దు సమస్యల నేపథ్యంలో కొంత కాలంగా ఈ విస్తరణ జరుగుతోందని టిబెట్ అనుకూల స్వాతంత్ర దళాల విశ్లేషకులు మీడియాకు తెలిపారు.

రైల్లో కాల్పులు

మాజీ ఎమ్మెల్యే హత్య




న్యూఢిల్లీ: గుజరాత్ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే జయంతిలాల్ భానుషాలి కటారియా సురభి రైల్వే స్టేషన్ల మధ్య సయాజీ నగరి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా హత్యకు గురయ్యారు. జయంతిలాల్ భుజ్ నుంచి అహ్మదాబాద్ నగరానికి ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు రైలులోనే కాల్చిచంపారు. భద్రతా వైఫల్యం కారణంగానే ఏసీ రైలు బోగీలో కాల్పులు జరిగాయని, దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. ఓ తుపాకీని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.హత్యకు గురైన జయంతిలాల్ తనపై పలుసార్లు అత్యాచారంచేసి, వీడియో తీశారని 21 ఏళ్ల యువతి గతంలో ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు ఫ్యాషన్ డీజైనింగ్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి తనపై అత్యాచారం చేశాడని యువతి ఆ ఫిర్యాదులో పేర్కొంది. దీంతో బీజేపీ ఉపాధ్యక్ష పదవికి భానుషాలి రాజీనామా చేశారు. అనంతరం తాజాగా భానుషాలి రైలులో హత్యకు గురవడం సంచలనం రేపింది.

'పరీక్షా పే చర్చా' విద్యార్థులతో మోడీ

న్యూఢిల్లీ: విద్యార్థుల్లో టెన్షన్ తగ్గించేందుకుస్కూలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో దాదాపు ఏడాది తర్వాత ప్రధాని మోడీ మరోసారి ఈనెల 29న భేటీ కానున్నారు. తల్కాతోరా స్టేడియంలో జరిగే ఈ చర్చా కార్యక్రమంలో పిల్లలతో ప్రధాని ముఖాముఖీ మాట్లాడటంతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా వేలాది మంది పిల్లలతో సంభాషిస్తారు. పరీక్షలు, జీవితం, ఇంకా ఎన్నో విషయాలపై చర్చ జరుగుతుందని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఓ ట్వీట్‌లో తెలియజేశారు. చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొంటున్నందున దీన్ని వీక్షించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని పాఠశాలలకు ఆదేశాలివ్వాలని సీబీఎస్‌ఈని ప్రభుత్వం కోరింది.

యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్‌పై ఎఫ్ఐఆర్



పాట్నా: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కి, విడుదలకు సిద్ధంగా ఉన్న ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమాతో అసిసియేట్ అయిన అనుపమ్ ఖేర్, అక్షయ్ కన్నా తో సహా మరో 15మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బీహార్ హైకోర్టు మంగళవారం పోలీసులను ఆదేశించింది. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ మన్మహన్ పాత్రలో కన్పించనున్నారు. జనవరి 11న విడుదలనున్న ఈ సినిమా సంజయ్ బారు రాసిన బుక్ ఆధారంగా తెరకెక్కంది. ఈ సినిమా నిర్మాత, దర్శకుడు సినిమాలో మన్మోహన్, సోనియా తదితర ప్రముఖులు పాత్రలను తప్పుగా చిత్రీకరించారని పేర్కొంటూ సుధీర్ కుమార్ ఓజ్హా అనే న్యాయవాది పిటిష్ వేశారు. ఈ సినిమా ట్రైలర్ తన మనోభావాలను దెబ్బతీసిందని ఆయన తన పిటిషన్ లో ఆరోపించారు. ఈ పిటిసన్‌పై మంగళవారం విచారించిన సబ్ డివిజినల్ జడ్జి గౌరవ్ కమల్ కంతి పోలీస్ స్టేషన్ ఈ సినిమాతో అసోసియేట్ అయిన 17మందిపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని కంతి పోలీస్ స్టేషన్‌ను ఆదేశించింది.

నేను చేతల మనిషిని



అమరావతిలో వెంకన్న గుడి

(మొదటి పేజీ తరువాయి)


తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇలా ఉన్నాయి. పలమనేరులోని గో శాలలో దేశవాళి గోవుల సంరక్షణ కోసం, గోపర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు, పాడి రైతులకు శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు, ఇతర అభివృద్ధి పనులకోసం రూ. 40.77 కోట్లు మంజూరుకు ఆమోదం, అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించే ప్రక్రియలో భాగంగా మహారాజగోపురం, ఆర్జితసేవా మండపం, అద్దాల మండపం, వాహనమండపం, రథమండపం, ఆంజనేయస్వామివారి ఆలయం, పుష్కరిణి నిర్మించేందుకు రూ. 27.29 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత పటిష్టంగా నిఘా, భద్రతను కల్పించేందుకు 2 వ దశలో 1050 సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 15.79 కోట్లు నిధులు మంజూరు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనం కాంప్లెక్సు నుంచి ఆళ్వార్ ట్యాంక్ రెస్ట్‌హౌస్ గేటు వరకు రూ. 17.21 కోట్లతో క్యూ లైన్ నిర్మించేందుకు టెండర్లు ఖరారు. తిరుమలలో స్మార్ట్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ. 2.63 కోట్లు మంజూరు, అదేవిధంగా తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ ఏర్పాటుకు రూ. 1.97 కోట్లు మంజూరు. స్వర్గీయ వేదాంతం దేశికాచార్యులు స్థానంలో టీటీడీ అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులను రెండేళ్ళ కాలపరిమితికి గాను ఆగమ సలహాదారుగా నియమించేందుకు ఆమోదం. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంలో ఒక రోజుకు నాన్‌ఏసీ గది రూ. 600, ఏసీ గది రూ. 12 వందలు, ఏసీ డార్మెటరి ఒక రూ. 100 అద్దె, నాన్ ఏసీ డార్మెటరి ఉచితంగా కేటాయించేందుకు ఆమోదం. అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని రూ. 2.27 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు. ఏజెన్సీ ప్రాంతాలలో శ్రీ వేంకటేశ్వర దివ్యక్షేత్రాల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం. విజయనంగరం జిల్లా పార్వతీపురంలో రూ. 2.90 కోట్లు, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో రూ. 2.86 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో రూ. 2.90 కోట్లు ఖరారు చేస్తూ పాలకమండలి ఆమోదం తెలిపింది.

31న అమరవాతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూ కర్షణ : టీటీడీ ఈఓ

జనవరి 31 న ఉదయం 9.10 నుంచి 9.40 గంటల మధ్య అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఆగమోక్తంగా భూ కర్షణ చేయనున్నట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేస్తారని తెలిపారు. టీటీడీ తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనకు వచ్చే భజన బృందాలకు ఆర్డినరి బస్‌చార్జీలు చెల్లించనున్నట్లు తెలిపారు. తిరుమలలో దుకాణాలు, హాకర్ లైసెన్సుల సమస్యల పై టీటీడీ చైర్మెన్ అధ్యక్షతన సబ్‌కమిటీ ఏర్పాటు చేశామని, ఇందులో బోర్డు సభ్యులు చల్లా రామచంద్రారెడ్డి, రుద్రరాజు పద్మరాజు, సివిఎస్‌ఓ గోపినాథ్‌జెట్టి, ఎస్టేట్ ఆఫీసర్ విజయసారధిలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటి రానున్న 10 రోజుల్లో నివేదిక సమర్పిస్తుందని, కమిటి సిఫారసులను అమలు చేస్తామని ఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్, దేవాదాయశాఖ కమీషనర్ పద్మ, బోర్డు సభ్యులు, జేఇఓలు శ్రీనివాసరాజు, పోలా భాస్కర్, సివిఎస్‌ఓ గోపినాథ్‌జెట్టి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం మోడీతోనే సాధ్యం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



అమరావతి, ఆంధ్రప్రభ : దేశంలోని అన్ని వర్గాల ప్రజల సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. మంగళవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో మోడీ ప్రధాని అయినత తరువాత గత 70 సంవత్సరాల్లో ఏ ప్రధాని తీసుకోని సాహసోపేత నిర్ణయాలను తీసుకుంటున్నారని, దీనితో అభివృద్ధిపథంలో దూసుకుపోతున్న భారత్‌వైపు యావత్ ప్రపంచం చూస్తోందన్నారు. ఓబీసీ చట్టబద్ధత, జీఎస్‌టీ, ట్రిపుల్ తలాక్, అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం తదితర చారిత్రాత్మక నిర్ణయాలను తీసుకున్న మోడీ దేశ ప్రజలగుండెల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలకు రిజర్వేషన్‌లను కల్పించడంతో ఇప్పటి వరకు 50 శాతానికి పరిమితమైన రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణతో 60 శాతానికి చేరుకుంటాయని చెప్పారు. ఏపీ అభివృద్ధి కోసం కేంద్రం అందిస్తున్న నిధులతో అభివృద్ధి పనులను చేస్తూ ప్రచారం మాత్రం చంద్రబాబుకు చేసుకుంటున్న వైనాన్ని గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్రనేతలు తురగా నాగభూషణం, షేక్‌బాజీ, గుడివాక అంజిబాబు, వెలగలేటి గంగాధర్, వల్లూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపాకు షాక్

● బుద్దా వెంకన్న సోదరుడు వైకాపాలో చేరిక

జగన్‌తోనే బీసీలకు న్యాయం: బుద్దా నాగేశ్వరరావు

అమరావతి, ఆంధ్రప్రభ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏపీలో అధికార టీడీపీ నుండి వైసీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా మరోనేత టీడీపీకి షాక్ ఇచ్చారు. ప్రభుత్వ విప్, టీడీపీ నేత బుద్దా వెంకన్న సోదరుడు, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పాదయాత్రలో ఉన్న జగన్‌ను కలిసి పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ, వైయస్ జగన్‌తోనే బీసీలకు న్యాయం జరుగు తుందని చెప్పారు. అందుకే తాను పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బుద్దా వెంకన్న ఏనాడూ బీసీలకోసం పోరాడలేదని, ఇంకా చాలామంది బీసీ నేతలు వైయస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దివంగత వైయస్సార్ హయాంలోనే బీసీలకు ఎంతో మేలు జరిగిందని ఆయన గుర్తుచేశారు. వైయస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని జగన్ హామీ ఇచ్చిన సంగతిని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా మరింత ప్రాధాన్యత జగన్‌తోనే సాధ్యమవతుందని తాను పూర్తిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని అనేక మంది బీసీ నేతలు జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరే అకాశముందన్నారు. బీసీ సంఘాలు కూడా ఆయనకు మద్దతు ప్రకటించేందుకు సన్నద్ధమౌతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో బీసీలకు కొత్త వెలుగు రాబోతుందని వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుంటే బీసీ సబ్ ప్లాన్ ద్వారా బీసీల జీవితాలు బాగుపడ తాయని తాను ఆశిస్తున్నానని చెప్పారు. సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తానన్న జగన్ మోహన్ రెడ్డికి బీసీలోని అన్ని ఉపకులాలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బుద్దా నాగేశ్వర రావుతో విజయవాడ వైసీపీ పార్లమెంటు అధ్యక్షుడు సామినేని ఉదయ భాను, విజయ వాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త యలమంచిలి రవి తదితరులు ఉన్నారు.

● ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా: చంద్రబాబు ● కర్నూలు ఎయిర్‌పోర్టు జాతికి అంకితం

కర్నూలు, ప్రభ న్యూస్ బ్యూరో: తాను మాటల మనిషిని కాదని, ఏదైనా చేతల్లోనే చూపుతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం, కనమడకల, పుడిచెర్ల గ్రామ సమీపంలో రూ. 88.5 కోట్లతో నూతనంగా నిర్మితమైన కర్నూలు ఎయిర్‌పోర్టును మంగళవారం ఆయన జాతికి అంకితం చేశారు. అంతకు ముందు ఎయిర్‌పోర్టు పైలాన్‌ను ఆవిష్కరించడంతో పాటు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గడివేముల మండల పరిధిలో నిర్మించిన అల్ట్రా మెగా సోలార్ పార్కును జాతికి అంకితం చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. వీటితోపాటు కర్నూలు ప్రభుత్వ అసుపత్రిలో రూ.120 కోట్లతో నిర్మితమవుతున్న కాన్సర్ పరిశోధన కేంద్రంకు శంకుస్థాపన చేశారు .ఫార్మాక్లస్టర్, ఎంఎస్‌ఎంయి పార్కులకు భూమి పూజ గావించారు. అనంతరం యువ పారిశ్రామికవేత్తలు, వైద్య విద్యార్థులు బైఠాయించిన సభనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేవలం 18 నెలల్లోనే రూ.88.5 కోట్ల వ్యయంతో కర్నూలు విమానాశ్రయాన్ని నిర్మించామన్నారు. 2015 అగస్టు 15న ఇచ్చిన హామీ మేరకు 2017 జూన్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. సుమారు వెయ్యి ఎకరాల్లో నిర్మించినట్లు తెలిపారు. విమాన రాకపోకలకు కేంద్ర పౌర విమానయాన సంస్థ నుంచి అనుమతులు రావాల్సి ఉందని, కేంద్రం నుంచి అనుమతులు రాగానే వచ్చే వేసవిలో కర్నూలు నుంచి అమరావతి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌కు విమాన సర్వీసును నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వీటివల్ల జిల్లా ప్రజలకు రాజధాని ప్రయాణంతో పాటు, పరిశ్రమ పెట్టుబడుదారులకు, విద్య, ఉపాధి అవకాశాలకు ఈ ఎయిర్‌పోర్టు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అయన తెలిపారు. జిల్లాలో 97 లిఫ్ట్ ఇరిగేషన్‌లు పూరి చేశామన్నారు. మిగిలిన ఒకటో, రెండో త్వరలో పూర్తి చేస్తామన్నారు. పూర్తయిన వాటితో ఇప్పటి వరకు జిల్లాలో 97వేల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. త్వరలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందన్నారు. 200 ప్రముఖ కంపెనీలు ఓర్వకల్లుకు వచ్చే అవకాశముందన్నారు. రూ.7200 కోట్ల పెట్టుబడితో రాంకో, జయరాజ్ సిమెంట్ పరి శ్రమలను స్థాపించి జిల్లాలో 6వేల మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. లైమ్‌స్టోన్, తదితర రకాల భూగర్భ ఖనిజ సంపదను ఉపయోగించుకుని, కర్నూలు నగరాన్ని ఓర్వకల్లు వరకు విస్తరిస్తామన్నారు. గని అల్ట్రా మెగా పవర్ సోలార్ పార్కు ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ప్రాజెక్ట్‌గా ఆయన పేర్కొన్నారు. ఇక్కడ వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు వీలుంటుందని, వెయ్యి మందికిపైగా ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో రూ.40కోట్లతో ఉర్దూ యూనివర్శిటీని స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. మరో రూ.40కోట్లతో ట్రిపుల్ ఐటి నిర్మాణం పూర్తి దశకు చేరుకుందన్నారు. విద్యారంగంతో పాటు ఇండస్ట్రియల్ హబ్, టూరిజం, క్లస్టర్ యూనిట్, పత్తికొండ, ఆలూరు వంటి ప్రాంతాలకు హంద్రీ-నీవా ద్వారా తాగు, సాగు నీటిని సరఫరా చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వీటిని బట్టి ఈ జిల్లాపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను గ్రహించవచ్చున్నారు.

రాయలసీమ జిల్లాలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనులను త్వరిగతిన చేపట్టి ఏపీని సూర్యోదయ ప్రదేశ్‌గా చేస్తామన్నారు. వీటిద్వారా మొత్తం 5వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. సోలార్ విద్యుత్‌ను స్టోరేజ్ చేయడంతో పాటు గాలితో కరెంటు ఉత్పత్తి చేసే స్థితికి కాలుష్య నియంత్రణకు తోడ్పడతాయన్నారు. రాష్ట్రంలో 15 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్‌ను అందిస్తామని, అతితక్కువ ధరకు వీటిని అందించడం జరుగుతుందన్నారు. పుష్పక విమానాల తరహాలో రోడ్లపైకి ఎలక్ట్రిక్ కార్లను తీసుకువచ్చి కాలుష్య నివారణప్రదేశ్‌గా ఏపీని మారుస్తామన్నారు. వీధి దీపాలన్నీ ఎల్ఇడి బల్బులుగా వినియోగించి, 30 శాతం విద్యుత్‌ను అదా చేస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం సహకరించకపోయినా మనకున్న శక్తియుక్తులతో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

జలధార ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేసేందుకు యత్నాలు ప్రారంభించామన్నారు. 2105 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ప్రతి బీపీఎల్ ఇంటికి స్మార్ట్ అందించడంతో పాటు ప్రతి వ్యక్తిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. వ్యవసాయ హార్టికల్చర్ అభివృద్ధిలో కర్నూలు జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. అనంతపురం, చిత్తూరు తర్వాత స్థానంలో కర్నూలు ఉందని, రాబోయే రోజులలో మొదటి స్థానానికి చేరుకునేలా ఇక్కడి హార్టికల్చర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు రూ.1220 కోట్లు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. మూడవ విడత, నాల్గవ విడత రుణమాఫీ నేరుగా రైతుల ఖాతాలలో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వారి అభివృద్ధి కోసం నిరంతరం తెదేపా శ్రమిస్తుందన్నారు. రైతులు బాగుపడేవరకు, వారి కళ్లల్లో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయం లాభసాటిగా చేయడమే తన కర్తవ్యంగా పేర్కొన్నారు. ఇందనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ ఓర్వకల్లు విమానాశ్రయం పూర్తవ్వడంతో కర్నూలు అన్ని విధాలుగా అభివృద్ధికి అవకాశం కలుగుతుందన్నారు. రాబోవు రెండు నెలల్లో కేంద్ర విమానాయాన సంస్థ నుంచి అన్ని అనుమతులతో పూర్తిస్థాయిలో ప్రజలకు ఎయిర్‌ఫోర్ట్‌అందుబాటులో ఉంటుందన్నారు.అనంతరం నేవియేషన్ అమరావతిపై డెమోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అంతకు ముందు విమానా శ్రయ ఆవరణంలో జాతీయ పతకాన్ని ముఖ్యమంత్రి ఎగురవేశారు. తిత్లీ తుపాను బాధితులకు ఓర్వకల్లు మహిళ సమాఖ్య బృందాలు రూ.30 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కెయి.కృష్ణమూర్తి, పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య విద్యాశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లాపరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ సభ్యుడు ఎస్‌పివై.రెడ్డి, ఎమ్మెల్యేలు బీసీ జనార్దన్‌రెడ్డి, మణిగాంధీ, ఎస్‌వి.మోహన్‌రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, పౌరసరఫరా సంస్థ చైర్మన్ చల్లా రామకృష్ణరెడ్డి, ఎమ్మెల్సీలు కెయి.ప్రభాకర్, కత్తి నరసింహారెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర, జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, సమాచార కార్యదర్శి రామాంజనేయులు, టీడీపీ పాణ్యం నియోజక వర్గ ఇన్‌చార్జి , మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, కోడుమూరు నియోజక వర్గ ఇన్‌చార్జి డి.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రూ.16వేల కోట్లతో జలధార ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగిలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో రూ.3,576 కోట్లతో గ్రామీణ రహదారులకు అనుసంధాన పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. జలధార పథకానికి రెండవ దశలో మరో రూ.6కోట్లు వ్యయం చేస్తామన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాకు రూ.16కోట్లు వ్యయం చేసి 38.48లక్షల ఇళ్లకు తాగునీటిని అందిస్తామన్నారు. మా ఊరు బాట పథకం కింద రూ.3,576 కోట్లతో 23,950 కిలోమీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. పంట సంజీవిని పథకం ద్వారా 1,656 కోట్లు ఖర్చుచేశామన్నారు. 6.11లక్షల ఫారంఫండ్లు, 3.59లక్షల ఎకరాలలో ఉద్యాన వనాలు నిర్మించామన్నారు. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇస్తామన్నారు. విద్యుత్ చార్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెంచమన్నారు. వెయ్యి కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం మనకు ఉందన్నారు. నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. రూ.1,900 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు ఈనెలలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. రూ.1,522కోట్లతో రాజోలుబండ పథకానికి త్వరలో ప నాది పడుతుందన్నారు. పులికనుమకు రూ.230కోట్లు ఖర్చుచేసి 26,400 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేస్తామన్నారు. పత్తికొండ, డోన్ ప్రాంతాలలో 68 చెరువులకు త్వరలో నీటిని అందిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

MANAPPURAM FINANCE LTD.

వేలం నోటీసు

CIN-L65910KL1992PLC006623
IV/470A (old) W638A(New), Manappuram House, Valapad, Thrissur, Kerala - 680 567.

[illegible] 31.01.2019 [illegible]

కృష్ణా 100 ఫీట్ రోడ్డు [illegible] 107850700032873, 3539, 4967, 5046, 5202, 5339, 5371, 5376, 5390, 5391, 5392, 5404, 5415, 5458, 5461, 5462, 5486, 5524, 5571, 5594, 5596, 5597, 5630, 5678, 5697, 5716, 5731, 5741, 5751, 5757, 5775, 5778, 5828, 5849, 5850, 5865, 5909, 5917, 5925, 5967, 6060, 6062, 6069, 6107, 6109, 6110, 6116, 6141, 6161, 6188, 6202, 6210, 6245, 6262, 6276, 6313, 6314, 6315, 6372, 6394, 6467, 6468, 6495, 6499, 6520, 6537, 6555, 6599, 6603, 6610, 6648, 6680, 6692, 6710, 6773, 6794, 6836, 6842, 6852, 7412, 7588, 7591, 7600, 7609, 7610, 7622, 7624, 7626, 7634, 7650, 7652, 7664, 7666, 7667, 7668, 7670, 7673, 7674, 7675, 7690, 7692, 7702, 7705, 7714, 7715, 7720, 7726, 7727, 7730, 7733, 7737, 7740, 7746, 7751, 7765, 7769, 7793, 7802, 7806, 7816, 7818, 7828, 7830, 7835, 7837, 7839, 7840, 7841, 7847, 7851, 7853, 7855, 7856, 7860, 7867, 7884, 7889, 7894, 7899, 7900, 7903, 7907, 7912, 7913, 7925, 7928, 7933, 7942, 7946, 7950, 7956, 7958, 7978, 7987, 107850730000310, 0323, 0353, [illegible] 115910700050478, 2733, 2881, 3464, 3474, 3483, 3531, 3558, 3577, 3585, 3590, 3618, 3641, 3793, 3866, 3960, 3964, 4051, 4083, 4149, 4188, 4196, 4270, 4272, 4311, 4343, 4347, 4375, 4400, 4412, 4453, 4464, 4502, 4503, 4510, 4552, 4560, 4562, 4599, 4605, 4616, 4624, 4625, 4663, 4708, 4719, 4726, 4759, 4760, 4761, 4762, 4771, 4795, 4822, 4882, 4884, 4887, 4889, 4904, 4908, 4962, 4992, 5012, 5039, 5058, 5065, 5067, 5085, 5086, 5088, 5123, 5166, 5186, 5187, 5195, 5213, 5249, 5252, 5255, 5301, 5354, 5365, 5396, 5414, 5421, 5426, 5518, 5575, 5581, 5584, 5589, 5598, 5604, 5622, 5635, 5699, 5707, 5732, 5757, 5834, 5856, 5964, 6022, 6028, 6162, 6986, 7037, 7159, 7268, 7295, 7532, 7536, 7543, 7558, 7562, 7565, 7582, 7586, 7593, 7632, 7642, 7644, 7653, 7655, 7657, 7659, 7660, 7674, 7676, 7679, 7694, 7703, 7705, 7714, 7729, 7738, 7743, 7744, 7746, 7747, 7754, 7757, 7760, 7763, 7766, 7773, 7777, 7793, 7799, 7803, 7805, 7807, 7811, 7816, 7829, 7830, 7831, 7832, 7848, [illegible]

121200700018285, 8914, 8935, 8941, 8944, 8956, 8957, 9028, 9032, 9034, 9042, 9094, 9181, 9183, 9184, 9191, 9192, 9223, 9271, 9275, 9276, 9290, 9299, 9302, [illegible] 9463, 9486, 9490, 9494, 9507, 9508, 9509, 9510, 9515, 9541, 9543, 9555, 9570, 9586, 9587, 9588, 9621, 9623, 9632, 9634, 9643, 9654, 9660, 9661, 9662, [illegible] 121200700020031, 0428, 0464, 0478, 0479, 0501, 0505, 0507, 0517, 0522, 0523, 0527, 0542, 0543, 0548, 0553, 0559, 0562, 0564, 0566, 0568, 0572, 0581, 0591, [illegible] 0691, 0693, 0696, 0700, 0702, 0704, 0706, 0707, 0708, 0709, 0715, 0718, 0719, 0721, 0722, 0726, 0727, 0728, 0731, 0733, 0735, 0737, 0738, 0740, [illegible] 119360700040937, 1106, 1487, 1547, 1793, 1837, 1842, 1843, 1945, 2017, 2035, 2071, 2111, 2120, 2151, 2190, 2374, 2396, 2453, 2513, 2540, 2558, 2626, 2628, [illegible] 2985, 3002, 3011, 3019, 3020, 3049, 3075, 3079, 3082, 3102, 3119, 3124, 3126, 3148, 3149, 3157, 3193, 3202, 3234, 3237, 3254, 3256, 3261, 3265, 3269, 3274, [illegible] 3379, 3393, 3423, 3436, 3446, 3447, 3450, 3454, 3472, 3481, 3483, 3486, 3494, 3521, 3526, 4249, 4368, 4386, 4400, 4402, 4488, 4514, 4517, 4527, 4532, 4539, [illegible] 4616, 4620, 4621, 4631, 4636, 4639, 4644, 4648, 4655, 4663, 4676, 4681, 4682, 4688, 4689, 4696, 4706, 4710, 4711, 4712, 4720, 4723, 4724, 4726, 4748, 4750, [illegible] 4839, 4841, 4846, 4848, 4850, 4854, 4856, 4860, 4861, 4874, 4884, 4891, 4892, 4897, 4903, 4910, 4911, 4916, 4918, 4923, 4929, 4934, 4935, 4942, 4955, 4961, [illegible] 5026, 5030, 5031, 5032, 5033, 5037, 5040, 5047, 5062, 5063, 119360730002605, 2606, 2819, 2864, 3388, 3398, 3400, 3404, 3405, 3448, 3466, 3468, 3469, 3470, [illegible]

[illegible] రూ.10,000/ [illegible] 09388404174 [illegible]

[illegible]
మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ [illegible]

ఆంధ్రప్రభ

శాంతి భద్రతలకు పెద్దపీట

- కియా పరిశ్రమ రాకతో జిల్లాలో కొత్త అధ్యయనానికి నాంది
- హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప





అనంతపురం కార్పొరేషన్, ప్రభన్యూస్ : రాష్ట్రంలో శాంతి భద్రతల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పెనుగొండ మండలం, ఎర్రమంచి గ్రామంలో కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బెంగుళూరు నుండి ఎర్రమంచి గ్రామానికి చేరుకున్న ఆయనకు డీజీపీ ఆర్పీ ఠాకూర్, అనంతపురం రేంజ్ డీఐజీ కాంతి రాణా టాటా, జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ వీర పాండియన్, పెనుగొండ ఎమ్మెల్యే బికె పార్థసారథి, జెడ్పి చైర్మన్ పూల నాగరాజు, పెనుగొండ ఇన్‌ఛార్జ్ డీఎస్పీ వెంకట రమణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘనంగా స్వాగతం పలుకగా పోలీసులు గౌరవ వందనం చేశారు. తర్వాత వారితో కలిసి పోలీస్ స్టేషన్‌లో శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం శాంతి భద్రతల పర్యవేక్షణకు పెద్దపీట వేస్తోందని, అందుకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను పటిష్టం చేసే క్రమంలో సమర్థులైన అధికారులను నియమించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు మౌలిక వసతుల కల్పన చేస్తున్నామని, నూతన రాజధాని అమరావతిలో డీజీపీ కార్యాలయాన్ని ప్రారంభించామని, జిల్లాలో అవసరమైన చోట పోలీస్ స్టేషన్‌ను నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎర్రమంచిలో తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించామని, భూమిని అందించిన వెంటనే రూ.3 కోట్లతో మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మిస్తామన్నారు.

పరిశ్రమలు రావాలంటే శాంతి భద్రతలు పటిష్టంగా ఉండాలని, అందులో భాగంగా ఈ ప్రాంతంలో పోలీస్ స్టేషన్ మంజూరు చేశామని వివరించారు. అంతేకాకుండా ఈ ప్రాంతానికి కృష్ణా జలాలను అందించి ఉద్యానవన పంటల ద్వారా ఆదాయం అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పెనుగొండ నియోజకవర్గాన్ని వేలకోట్లతో అభివృద్ధి చేశారని, కియా పరిశ్రమ రాకతో భూమి ధరలు అమాంతం పెరిగాయని పేర్కొన్నారు. డీజీపీ ఆర్పీ ఠాకూర్ మాట్లాడుతూ కియా పరిశ్రమ రాకతో జిల్లాలో నూతన అధ్యాయం ప్రారంభమైందని, కియా రాకతో అనంత అభివృద్ధికి దోహదపడడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ భూమిని కేటాయించిన వెంటనే మోడ్రన్ పోలీస్ స్టేషన్‌ను నిర్మిస్తామని, పోలీస్ శాఖ తరుపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని డిజిపి పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కియా పరిశ్రమ దాదాపు రూ.18 వేల కోట్లతో ఏర్పాటు కావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి ఎంతో ఉందన్నారు. ఈ నెల 29న కియా పరిశ్రమలో ఉత్పత్తి కానున్న మొదటి కారు విడుదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తర్వాత జిల్లాలోని రాప్తాడు పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ రాప్తాడు పోలీస్ స్టేషన్ భవనాన్ని రూ.1.40 కోట్ల నిధులతో నిర్మించడం జరిగిందన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుండి ఎస్పై వరకు సౌకర్యంగా విధులు నిర్వహించేందుకు ప్రత్యేక వసతులతో ఈ భవనం నిర్మిచడం జరిగిందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులు, ప్రజలకు తగు సౌకర్యాలతో తమ ఫిర్యాదులను తెలిపేందుకు అనుగుణంగా నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లాలోని కనగానపల్లి పోలీస్ స్టేషన్, కళ్యాణదుర్గం, కదిరి సబ్‌డివిజన్ కార్యాలయాలు, నివాస గృహాలు, ఓడిసి పెట్రోల్ బంక్‌లలో శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఓడిసి పెట్రోల్ బంక్‌ను సుమారు రూ.70 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించడం జరిగిందన్నారు. మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు పాత్ర ఎక్కువగా ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో కియా పరిశ్రమ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చాండ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బరాయుడు, జెడ్పి చైర్మన్ పూల నాగరాజు, రాప్తాడు మండల కన్వీనర్ గజ్జల నారాయణస్వామి, జిల్లా నాయకులు ఆకుల వెంకట రాముడు, గంగలకుంట రమణ, మిడతల శీనయ్య స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక రంగం

- ఎర్ర రంగు పరచుకున్న నగరం
- సార్వత్రిక సమ్మె విజయవంతం



తిరుపతి క్రైం, ప్రభన్యూస్ : కనీస వేతనంగా రూ. 18 వేలు, సీపీఎస్ విధానం రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ రద్దు, అధిక ధరల నియంత్రణ, రైతులకు గిట్టుబాటు ధర వంటి అంశాలతో దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు మంగళవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో భారీ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ మేరకు నగర వీధులన్నీ జెండాలతో ఎర్రని రంగు పులుముకున్నాయి. ప్రధానంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దిష్టిబొమ్మల దగ్ధం కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులకు, కార్మిక సంఘాల నాయకులకు మధ్య పెనుగులాట జరిగింది. అనంతరం సంఘాల నాయకులు పి మురళి, రత్నకుమార్, కందారపు మురళిలు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు రంగ సంస్థల యాజమాన్యాలకు సేవలు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చేస్తోందని విమర్శించారు. కార్మిక సంఘాలు బలహీనపరుస్తూ నూతన కార్మిక సంఘాలు పెట్టకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ రంగానికి కొమ్ముకాస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న వచ్చే జాబు వస్తుందని ప్రచారం చేసి గద్దెనెక్కిన చంద్రబాబు ఈ నాలుగేళ్లలో ఎన్ని కొత్త ఉద్యోగాలను సృష్టించారో చెప్పాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వంటి రంగాల్లో కనీస వేతనాలు అమలు చేయడంలేదన్నారు. బోనస్, గ్రాట్యుటీ, పీఎఫ్‌లపై సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రభుత్వరంగ సంస్థల బంద్

సార్వత్రిక సమ్మెలో భాగమైన రెండోరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు బంద్ చేయనున్నారు. కార్మిక సంఘాలు ఈ మేరకు ప్రభుత్వ శాఖల్లోని సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనకుండటంతో ప్రభుత్వ కార్యాలయాలు మూతపడనున్నాయి. ఈ క్రమంలో ఉన్నత స్థాయి అధికారులను కూడా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు రామనాయుడు, రామచంద్రయ్య, జనార్దన్, చిన్నం పెంచలయ్య, పల్లయ్య, విశ్వనాథ్, శివారెడ్డి, శశి, ఉదయ్, మురళి, ఏఐటీయూసీ నాయకులు శివ, కైవై రాజ, గోవిందస్వామిలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను విమర్శిస్తే సహించం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రం లోని చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు 1.5 లక్షల బ్రాహ్మణ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందని, విధాన నిర్ణయాలకు లోబడి పని చేస్తున్న ఈ సంస్థను వివాదాల్లోకి లాగొద్దని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి అనంద సూర్య హెచ్చరించారు. లోటు బడ్జెట్‌తో రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఈ కార్పొరేషన్‌కు ముఖ్యమంత్రి రూ.285 కోట్లు విడుదల చేశారని, పారదర్శకంగా పని చేస్తున్న కార్పొరేషన్ పై అవగాహన లేని కొందరు వ్యక్తులు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్పొరేషన్ పని చేస్తూ పదవులు కోల్పోయిన రాజకీయ నిరుద్యోగులు కువిమర్శలు, అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని, వారి ప్రేలాపనల వల్ల బ్రాహ్మణ లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతారని అనంద సూర్య అన్నారు. బ్రాహ్మణ సహకార పరపతి సంఘం మీద కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఒకరు తన పదవిని కోల్పోగానే ఈ సంస్థలో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారన్నారు. అయితే సజావుగా సాగుతున్న కార్పొరేషన్ పని తీరును విమర్శించడం మానుకొని ఆయన తనకిష్టమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చునని , పేద బ్రాహ్మణలకు చేయూతనందిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్‌ను విమర్శిస్తే సహించేది లేదని అనంద సూర్య హెచ్చరించారు.

సాక్షర భారత్ సిబ్బందిని ఆదుకోండి

- సీపీఐ కార్యదర్శి రామకృష్ణ



అమరావతి, ఆంధ్రప్రభ : సాక్షర భారత్ ఉద్యోగులను ఇబ్బం ది పెట్టే రీతిలో గత జూన్‌లో రాష్ట్ర వయోజన విద్యాశాఖ జీవో జారీ చేసిందని, ఆ జీవోను ఉపసంహరిం చుకుని వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. సాక్షర భారత్‌లో మండల సమన్వయ కర్తలుగా 504మంది, జిల్లా సమన్వయకర్తలుగా 40 మంది, గ్రామ సమన్వయకర్తలుగా 19959 మంది విధులు నిర్వర్తిస్తున్నారని రామకృష్ణ తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు విధుల నుండి తప్పించిన వారందరినీ తిరిగి తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

నదుల అనుసంధానం ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు అవసరమా?

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానంపై నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ శాఖకు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం నదుల అనుసంధానం పేరుతో రాష్ట్రంలో అక్రమ ప్రాజెక్టులు కడుతున్నారంటూ మాజీ మంత్రి వట్టి వసంత్, త్రినాథ్ రెడ్డి దాఖలు చేసిన పిటీషన్లను ఎన్‌జిటి విచారించింది. జస్టిస్ గోయల్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ బెంచ్ విచారణ జరిపింది. గోదావరి డెల్టాకు నష్టం జరుగుతున్నా పట్టించుకోకుండా నదుల అనుసంధానం చేస్తున్నారని పిటీషనర్లు పేర్కొన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడి, గోదావరి - కృష్ణా - పెన్నా అనుసం ధాన ప్రాజెక్టులకు, వైకుంఠపురంలోని గోదావరి - పెన్నా లింక్ ప్రాజెక్టుకుల పర్యావరణ అనుమతులు అవసరమా? కాదా ? చెప్పాలని కేంద్రానికి ఎన్జీటీ ఆదేశాలిచ్చింది. ఈఐఏ నోటిఫికేషన్ కింద ఈ ప్రాజెక్టులను చేపట్టవచ్చా లేదా అనే అంశంపై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కోరింది. అలాగే ఈ అంశాలపై కేంద్ర పర్యావరణ శాఖ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో కూడా వీటిపై విడిగా ఫిర్యాదు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. ఫిర్యాదు అందిన వారంలోగా నిర్ణ యం తీసుకొని నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలికి ఎన్జీటీ ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది.

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

'E' Procurement Notice

No.81/VMC-Engg/CDB/AE/2018-19 Dt: 08.01.2019

Sl. No.	Name of Work	Estimate Amount Rs. In Lakhs
1.	Providing BT Road, Community Hall, Retaining Wall (3 Works)	175.20

Contact: Superintending Engineer, VMC, Vijayawada - 520 001.
Further details can be seen @ 'e' procurement market place @ www.tender.apeprocurement.gov.in
Download of bid documents starts from : 09-01-2019 @ 03.30 P.M
Last date / time for receipt of tenders : 22-01-2019 upto 04.00 P.M
Sd/- K.S. Rama Murthy
For Commissioner

చంద్రబాబు అవినీతిపై కేంద్రం దర్యాప్తు చేయాలి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : చంద్రబాబు అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు డిమాండ్ చేశారు. మంగళవారం మాజీ ఎంపీ మేకపాటి నివాసంలో ఎంపరర్ ఆఫ్ కరప్షన్ అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, వేంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాద్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చంద్రబాబు అవినీతితో ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డ పై వేలాది రూపాయల అప్పుల భారం మోపారని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు.తన పరిపాలనలో రాష్ట్ర బడ్జెట్ ను మించి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బడ్జెట్ కి సంబంధం లేకుండా 6 లక్షల కోట్లు అవినీతి చేశారన్నారు. రాజధాని భూములలో, లోటు బడ్జెట్ లో అన్ని చోట్లా అవినీతి చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అవినీతిని పుస్తకంలో వివరించామన్నారు. ఈ పుస్తకాలను దేశంలోని ఎంపీలందరికీ ఇస్తున్నామని చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని మాజీ ఎంపీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే తాము కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. బాబు అవినీతి పై కేంద్రం సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి రాక్షస పాలన జరుగుతోందని రాజ్యసభ సభ్యుడు వేంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు. చంద్రబాబు ఆరు లక్షల కోట్ల రూపాయలకు మించి అవినీతి కి పాల్పడ్డారని అన్నారు. కాదేదీ అవినీతి కి అనర్హం అన్నట్టుగా చంద్రబాబు దోపిడీ చేశారని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆరోపించారు.చంద్రబాబు అబద్దాలకు మారుపేరని, మాజీ ఎంపీ వరప్రసాద్ అభివర్ణిం చారు.ప్రభుత్వమే అవినీతిని స్పాన్సర్ చేస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం అవినీతి కి కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు.

గాంధీ విగ్రహం వద్ద ధర్నా

ఏపీ విభజనచట్టంలోని హామీలను నెరవేర్చాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ పార్లమెంటులో ధర్నా చేశారు. గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు ఈ ధర్నాలో ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ వరప్రసాద్ పాల్గొన్నారు.

అయేషా మీరా కేసు అంతు చిక్కేనా?

- సాక్ష్యాల ధ్వంసంతో సీబీఐ సతమతం
- పోలీసు రికార్డులే కీలకం
- సంక్రాంతి తరువాత రోజువారీ విచారణ





అమరావతి, ఆంధ్రప్రభ : ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు సీబీఐకి సవాల్‌గా మారనుంది. కేసులో కీలక సాక్ష్యాలుగా పరిగణించే మెటీరియల్ ఎవిడెన్స్ (ఘటనా స్థలంలో సేకరించిన వస్తువులు) ధ్వంసం కావడం సీబీఐ దర్యాప్తుకు ఆటంకం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసుల్లో సాక్షులు ఇచ్చే సమాచారం కంటే ఘటనా స్థలంలో సేకరించిన నమూనాలే కోర్టు కీలకంగా పరిగణిస్తుంది. ఇప్పుడు అవే ధ్వంసం కావడంతో సీబీఐ అధికారులు ఏ విధంగా ముందుకు వెళ్లనున్నారనే దానిపై చర్చ సాగుతోంది. పైగా ఆయేషా మీరా ఘటన, అత్యాచారం కేసు జరిగి పదకొండేళ్లు గడిచింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కొద్ది రోజుల కిందట ఆయేషా మీరా హత్య, అత్యాచారం కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐ చేపట్టింది. ఆయేషా మీరా హత్య, కోర్టు పరిధిలోని రికార్డుల దగ్ధంపై సీబీఐ అధికారులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. రికార్డులు, ఇతర ఆధారాల ధ్వంసం అనేది కుట్రపూరితంగానే జరిగిందని నిర్ధారించిన సీబీఐ అధికారులు ముగ్గురు కోర్టు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. మరో వైపు హైకోర్టు ఆదేశాల మేరకు ఆయేషా కేసు విచారణ చేపట్టారు. సీబీఐ డీఐజీ చంద్రశేఖర్ నేతృత్వంలో హైదరాబాద్, విశాఖపట్టణం నుంచి పలువురు అధికారులు విజయవాడ చేరుకొని కేసు తాలూకు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.సంక్రాంతి తర్వాత విజయవాడ పోలీసులు సీబీఐ అధికారుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేయనున్నారు. అప్పటి నుంచి ఆయేషా కేసు రోజువారీ విచారణ సాగనుంది. ఈ క్రమంలోనే కీలకమైన మెటీరియల్ ఎవిడెన్స్ పాత్ర తెరపైకి వస్తోంది. ఆయేషా హత్య జరిగిన ఇబ్రహీంపట్నం శ్రీదుర్గా హాస్టల్ నుంచి పోలీసులు బెడ్‌షీట్లు, దిండ్లు, దుస్తులు, టవల్స్, పుస్తకాలు, పేపర్లు, వెజినల్ స్వాబ్స్, వేలి ముద్రలు, తల వెంట్రుకలు సేకరించారు. హత్య తర్వాత సమీపంలోని బాత్‌రూమ్‌కు ఈడ్చుకుంటూ వెళ్లినప్పుడు అయిన రక్తపు మరకలను కూడా పోలీసు అధికారులు సేకరించారు. కేసులో నిందితునిగా సత్యంబాబును అరెస్టు చేసిన తర్వాత హత్యకు ఉపయోగించిన పచ్చడి బండను పోలీసులు స్వాధీనం చేసుకొని కోర్టుకు స్వాధీనం చేశారు. 2016లో సత్యంబాబును నిర్దోషిగా విడుదల చేసిన తర్వాత కేసు పునర్విచారణకు హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు సాక్ష్యాలు దగ్ధం చేసిన విషయాన్ని గుర్తించి నివేదిక ఇచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం ఆయేషా హత్య సమయంలో సేకరించిన 14 రకాల వస్తువులు ధ్వంసం చేసినట్లు గుర్తించింది. ఇప్పుడా వస్తువుల సేకరించడం సాధ్యమయ్యే విషయం కాదు కాబట్టి ప్రత్యక్ష సాక్షులుగా పేర్కొన్న వారు ఇచ్చే సమాచారం, పోలీసు రికార్డుల పైనే ఆధారపడాల్సి ఉంటుంది. పోలీసులు నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్), కోర్టులో దాఖలు చేసిన నేరాభియోగ పత్రం(చార్జిషీటు) మాత్రమే సీబీఐ అధికారులు ముందుకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన మార్గాలుగా తెలుస్తోంది. హత్య మొదలు సాక్ష్యాల ధ్వంసం వరకు అనేక సంచలనాలకు కేంద్ర బిందువైన ఆయేషా కేసు దర్యాప్తులో సీబీఐ ఏ విధంగా ముందుకు సాగబోతోందనే ఉత్కంఠ ఇప్పుడు నెలకొంది.

10మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు



నెల్లూరు (క్రైం), ప్రభన్యూస్ : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి, డక్కిలి తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచి రెండు మండలాల పరిధిలో నిఘా ఉంచి 10 మంది అంతర్రాష్ట్ర ఎర్ర స్మగ్లర్లను పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 1 కోటి 75 లక్షలు విలువచేసే 122 ఎర్రచందనం దుంగలు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకున్నారు. ఈ సందర్భంగా ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి స్మగ్లర్లకు సంబంధించి వివరాలను వెల్లడించారు. వెంకటగిరి, డక్కిలి ప్రాంతాలలో ఎర్రచందనం స్మగ్లర్లు దుంగలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎస్పీకి సమాచారం రావడంతో ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావ్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలను ఆ ప్రాంతంలో నిఘా ఉంచి గాలింపు చర్యలు చేపట్టారు. డక్కిలి పరిధిలోని దేవుడు వెల్లంపల్లి, వెంకటగిరి మండల పరిధిలోని కోన మల్లేశ్వరకోన అటవీ ప్రాంతంలో స్థానిక ఎస్సైలు, సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా ఎర్రచందనం స్మగ్లర్లు పోలీసులను చూసి అప్రమత్తమై పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడికి ప్రయత్నించి పోలీసులను కడతేర్చే యత్నానికి దిగారు. భారీ బలగాలతో మోహరించిన పోలీసు అధికారులు వ్యూహాత్మకంగా ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1 కోటి 75 లక్షలు విలువచేసే 122 ఎర్రచందనం దుంగలు, ఒక ఐచర్ మినీలారీ, 6 మోటార్‌సైకిళ్లు, 12 సెల్‌ఫోన్లు, రూ. 2100 నగదు స్వాధీనపరుచుకున్నారు.

కళాశాలలకు సౌర వెలుగులు

- ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో అమలు
- ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దమయంతి ఆదేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సౌర శక్తిని వినియోగించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. త్వరలో ఈ ప్రతిపాదనను అమలుచేసి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించింది. తొలుత ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో అమలు చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల్లో సౌర శక్తిని వినియోగించనున్నారు. రాష్ట్ర ఇంధన వనరుల పరిరక్షణ మిషన్ ద్వారా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. విద్యుత్ పొదుపులో భాగంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ పరికరాలను తొలగించాలని నిర్ణయించారు. ప్రధానంగా లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, వీధిదీపాలు, పంపుసెట్లను సైతం మార్చి వాటి స్థానంలో సౌరశక్తి ద్వారా నడిచే విద్యుత్ పరికరాలను అమర్చనున్నారు. సౌర శక్తి ద్వారా వినియోగించే పరికరాలను ఉచితంగా సరఫరా చేయనున్నారు. రాష్ట్ర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఈడీసీవో), ఇంధన వనరుల సంస్థ (టీఈఆర్ఐ), ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్)తో సోలార్ పరికరాల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి పరిధిలోని అన్ని జిల్లాల్లో గల విశ్వవిద్యాలయాలు, కళాశాలలతోపాటు ఆయా ప్రాంగణాల్లోని అన్ని భవనాలు, వసతి గృహాల్లో దశలవారీగా సౌర విద్యుత్తును వినియోగించనున్నారు. దీనిద్వారా 50 శాతం విద్యుత్తు ఆదా అవుతున్నట్లు భావిస్తున్నారు. సౌర విద్యుత్తు ద్వారా వినియోగించే పరికరాల వ్యయం మూడు సంవత్సరాల్లో తిరిగి ఆదా అవుతున్నట్లు భావిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద రెండు జిల్లాలను ఎంపిక చేయాల్సిందిగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దమయంతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 13 విశ్వవిద్యాలయాలతోపాటు వెయ్యికి పైగా జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా విద్యా సంస్థల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేసి వాటి నిర్వహణ, మరమ్మతుల బాధ్యతను సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖకు అప్పగించారు. మరిన్ని వివరాలు మార్గదర్శకాల కోసం వేచిచూస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వరదరాజన్ వెల్లడించారు. సౌరశక్తివలన పర్యావరణ పరిరక్షణతోపాటు ప్రభుత్వానికి విద్యుత్ బిల్లుల భారం తగ్గనుంది.

ముఖ్యాంశాలు

- అన్నిరకాల విద్యుత్ దీపాల స్థానంలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు.
- ఏసీలను సోలార్ ఎనర్జీ వినియోగానికి తగినట్లుగా ఫైవ్ స్టార్ రేటింగ్ పరికరాల అమరిక.
- పాత పంపుసెట్ల స్థానంలో సౌర శక్తి పంపుసెట్ల ఏర్పాటు.
- ట్యూబ్ లైట్లును మార్చడం ద్వారా 80 శాతం ఆదా.
- విద్యుత్ దీపాలను మార్చి ఎల్ఈడీ దీపాల ఏర్పాటు ద్వారా 68 శాతం ఆదా.

స్కూల్‌పై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- కంచికచర్లలో ఉద్రిక్తత
- జాతీయ రహదారిపై బైఠాయింపు
- ప్రిన్సిపల్ నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



కంచికచర్ల, ప్రభ న్యూస్: ప్రిన్సిపాల్ మందలించడతో పాఠశాల భవనం పై నుంచి దూకి బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణా జిల్లా, కంచికచర్లలో మంగళవారం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు వీరులపాడు మండల పరిధిలోని కొణతాలపల్లి గ్రామానికి చెందిన శీలం నాగార్జున సాయిబాబా రెడ్డి (13) కంచికచర్ల పట్టణంలో 65వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఈ ఏడాది నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ చైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం సాయిబాబా రెడ్డి పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో తరగతి గదిలో విద్యార్థుల మధ్య చిన్న కీచులాట జరిగింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయురాలు సాయిబాబా రెడ్డిని ప్రిన్సిపాల్ దగ్గరకు తీసుకువెళ్లింది. దీంతో ప్రిన్సిపాల్ ప్రసాద్ బాలుడిని మందలించారు. మనస్థాపం చెందిన సాయిబాబా రెడ్డి ఉదయం 10.30 గంటల సమయంలో డాబా పైకి ఎక్కి అక్కడ నుంచి కిందకు దూకాడు. పై నుంచి పడుతున్న సమయంలో ఇనుపై గేటుపై బాలుడు పడిపోవడంతో నడుము వద్ద తీవ్ర గాయమై అక్కడికక్కడే కన్ను మూశాడు. దీంతో ప్రిన్సిపాల్ ప్రసాద్ వెంటనే స్పందించి బాలుడు సాయిబాబా రెడ్డిని హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపగా, అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు, పాత్రికేయులు అక్కడకు చేరుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా బాలుడి భౌతిక కాయాన్ని పాఠశాల ప్రతినిధులు నందిగామ మార్చురీకి తరలించే ప్రయత్నం చేయగా, విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడకు చేరుకొని బాలుడి తల్లిదండ్రులు వచ్చే వరకు మృతదేహాన్ని తరలించేందుకు వీల్లేదంటూ తేల్చి చెప్పారు. ఈలోగా సమాచారం అందుకున్న బాలుడి తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతిచెందాడని, తక్షణమే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ నేరుగా ఆసుపత్రి నుంచి సాయిబాబా రెడ్డి మృతదేహాన్ని పాఠశాల వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. యాజమాన్యంతోపాటు ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అయినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో 65వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రోడ్డుపైనే టెంట్ వేసి మూడు గంటలపాటు రహదారిని స్తంభింపచేశారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు కోగంటి బాబు, డీవైఈఓ చంద్రకళ, ఎంఈఓ లావుడ్యా చిట్టిబాబు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీరామకృష్ణ డీఎస్పీ హరిరాజేంద్రబాబు, సీఐలు కె.సతీష్, పి.వెంకటరమణ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతోపాటు పాఠశాల యాజమాన్యంతో చర్చించారు. జరిగిన సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు పాఠశాలను సీజ్ చేశారు. కాగా, 5కె రన్ వెళ్తుండగా, చూసేందుకు పాఠశాల భవనం ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడిపోయి సాయిబాబా రెడ్డి మృతిచెందా డంటూ గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు. దీనిపై లోతుగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. కాగా, విజయవాడ సబ్ కలెక్టర్ మిషా సింగ్ కంచికచర్లకు చేరుకొని సంఘ టన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసు, రెవెన్యూ, విద్యా శాఖ అధికా రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటికే బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ తరలించడంతో సబ్ కలెక్టర్ నందిగామ తరలి వెళ్లారు.

కరవు నివారణకు తక్షణ చర్యలు



● ధాన్యం కొనుగోళ్లకు సహకారం ● గ్రామ సభలకు స్పందన భేష్ ● టెలీకాన్ఫరెన్స్‌లో సీఎస్ అనిల్‌చంద్ర పునేఠ

అమరావతి, ఆంధ్రప్రభ : గడిచిన నాలుగున్నరేళ్ళలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమంపై జన్మభూమి గ్రామ సభల్లో చర్చించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్రపునేఠ జన్మభూమి కార్యక్రమ నిర్వాహణపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి గ్రామసభలకు ప్రజల నుండి అద్భుత స్పందన లభిస్తుందని చెప్పారు. అధికార యంత్రాంగం మరింత ఉత్సాహంగా పనిచేసి అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని పొందాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పశువైద్య శిబిరాలకు స్పందన విశేషంగా ఉందన్నారు. కరవు నివారణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేయాలని, రానున్న వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పశుగ్రాస సాగును ముమ్మరం చేసి పాడి రైతులకు గ్రాసం పంపిణీ చేయాలని నిర్దేశించారు. తడిచి రంగు మారిన ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్ళపై సమీక్షలు నిర్వహించామని, వీటిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని స్పష్టంచేశారు. అంగన్‌వాడీ కేంద్రాలనిర్వాహణలో రాష్ట్రానికి 4అవార్డులు రాగా వీటిలో కృష్ణా జిల్లాకు రెండు లభించడం అభినందనీయ మన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఒక నమూనాగా నిలవాలన్న ఆకాంక్షను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, నోడల్ అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైలులో ఉప రాష్ట్రపతి

● రేణిగుంట - వెంకటాచలం వరకూ సాగిన ప్రయాణం

● తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో ప్రత్యేక చర్చ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు రైలులో ప్రయాణించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల గురించి ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. అత్తగారి దశదిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెంకయ్యనాయుడు మంగళవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కణ్నుంచి రైలు మార్గంలో వెంకటాచలం (నెల్లూరు) చేరుకున్నారు. ఉప రాష్ట్రపతి రైలులో ప్రయాణించే సమయాన్ని పలు రైల్వే ప్రాజెక్టుల గురించి అధికారులతో చర్చించేందుకు కేటాయించారు. ఈ సమావేశానికి జనరల్ మేనేజర్ ఆర్.కె.కులశ్రేష్ఠ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్, డీఆర్ఎం విజయ్ ప్రతాప్ సింగ్, ఆర్వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ కమలాకర్ రెడ్డి హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం రవాణా సౌకర్యాలు కీలకమనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, నూతన రైల్వే ప్రాజెక్టులతో పాటు ప్రస్తుతం ముందుకు సాగుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. ముఖ్యంగా కృష్ణపట్నం - ఓబులవారిపల్లె రైల్వే లైను, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం పనుల గురించి ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. వీటితో పాటు గూడూరు విజయవాడ మూడో లైను, గుంటూరు - అమరావతి - విజయవాడ రైల్వేలైను, గుంతకల్లు స్టేషన్, నెల్లూరు నూతన స్టేషన్లతో పాటు గూడూరు, రేణిగుంట స్టేషన్లలో వైఫై సౌకర్యం గురించి చర్చించారు. వీటితో పాటుగా ఈ మధ్య రైల్వే ప్రవేశపెట్టిన సువిధ డైనమిక్‌ఫెయిర్ ట్రైన్స్‌గురించి కూడా మాట్లాడారు. వీటిలో టిక్కెట్టు ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని, మధ్యతరగతికి సౌకర్యవంతంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకయ్య నాయుడు సూచించారు.



నెల్లూరు - కడప జిల్లాల మధ్య ముడి సరుకుల రవాణా, ప్రయాణ సౌకర్యాలు, కృష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులకు ఉద్దేశించిన కృష్ణపట్నం - ఓబుల వారి పల్లె రైల్వే లైన్ సొరంగం పనుల గురించి గతంలోనే రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ని తన ఛాంబర్‌కు పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. అప్పట్లో రైల్వే బోర్డు ఛైర్మన్ లోహాని, ఆర్వీఎన్ఎల్ ముఖ్య అధికారి ప్రదీప్ గౌర్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి కానున్నట్లు ఉపరాష్ట్రపతికి పూర్తి వివరాలను రైల్వే అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం ఆ పనుల గురించి మరోసారి ఉపరాష్ట్రపతి రైల్వే అధికారులతో చర్చించారు. ముందుగా తెలియజేసినట్లుగా ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. రాయలసీమ మరియు కోస్తా ప్రాంతాలను కలుపుతూ, కడప - నెల్లూరు మధ్య ముడిసరుకుల రవాణా కోసం ఉద్దేశించిన ఈ రైల్వే లైనును ప్రజా రవాణా కోసం కూడా అందుబాటులో తెచ్చేందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సానుకూలమైన నిర్ణయాన్ని తీసుకునే దిశగా ఆలోచించాలని ఉపరాష్ట్రపతి గతంలోనే రైల్వే మంత్రికి సూచించారు. ఈ విషయాన్ని అధికారులకు కూడా వివరించి, దానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను విషయంలోనూ ఉపరాష్ట్రపతి రైల్వే అధికారులతో మాట్లాడారు. పనుల వేగం, ఏ సమయానికి పూర్తి కావచ్చు వంటి తదితర అంశాల గురించి అడిగిన ప్రశ్నలకు రైల్వే అధికారులు వివరాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 ఆగష్టులో 45 కి.మి విస్తీర్ణం కలిగిన భూమిని పిడుగురాళ్ళ - సవలాయ పురం మధ్య అందించిందని, అయితే అందులో రెండు చోట్లు భూమి విషయంలో వివాదాలు తలెత్తి, ప్రస్తుతం అది హైకోర్టులో వివాదం నడుస్తోందని, దీని మీద రాష్ట్ర ప్రభుత్వం వివరాలు అందించాల్సి ఉందని తెలిపారు. అదే విధంగా పిడుగురాళ్ళ - రొంపిచర్ల మధ్య వివాదంలో ఉన్న భూమి మినహా మిగిలిన ప్రదేశంలో పనులు పూర్తి అయ్యాయని, వివాదాలు తేలిన తర్వాత మిగిలిన చోట కూడా పని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పూర్తైన రైల్వే లైను విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పలు కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి ఆమోదం రావలసి ఉందని తెలిపారు. ఈ విషయంలో వెంటనే చొరవ తీసుకోవాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. క్లియరెన్స్ రావలసిన కేంద్ర మంత్రిత్వ శాఖలతో తాను మాట్లాడతానని వెంకయ్య నాయుడు తెలిపారు.

ఉప రాష్ట్రపతితో పాటు ఏపీ మంత్రి నారాయణ, ఆర్వీఎన్ ఎల్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కృష్ణపట్నం - ఓబుల వారి పల్లె రైల్వే లైన్ పరిశీలన

నెల్లూరు హైవే మీదుగా వెళుతున్న కృష్ణపట్నం - ఓబులవారి పల్లె రైల్వే లైను వంతెన మీద నుంచి ప్రాజెక్ట్ పనులను ఉప రాష్ట్రపతి పరిశీలించారు. పనులు ఎక్కడ వరకూ వచ్చాయనే విషయంతో పాటు రైల్వే స్టేషన్ల ఏర్పాటు గురించి వారితో మాట్లాడారు. కొన్ని చోట్ల నీరు నిలవడం లాంటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఎన్టీఆర్ కుమారుడిగా జన్మించడం నా పూర్వజన్మ సుకృతం

● నటనలో, రాజకీయ జీవితంలో ఆయనకు ఆయనే సాటి ● ఎన్టీఆర్ బయోపిక్ చిత్ర యూనిట్ ప్రెస్‌మీట్‌లో హీరో నందమూరి బాలకృష్ణ



కథానాయకుడు చిత్ర యూనిట్‌తో మీడియాతో మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ

తిరుపతి, ప్రభన్యూస్ : తన తండ్రి నందమూరి తారకరామారావును ఈ సృష్టి ఉన్నంతవరకు ఎవరూ మరువలేరని ఆయన కుమారుడుగా తాను జన్మించడం తన పూర్వజన్మ సుకృతమేనని హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపేర్కొన్నారు. బాలకృష్ణ బుధవారం ఎన్టీఆర్ బయోపిక్ (కథానాయడుకు) చిత్రం విడుదల సందర్భంగా మంగళవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని అనంతరం నేరుగా తిరుపతిలోని పిజిఆర్ థియేటర్‌కు చేరుకున్నారు. ఇక్కడ కథానాయకుడు సినిమా ప్రివ్యూ కార్యక్రమంలో పాల్గొని అటుతర్వాత ఆ చిత్ర యూనిట్‌తో కలిసి మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి ఎన్టీఆర్ నటనలో విశ్వవిఖ్యాతి గాంచారని, ఆయనకు ఏ వేషమేసినా అందులో పూర్తిగా జీవించేవారని, ఆ పాత్రకు అందాన్ని, హుందాను తెచ్చిపెట్టేవారని, నేటికీ ప్రపంచంలో భగవంతుడు అంటే ఎన్టీరామారావునే ఊహించుకుంటున్నారని బాలకృష్ణ పేర్కొన్నారు. తెలుగుదనానికి, తెలుగుభాషకు వన్నెతెచ్చిన తన తండ్రి ఎన్టీఆర్ ఇటు సినీరంగంలో, అటు రాజకీయ రంగంలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఘనత తన తండ్రికి దక్కిందని, ఆయన జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేయాలనే నేపథ్యంతో ఈ కథానాయకుడు (ఎన్టీఆర్ బయోపిక్) చిత్రాన్ని నిర్మించామని, ఈ చిత్ర నిర్మాణంలో దర్శకుడు జాగర్లమూడి క్రిష్ ప్రతిభ అపూర్వమని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ చిత్రంలో తనతో పాటు నటించిన కళ్యాణ్‌రామ్, విద్యాబాలన్, సుమంత్ తదితరులను బాలకృష్ణ అభినందించారు. ఈ చిత్రం వైవిధ్య భరిత నేపథ్యంలో తన తండ్రి పాత్రలో తాను నటించడం ఆనందంగా భావిస్తున్నానని, ఈ చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు. తొలుత బాలకృష్ణ పిజిఆర్ థియేటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం పలువురు బాలకృష్ణ అభిమాన సంఘాల నేతలు, టీడీపీ నేతలు ఆయన్ను గజపుష్పమాలతో, కిరీటంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిజిఆర్ థియేటర్‌లో కథానాయకుడు చిత్ర ప్రివ్యూను అభిమానులతో కలిసి తిలకించారు.

పగటి కలల ప్రతిపక్ష నేత



● పోలవరం రికార్డులపై అక్కసు ● లాలూచీ రాజకీయాలతో రాష్ట్రానికి ద్రోహం ● నిధుల కోసం నోరెత్తని జగన్ ● మంత్రి దేవినేని ఆగ్రహం

అమరావతి, ఆంధ్రప్రభ : పోలవరం జాతీయ ప్రాజెక్టు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్క డం చాలా సంతోషంగా ఉందని జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం విజయవాడ జలవనరుల శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 32,315.5 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేయడం గొప్ప విషయమని, దేశమంతా గర్వపడి తెలుగువాడి సత్తాను అభినందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నాడని మండిపడ్డారు. గిన్నిస్ రికార్డు పేరుతో నాటకం అంటూ తన అవినీతి పత్రికలో విషం చిమ్మడం దుర్మార్గమని, వేలాది మంది కార్మికులు, ఇంజ నీర్లు 24 గంటల శ్రమని అవమానించాడని ఆరోపించారు. మంచిని కూడా అంగీకరించలేని మానసిక వ్యాధితో జగన్ బాధపడుతున్నాడని, సీఎం చంద్రబాబును తిట్టకుండా, సీఎం సీటుపై కలలు కనకుండా జగన్‌కు రోజు గడవదని ఎద్దేవా చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సీఎం నిధులు కేటాయించి పోలవరం పనులను పరు గులు పెట్టిస్తున్నారని, కేంద్రం నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నా జగన్ నోరు తెరవడన్నారు. జగన్ మరీ నీచంగా దిగజారి కోర్టులో కేసులు కూడా వేయించి పోలవరం అడ్డుకునేందుకు కుట్రలు చేసి తన నైజాన్ని బయట పెట్టుకున్నాడని ఆగ్రహిం చారు. సీఎం పదవి పిచ్చి పట్టిన జగన్‌కు ఆ కుర్చీ తప్ప మంచి ఏదీ కనిపించడం లేదని, నిర్వాసితులకు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా కేంద్రం నిధులు విడుదల చేయ కుండా ఇబ్బందులు పెడుతోందని, ప్రధాని మోడీని, కేంద్రాన్ని జగన్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. మోడీ, కేసీఆర్‌లతో జగన్ లాలూచీ రాజకీయాలు చేస్తూ ఏపీ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని, జగన్, విజయసాయిరెడ్డిలు పోలవరంపై విమర్శలు చేస్తూ చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని పుస్తకాలు వేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు, ఇంజనీర్లు, నిపుణులు సమక్షంలో పనులు చేశామని, 32వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేస్తే జగన్ తన పత్రికలో పూత అని రాసాడని, తన స్వార్థం కోసం గిన్నిస్ రికార్డును కూడా తప్పు పట్టేలా పిచ్చి కథనం రాశాడని, ఇంతకన్నా దుర్మార్గం ఏమైనా ఉందా అంటూ నిలదీ శారు. కృష్ణా డెల్టాలో రెండు పంటలతోపాటు, రాయలసీమకు నీరు ఇచ్చి చూపామని, రాయలసీమ రతనాల సీమను చేసేందుకు సీఎం తపన పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రణాళికల వల్లే నేడు అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రూ.10,449కోట్ల పోలవరం పనులు చేస్తే రూ.25వేల కోట్ల అవినీతి జరిగిందని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, మోడీ, కేసీఆర్ డైరెక్షన్‌లో జగన్ చంద్రబాబుపై కుట్రలు చేస్తున్నారని, ఎంతమంది అడ్డుపడినా చంద్రబాబు పోలవరం పూర్తి చేసి రైతాంగానికి కానుకగా అందిస్తారని మంత్రి దేవినేని ఉమా స్పష్టం చేశారు.

విశాఖ- చెన్నై కారిడార్‌కు రూ.106.75 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర పారిశ్రామిక వాణిజ్య శాఖ విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమానికి పరిపాలనాపరమైన అనుమతలతో పాటు రూ.106.75 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సాల్మన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ పనుల కోసం చేపట్టిన భూసేకరణలో నిర్వాసితులకు ఈ నిధులను అందజేయనున్నారు.

ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ పదవీ కాలం పొడిగింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. సర్కార్ విజయకుమార్ పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన పదవీ కాలం గత ఏడాది జూన్ 9వ తేదీతో ముగిసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం విజయ్‌కుమార్ 2020 జూన్ 8వ తేదీ వరకూ ఎస్సీ కో ఆపరేటీవ్ ఫైన్సాన్స్ కార్పొరేషన్ ఎండీగా కొనసాగనున్నారు.

జగన్... చర్చకు వస్తావా?

● మంత్రి పత్తిపాటి సవాల్ ● మోడీ దర్శకత్వంలో నిందల పుస్తకాన్ని విడుదల చేసిన ప్రతిపక్ష నేత

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రధాని మోడీ దర్శకత్వంలో సీఎం చంద్రబాబుపై విపక్ష నేత జగన్ నిందల పుస్తకాన్ని విడుదల చేశారని పౌరసరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. సచివాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో పత్తిపాటి మాట్లాడుతూ, జగన్ విడుదల చేసిన పుస్తకం అరిగిపోయిన రికార్డులాంటిదని ఎద్దేవాచేశారు. సీఎంపై విమర్శలు చేస్తున్నజగన్ తన కుటుం బ అస్తులు ప్రకటించే దమ్ముందా అంటూ ప్రశ్నించారు. బెంగుళూరు ప్యాలెస్, లోటస్ పాండ్ తదితర ఆస్తులను బినామీల పేరతో నడుపుతున్నారా లేదా అంటూ నిలదీశారు. జగన్ అచ్చు వేయించిన పుస్తకం మోడీ తప్ప రాష్ట్రప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు.



రాజధానిలో టీడీపీ నేతలు భూములు కొన్నారన్న ఆరోపణలపై దమ్ముంటే జగన్ బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మంత్రి నారాయణ రాజధానిలో 3 వేల ఎకరాలకుపైగా భూములు కొనుగోలు చేశారన్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ముం దుగా రాష్ట్ర బడ్జెట్ ఎంతో తెలుసుకోవాలని, బడ్జెట్ తెలియ కుండా రూ. 6 లక్షల కోట్లు అవినీతి జరిగిందని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. సీబీఐ నమోదు చేసిన రూ. 43 వేల కోట్లను జగన్ రాష్ట్రప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీని నిలదీయలేని జగన్ రాష్ట్రాభి వృద్ధికోసం అహర్నిశలూ పనిచేస్తున్న చంద్రబాబుపై ఆరోపణ లుచేస్తూ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిచారు. 2019 ఎన్నికల్లో150 సీట్లలో టీడీపీ గెలుస్తుం దని ధీమా వ్యక్తంచేశారు. వైసీపీకి రానున్న ఎన్నికల్లో గతం లో వచ్చిన సీట్లు కూడా రావని పుల్లారావు అన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్ష కీ విడుదల


అమరావతి, ఆంధ్రప్రభ : పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల నియామకానికి నిర్వహించిన రాత పరీక్ష 'కీ'ని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. పోలీసు శాఖలోని సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల కానిస్టేబుళ్లు, జైళ్లశాఖ వార్డన్లు, అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 6, 8 తేదీల్లో రెండు విడతలుగా రాత పరీక్ష నిర్వహించారు.

ఆయా పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాల వారీగా జవాబులను (కీ) విడుదల చేసి పోలీసు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్న పక్షంలో నిర్దేశిత నమూనాలో గురువారం రాత్రి 8గంటల లోగా ఈ-మెయిల్ ద్వారా పంపాలని ఆయన సూచించారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్దేశించినదానికి విరుద్ధంగా పంపే వాటిని పరిగణలోకి తీసుకోబోమని ఆయన స్పష్టం చేశారు.

పీపుల్స్ ఫ్రెండ్లీ పోర్టుగా రామాయపట్నం

● 3,500 ఎకరాల భూ సేకరణ ● రూ.5 వేల కోట్ల వ్యయం ● మరిన్ని పరిశ్రమలకు అవకాశం ● ఓడరేవుల సంస్థ ఎండీ కోయ ప్రవీణ్

అమరావతి, ఆంధ్రప్రభ : రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో ప్రకాశం జిల్లాలో పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ఏపీ ఓడరేవుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. ఈ పోర్టుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని రేరా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఉలవపాడులో ఈ పోర్టును రాష్ట్రప్రభుత్వం ఏపి మారిటైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనుందని తెలిపారు. పిపుల్స్ ఫ్రెండ్లీ పోర్టుగా దీనిని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో శరవేగంగా ఏర్పాటుచేస్తుం దన్నారు. రూ. 5వేలకోట్ల వ్యయంతో నిర్మించనున్న పోర్టుకు అనుబంధంగా అనేక పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. పోర్టుకు అనుబంధంగా స్టీల్ ప్లాంట్ కూడారానుందని కోయా ప్రవీణ్ వెల్లడించారు. సిమెంట్‌పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ఒక ఎంవోయు చేసుకుందని తెలిపారు. దేశంలో అతిపెద్దపోర్టు గుజరాత్‌లో ఉందని ,రాష్ట్రపరిధిలో ఉన్న పోర్టులను మైనర్ పోర్టులుగా కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న పోర్టులను మేజర్ పోర్టులుగా పరిగణిస్తారని చెప్పారు. రాష్ట్రంలో 14పోర్టులు ఉండగా 4 పోర్టులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్రంలోని పోర్టులను రెండు గ్రూపులుగా విభజించడం జరిగిందన్నారు. కాకినాడ పరిధిలో నరసాపురం నుండి శ్రీకాకుళం వరకు ఉన్న నాలుగు ఓడరేవులు ఉండగా మిగిలిన ఓడరేవులను మచిలీపట్నం పరిధిలోకి చేర్చడం జరిగిందన్నారు. రామాయపట్నం పోర్టు పదేళ్ళ పాటు కాకినాడ పోర్టుపరిధిలో పనిచేస్తుందని తెలిపారు. కాకినాడ పరిధిలో ఉన్న ఓడరేవుల ద్వారా ప్రతీ ఏటా రూ. 150కోట్ల ఆదాయం వస్తుందని, వీటిని రామాయపట్నం పోర్టుకు మళ్ళించడంతో పాటు పెట్టుబడులను సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కోయా ప్రవీణ్ వెల్లడించారు. ఈ పోర్టు మద్రాస్ హైవేకు దగ్గరగా ఉండడంతో పాటు దొనకొండ ఇండస్ట్రీయల్ క్లస్టర్, నేషనల్ ఇండస్ట్రీయల్ ఇన్వెస్టిమెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లు ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మత్స్యకారులకు తోడ్పాటు అందించేందుకు అంతర్గతంగా ఫిషింగ్ హర్బర్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దేశంలో అతిపెద్ద బ్రేక్ వాటర్ పోర్టు 3.8కి.మి విస్తీర్ణంలో తమిళనాడులోని ట్యుటికోరిన్‌లో ఉందని అయితే రామాయపట్నం పోర్టు దానికంటే ఎక్కువ 4.9 బ్రేక్ వాటర్ కలిగి ఉందన్నారు. పోర్టునిర్మాణం పూర్తి అయితే పారిశ్రామికంగా చుట్టుప్రక్కలప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పోర్టుకు జనవరి 2020లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని , 2022 నాటికి పోర్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. పోర్టు ఏర్పాటుకు సంబంధించి 3,500ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. మచిలీపట్నం పోర్టుకు ఈ నెలాఖరులోగా శంకుస్థాపనచేసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.



ప్రకాశం... ఇక ప్రగతి వికాసం

● నేడు రామాయపట్నం పోర్టుకు సీఎం శంకుస్థాపన ● 2 లక్షల మెట్రిక్ టన్నుల షిప్పింగ్ సామర్థ్యం ● 15 వేల మందికి ఉపాధి ● చేవూరులో భారీ పేపర్‌మిల్లు 18 వేల మందికి ఉపాధి: మంత్రి శిద్దా

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన రామాయపట్నం పోర్టు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర అటవీశాఖామంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. అదే విధంగా ఏషియన్ పేపర్ మిల్లుకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. మంగళవారం మంత్రి శిద్దా రాఘవరావు ఒంగోలులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణానికి కేంద్రం సహకరించకున్నా తామే అంకురార్పణ చేయను న్నామన్నారు. పోర్టు ఆధారిత అనుబంధ సేవలు, వాణిజ్య, వర్తకవ్యాపార రంగాలు ఎగుమతులు, దిగుమతులతో ప్రకాశం జిల్లా రూపురేఖలు మారనున్నా యన్నారు. జిల్లాలో విరివిగా లభించే గ్రానైట్, మిన రల్స్, జీడిపప్పు, పొగాకు వంటి వాణిజ్య పంటలు, ముడిసరుకు ఎగుమతులకు ఈ పోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒక ప్రకాశం జిల్లానే కాకుండా సరిహద్దు జిల్లాలకు కూడా పూర్తి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పోర్టు అనుబంధ పరిశ్రమలు, ఎగుమతులు, దిగుమతుల వల్ల స్థానిక ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 2లక్షల మెట్రిక్ టన్నుల షిప్పింగ్ సామర్థ్యం, పది బెర్తులు, డాక్‌యార్డ్ నిర్మాణం రామాయపట్నం పోర్టులో చేపట్టనున్నామని వెల్లడించారు. పోర్టు నిర్మాణానికి రైట్స్ సంస్థ నివేదిక ఇచ్చిందని, నాన్ మేజర్ పోర్ట్‌ను సుమారు 4,652 ఎకరాల్లో రాష్ట్రప్రభుత్వం తన సొంత నిధులతో నిర్మించనుందని తెలిపారు. 2019 డిసెంబర్ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి అవుతుందని, 2020 నుండి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. 2022లో పోర్ట్ నిర్మాణం పూర్తయి అందు బాటులోకి వస్తుందని మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడించారు. దీంతో 15 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రామాయపట్నం పోర్టుకు 3 కి.మీ. దూరంలో ఉన్న చేవూరు గ్రామంలో ఏషియన్ పేపర్ మిల్లుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తొలిదశలో రూ.27వేల కోట్లతో ఏడాదికి 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ పేపర్ మిల్లును ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్న మధ్యతరహ పరిశ్రమలకు సంబంధించి అనుమతులను మంజూరు చేశామని మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడించారు.



టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట



• శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర పోలీసులు ఆధునిక టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట వేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ కొనియాడారు. మంగళవారం గుంటూరులో పోలీసులు రూపొందించిన లాక్డ్ హౌస్ సర్వేలెన్స్ మొబైల్ యాప్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకొంటూ సీసీ కెమెరాలు, ఈ పహారా, ఎల్‌హెచ్ ఎస్‌ఎం తదితరాలతో నేరాలను అరికట్టడం అభినందనీయమన్నారు. విదేశాల్లో అతి తక్కువ మంది పోలీస్ సిబ్బంది టెక్నాలజీని వినియోగించుకుంటూ నేరాలను అదుపులో ఉంచగలుగున్నారని గుర్తు చేశారు. పోలీస్‌లు సమర్థవంతంగా విధులను నిర్వహిస్తే ప్రజలు సుఖ, శాంతులతో జీవిస్తారని, ప్రజలకు పోలీసింగ్ కనిపించాలేగానీ పోలీసులు కనిపించాల్సిన అవసరం లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలోను, ప్రజలకు రక్షణ కల్పించడంలోను కీలకపాత్రను పోషించే లాక్డ్ హౌస్ సర్వేలెన్స్ మొబైల్ యాప్‌ను రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అమలులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజీ వేణుగోపాలరావు, గుంటూరు రూరల్ ఎస్పీ రాజశేఖర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రాజధాని నివాసాల్లో సౌకర్యాలు భేష్

• ఏపీ ఎన్జీవోల హర్షం

అమరావతి, ఆంధ్రప్రభ : నిర్మాణాలు చాలా బాగున్నాయి. అమరావతిలో చాలా మంచి నివాస సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సౌకర్యాలు బాగున్నాయంటూ పలువురు ఎన్జీఓలు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి ప్రతినిధులను ప్రశంసించారు. అమరావతి రాజధాని నగరంలోని నేలపాడు దగ్గర నిర్మాణంలో ఉన్న ఎన్జీఓల నివాస సముదాయాలను ఏపీఎన్జీఓలు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఐదు బస్సుల్లో దాదాపుగా 250 మందికి పైగా తరలి వచ్చి ఎల్ అండ్ టి వారు నిర్మిస్తున్న ఎన్జీఓల నివాసాలను చూశారు. ఒక ఫ్లోర్‌లో తీర్చిదిద్దిన రెండు మోడల్ ఫ్లాట్లను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ ఫ్లాట్లను పరిశీలించిన ఎన్జీఓలు కొన్ని సూచనలు చేశారు. విజిటర్ల పుస్తకంలో తమ అభిప్రాయాలను రాశారు. నవ్యాంధ్రలో పనిచేయడం గర్వకారణమని, నివాసాల క్వాలిటీ బాగుందని ఎన్జీఓలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్జీఓల రాకతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఆ తర్వాత తుది మెరుగులు దిద్దుకుంటున్న జ్యుడీషియల్ కాంప్లెక్స్‌ను ఎన్జీఓలు చూశారు. అక్కడి నుంచి సెక్రటేరియట్ అండ్ హెచ్‌ఓడి నిర్మాణ ప్రాంతానికి వెళ్లి టవర్ల పనులను పరిశీలించారు. అదే మార్గంలో నిర్మాణంలో ఉన్న ఐఏఎస్, ఎమ్మెల్యేల నివాసాలను చూశారు. ఏపి ఎన్జీఏల సంఘం అధ్యక్షుడు పి అశోక్‌బాబు, ఏపి సెక్రటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షుడు యు మురళీకృష్ణ, ఏపి సెక్రటేరియేట్ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఎన్ సత్య సులోచన, తదితరులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ వీఆర్‌ఓల వేతనాలు పెంపు!

అమరావతి, ఆంధ్రప్రభ : రెవన్యూశాఖలో పార్ట్ టైం సహాయ గ్రామ రెవెన్యూ అధికారుల జీతం రూ.10500 నుండి రూ.15000లకు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దీనివల్ల పార్ట్ టైంగా పని చేస్తున్న దాదాపు 105మందికి లబ్ధి చేకూరనుంది. ఈఉత్తర్వుల జారీకి సహకరించిన అధికారులకు, మంత్రులకు ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

మరో మూడు రోజులు చలి ప్రభావం

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో మరో మూడు రోజులు చలి ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సముద్రం నుంచి తేమగాలులు, ఉత్తరాది నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అనేక చోట్ల మంచు కురుస్తోంది. రాష్ట్రంలో కొంతమేర చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. ఏజన్సీ ప్రాంతాల్లో ఎనిమిది నుంచి పది డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

అత్యవసర సేవలే అందిస్తాం!

• ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బకాయిలు, తమ డిమాండ్ల అంశంలో సరిగా స్పందించడం లేదని, ఈ నేపథ్యంలో అత్యవసర సేవలు తప్ప మిగిలిన సేవలను మాత్రమే కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం (ఆషా) తెలిపింది. మంగళవారం విజయవాడలో ఆషా ప్రతి నిధులు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆసుపత్రులకు నగదు చెల్లింపులు, సమస్యల పరిష్కారంలో విభిన్న ప్రకటనలతో పాటు సరైన సంప్ర దింపులు లేకపోవడంతో తాము ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆషా ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న బకాయిలకు సంబంధించి 70శాతం నిధులు విడుదల చేస్తే యధావిధిగా వైద్యసేవలన్నింటినీ కొనసాగిస్తామని తెలిపారు. ఆసుపత్రుల సమ స్యల పరిష్కారానికి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుతో పాటు వైద్య, ఆరోగ్యశాఖామంత్రి తమతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

17 నుంచి మీ సేవా కేంద్రాలు బంద్

అమరావతి, ఆంధ్రప్రభ : ఈనెల 17వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా కేంద్రాలను నిరవధికంగా మూసివేసి బంద్ పాటిస్తున్నట్లు రాష్ట్ర మీ సేవా కేంద్రా ల యూనియన్ అధ్యక్షుడు శ్రీవాత్సవ, గౌరవ అధ్యక్షుడు అంజన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని చెప్పారు. కనీస వేతన చట్టం కూడా అమలు చేయని దుస్థితి నెలకొందన్నారు. చాలీచాలని కమీషన్లతో బండెడు చాకిరీ చేస్తున్నప్పటికీ కుటుంబ పోషణ కష్టంగా మారిందని, ఈ పరిస్థితుల్లో తమ ఆందోళనతోనైనా రాష్ట్రప్రభుత్వం కళ్లు తెరచి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

రక్షణశాఖతో బీడీఎల్ భారీ ఒప్పందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బిడిఎల్) రక్షణశాఖతో భారీ ఒప్పందం చేసుకుంది. రూ. 760 కోట్ల విలువైన ఆర్మీ సంబంధిత యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్(ఏటీజీఎం), లాంచర్లను సరఫరా చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ మేరకు మంగళవారం నాడు బీడీఎల్ ప్రొడక్షన్ డైరెక్టర్ వి గురుదత్త ప్రసాద్ సంతకం చేశారు. రష్యాతో కలిసి సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన పరికరాలను హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బీడీఎల్‌నుంచి తయారుచేయనుంది.

కోటిపల్లి - నర్సాపూర్ రైల్వే లైన్ పనులు వేగవంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కోటిపల్లి - నర్సాపూర్ మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రైలులైను అమలాపురం, పేరూరు, పాశర్లపూడి, జగ్గన్నపేట, రాజోలు ప్రాంతాలను కలుపుతూ నర్సాపూర్ వెళ్తుంది. మొత్తం రూ.2,120 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ నిధుల్లో ఇప్పటి వరకు 2014 -19 మధ్య కాలంలో రూ. 323 కోట్లు వ్యయం చేశారు. మొత్తం మూడు దశల్లో ఈ రైల్వేలైను ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. మొదటి దశలో నర్సాపూర్ - చించినాడ (పది కిలో మీటర్లు), రెండవ దశలో కోటిపల్లి - అమలాపురం (12.70 కిలోమీటర్లు), మూడవ దశలో అమలాపురం - చించినాడ (33.88 కిలోమీటర్లు) పనులను పూర్తి చేస్తారు. ఈ మార్గంలో గౌతమీ, వైనతేయ, వశిష్ట నదులపై మూడు రైల్వే వంతెనలను నిర్మించనున్నారు. రైల్వే లైను నిర్మాణానికి అవసరమైన 908 ఎకరాల భూమిలో తూర్పు గోదావరి జిల్లా నుంచి 791 ఎకరాలు, పశ్చిమ గోదావరి నుంచి 118 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో 276 ఎకరాలను సేకరించడం జరిగింది.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోండి

• ప్రధాన ఎన్నికల అధికారి ఆర్‌పీ సిసోడియా

పార్వతీపురం, (విజయనగరం), ప్రభ న్యూస్ : ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆర్‌పీ సిసోడియా కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీపురం మండలంలోని బబ్బిడి, చినవంకధార, టంకు, రసాబడి, ఎస్.సి.గోయపాక గిరిజన గ్రామాల సభలలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఓటుహక్కు విలువ పట్ల అవగాహన కల్పించడానికి గిరిజన గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఓటు వుందా, కొత్తగా నమోదు ఏమైనా చేయించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎంఆర్‌ఓ, విఆర్‌ఓ, బిఎల్‌ఓ సమక్షంలో పోలింగ్ బూత్ సంబంధించిన జాబితా తెప్పించి పరిశీలించారు. ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అపోహలు పోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అన్నింటిని తనిఖీ చేసి పింక్ పేరుతో సీల్ చేయడం జరుగుతుందని ఎటువంటి అపోహలకు తావు లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఓటుహక్కు కలిగియుండాలని, వలసలు వెళ్లేవారి, మరణించినవారి ఓటరు జాబితాలో పేర్లు తొలగించి శతశాతం పగడ్బందీగా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఓటు ఓటర్ల జాబితాలో వున్నది లేనిది తనిఖీ చేసుకోవాలని, ఎటువంటి తప్పు ముద్రించబడినచో మార్పులు చేర్పులు చేయించుకోవాలన్నారు. అనంతరం ఎస్.సి.గోయిపాకలో ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో మనల్ని మనమే పరిపాలించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని ఓటు వినియోగించుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్క పౌరునిపై వుందన్నారు. ఓటు వున్నంతమాత్రం కాదు ఓటును వినియోగించుకోవాలన్నారు. గతంలో మనం ఓటు వేసి ఎన్నుకున్న ప్రతినిధి మన ఊరికి ఏమిచేసారు చూసి ఓటు వేయాలన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని ఎన్నికలను విజయవంతం చేయాలని అధికారులను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతీ గ్రామంలో జట్టు ట్రస్టు కళాకారులు ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై పాటలు పాడి గిరినులను చైతన్యపర్చారు. గోయిపాకలో నృత్య నాటిక ప్రదర్శించారు. అనంతరం కురుపాం మండలం దుర్బిలి, మంత్రిజ్యోల వద్ద జట్టు సంస్థ ట్రస్టు చిరుధాన్యాల ప్రోసెసింగ్ యూనిట్ బ్యాకరి ఉత్పత్తులను తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమానికిఐటిడిఎ పిఓ డా.జి.లక్ష్మీశ, పార్వతీపురం సబ్ కలెక్టర్ టి.ఎస్.చేతన్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస తహశీల్దార్లు, జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టి డా.డి.పారినాయుడు, రెవిన్యూ సిబ్బంది, గిరిజన ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.



బ్రేకువీరుని పాదయాత్ర

మంత్రి ఆదినారాయణరెడ్డి ఎద్దేవా



అమరావతి, ఆంధ్రప్రభ : అవినీతిలో జగన్ చక్రవర్తి అని, ఆటువంటి జగన్ తన రాజీనామాను కోరే హక్కులేదని రాష్ట్రమార్కెటింగ్, గిడ్డంగులశాఖా మంత్రి సీహెచ్ ఆదినారాయణ రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తండ్రి రాజా ఆఫ్ కరప్షన్ అయితే కుమారుడు జగన్ అవినీతి చక్రవర్తి అన్నారు. చంద్రబాబు ఉనికిని దెబ్బకొట్టాలని మోడీ చూస్తుంటే దానికి జగన్, కేసీఆర్ మద్దతు పలకడం శోచనీయమన్నారు. హైదరాబాద్, బెంగుళూరులో భవనాలు ఎక్కడి నుండి ఎలా వచ్చాయో జగన్ చెప్పాలన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకున్న సొమ్మునే జగన్ సంస్థల నుండి ఈడీ జప్తుచేసిందన్నారు. చంద్రబాబు తెలంగాణలో ధైర్యంగా పోరాటం చేశారని, కానీ జగన్ అక్కడ ఒక్క స్థానంలో కూడా పోటీ చేయలేదన్నారు. కేసీఆర్‌తో చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. జయప్రకాష్ నారాయణ కూడా కేంద్రం ఇవ్వాల్సిన నిధుల లెక్కలు ప్రకటించారన్నారు. మోడీ మోసం చేసినా, నిధులు ఇవ్వకపోయినా విమర్శించలేదన్నారు. ప్రతిపక్షనేత పాత్ర కూడా పోషించేపరిస్థితిలో జగన్ లేడన్నారు. వైసీపీని ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పామన్నారు. అందువల్ల జగన్ తన రాజీనామాను అడిగే అర్హత లేదన్నారు. పాదయాత్రలు చాలా మంది చేశారని, కానీ ఇటువంటి బ్రేక్‌లతో పాదయాత్రలు చేసినవారు ఎవరూ లేరన్నారు.

కోడికత్తి విషయంలో అందరికీ దండం పెట్టుకుంటూ వెళ్లి గవర్నర్‌కు మాపై ఫిర్యాదు చేశారని చెప్పారు. జాతీయ దర్యాప్తు సంస్థకు కేసు ఇవ్వడం తమకు అభ్యంతరం లేదన్నారు. ఇచ్చిన విధానాన్ని మాత్రమే తాము తప్పుబడుతున్నామన్నారు. అజయ్ కల్లాం ఆరోపణల్లో నిజం ఉంటే స్వాగతిస్తామని, లేకుంటే వ్యతిరేకిస్తామని చెప్పారు. తోడు రావాల్సిన బీజేపీ తోడేలుగా మారడం వల్ల టీడీపీ దూరమైందన్నారు. జగన్ కేసుల నుండి తప్పుకునేందుకు బీజేపీతో తిరుగుతున్నాడని ఆరోపించారు.

మహిళలకు స్వీయ రక్షణ విద్యలో శిక్షణ



• ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రణబ్ ముఖర్జీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు పెరిగిపోతున్న తరుణంలో వారిలో చైతన్యాన్ని పెంపొందించేందుకు చాణక్య ఫౌండేషన్ చర్యలు చేపడుతోంది. నానాటికీ పెరుగుతున్న నేరాల నియంత్రణకు, స్వీయ రక్షణ విద్యల్లో ఆడవారిని సుశిక్షితులను చేయడానికి జాతీయ స్థాయిలో ఉద్యమిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను మంగళవారం మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఢిల్లీకి చెందిన చాణక్య ఫౌండేషన్ నేషనల్ ఫుట్ ప్రింట్స్ సంస్థ ద్వారా దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో పాటు వివిధ సంస్థలలో అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు సంకల్పించింది. అండమాన్ నుంచి అమరావతి వరకు... ఇలా దేశవ్యాప్తంగా ఏ ప్రాంతాన్నీ వదలకుండా అన్ని చోట్ల మహిళలకు కరాటే వంటి స్వీయ రక్షణ విద్యల్లో శిక్షణ ఇప్పించబోతున్నట్టు చాణక్య ఫౌండేషన్ ఛైర్మన్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

దివ్యాంగులపై సీఎం సహృద్భావం



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ఓపెన్ కేటగిరీలో కూడా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎం. రవిశంకర్ మంగళవారం సచివాలయంలో ఒక ప్రకటనను విడుదల చేస్తూ ఈ పోస్టుల భర్తీలో ఓపెన్ కేటగిరీలో పై వర్గాలకు చెందిన అభ్యర్థులకు అవకాశాలు లేకుండా ఈనెల 5న జారీ చేసిన జీవో నెం 5లోని 15వ నిబంధన అడ్డంకిగా మారిందని తెలిపారు. దీనివల్ల జరిగే నష్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించగా ఆ నిబంధనను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారని, అందుకు ముఖ్యమంత్రికి తమ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

గొల్లుమంటున్న మిర్చి రైతులు!

• చైనా ఆంక్షలతో వియత్నాం పోర్టులోనే నిల్వలు • లారీకి రోజుకు 100 డాలర్ల సుంకం • రూ. 25 కోట్ల నష్టం



అమరావతి, ఆంధ్రప్రభ : మిర్చి ధరలపై చైనా ప్రభావం చూపింది. రాష్ట్రం నుండి చైనాకు ఎగుమతయ్యే మిర్చి వియత్నాం పోర్టులో నిలచిపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి వ్యాపారులకు రూ. 25 కోట్ల కు పైగా నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్‌లో గుంటూరు మిర్చికి గిరాకీ ఉంది. పొరుగున ఉన్న చైనా దేశం రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున మిర్చి దిగుమతి చేసుకుంటుంది. ఐతే భారత్ దిగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో వ్యాపారులు వియత్నాం నుండి చైనాకు మిర్చి ఎగుమతి చేస్తున్నారు. నేరుగా చైనాకు మిర్చిని విక్రయిస్తే 21 శాతం మేర దిగుమతి సుంఖం చెల్లించాల్సి ఉంది. దీంతో వ్యాపారులు వియత్నాం నుండి చైనాకు ఎగుమతి చేస్తున్నారు. వియత్నాం నుండి వచ్చే ఎగుమతులకు చైనాలో పన్ను మినాహాయింపు ఉండటంతో వ్యాపారులు వియత్నాం ద్వారా మిర్చి ఎగుమతి చేస్తున్నారు. గుంటూరు నుండి చెన్నై పోర్టు ద్వారా వియత్నాంకు మిర్చిని రవాణా చేస్తున్నారు. ఐతే, వియత్నాం నుండి మిర్చి ఎగుమతి చేసే వ్యాపారి బస్తాల్లో బీఫ్ అక్రమ రవాణా చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలతో అరెస్టుచేసి జైలుకు పంపారు. దీంతో రాష్ట్రం నుండి కొనుగోలు చేసిన సుమారు 500 లారీల సరుకు వియాత్నాం పోర్టులో నిలచిపోయాయి. అంతేకాకుండా మరో 250 లారీల మిర్చి రాష్ట్రంలో రవాణా కాకుండా ఆగిపోయింది.

చైనాకు గత ఏడాది అక్టోబరు నెలలో ఎగుమతి చేసిన సమయంలో నాణ్యమైన తేజ రకం క్వింటా ఒక్కింటికి రూ. 11,500 నుండి రూ. 12 వేల వరకూ ధర పలికింది. ఐతే, చైనాకు లావాదేవీలు నిలచిపోవడంతో ధర క్వింటాకు రూ. 2 వేలు వంతున పతనమైంది. సుమారు 15 వేల టన్నుల మిర్చి వివిధ స్థాయిల్లో నిలచిపోవడంతో ధరల పతనంతోపాటు మిర్చి నాణ్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉన్నట్లు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వియత్నాం పోర్టులో లారీకి రోజుకు 100 యూఎస్ డాలర్ల వంతున గత రెండు నెలలుగా డెమరేజ్ చెల్లించడం వ్యాపారులపై అదనపు భారం పడింది. దీంతో పలు రకాలుగా వ్యాపారులకు సుమారు రూ. 25 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా చైనా మార్కెట్లలో 15 రోజులపాటు లావాదేవీలు జరిగే అవకాశం లేకపోవడంతో జనవరి నెలాఖరుకు సమస్య కొలిక్కి వచ్చే అవకాశముందని వ్యాపారులు ఆశిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవచూపి సమస్యను పరిష్కరించాలని మిర్చి ఎగుమతిదారులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబే మళ్లీ సీఎం కావాలి

• మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి



తిరుపతి, ప్రభన్యూస్ : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు తిరిగి సీఎంగా కావాలని ఇందుకోసం తాము కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణించనున్నామని తమకు తోడుగా పవన్ కల్యాణ్ కలిసొస్తే మంచిదని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగన్ తన ధోరణి మార్చుకోవాలని, అప్రజాస్వామికంగా వైకాపా నేతలను రెచ్చగొట్టి జన్మభూమి సభల్లో దాడులకు, గొడవలకు ఉసిగొల్పడం మంచిది కాదని, వీలైతే రాష్ట్ర అభివృద్ధికోసం జగన్ తమతో కలిసొస్తే మంచిదని మంత్రి హితవు పలికారు. చట్ట సభలకు హాజరుకాని వైకాపా ఎమ్మెల్యేలు నేడు జన్మభూమి సభల్లో మాత్రం తామేదో ప్రజల్ని ఉద్ధరించినట్లు మాట్లాడటం దారుణంగా వుందని, పైగా పలు సభలను అడ్డుకుంటూ దౌర్జన్యాలకు దిగడం ప్రజల్ని బాధించడమేనని అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం రానున్న రోజుల్లో అభివృద్ధి చెందాలంటే మరో పది సంవత్సరాలు చంద్రబాబునాయుడే సీఎంగా ఉండాలని అదే జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అస్తవ్యస్తంగా, అల్లకల్లోలమై అవినీతి, అరాచకాలతో నిండిపోతుందని మంత్రి పేర్కొన్నారు. జగన్ దౌర్జన్యాలను, దోపిడీ విధానాలను అడ్డుకోవాలని, రాష్ట్ర అభివృద్ధి కోసమే టీడీపీ కాంగ్రెస్‌తో జతకట్టిందని, అదేవిధంగా జనసేన నేత పవన్‌కల్యాణ్ కూడా తమతో కలిసి రావాలన్న సీఎం చంద్రబాబునాయుడు మాటలను మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఓట్లు చీలడం ద్వారా జగన్ లబ్ధి పొందుతాడని, తద్వారా రాష్ట్రఅభివృద్ధి కుంటుపడుతుందని, జగన్, కేసీఆర్‌లు బీజేపీ ఏజెంట్లని పవన్‌కల్యాణ్ ఈ విషయాన్ని ఇకనైనా గ్రహించి చంద్రబాబుతో చేయి కలపాలని మంత్రి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జగన్ కోడికత్తి కేసు విషయంలో అనవసరపు రాద్ధాంతం చేయడం వ్యర్థమని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, డిసిసిబి ఛైర్మన్ అమాసరాజశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు శ్రీధర్‌వర్మ, పుష్పావతి, నీలం బాలాజీ, వూకా విజయ్‌కుమార్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

నాన్నగారి పాత్రలో నటించడం ఆనందంగా ఉంది

• సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ



తిరుమల, ప్రభ న్యూస్ : కథానాయకుడు చిత్రంలో నాన్నగారి పాత్రలో తాను నటించడం చాలా ఆనందంగా ఉందని సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఉదయం ఆ చిత్రబృందంతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ నాన్న గారు సీఎంగా మొదటిసారి జనవరి 9న ప్రమాణస్వీకారం చేశారన్నారు. ఎన్‌టిఆర్ జీవితంలో చాలామందికి కనిపించని కోణాలు ఈ చిత్రంలో ఉన్నాయని, మహానాయకుడు 2.50 గంటలు ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7 విడుదలకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించాలని స్వామివారిని ప్రార్థించానని తెలిపారు. ఆయనతో పాటు చిత్రంలో నటించిన నటుడు సుమంత్, నటి విద్యాబాలన్ ఇతర నటులు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఏలేరు భూ పరిహారం కుంభకోణంపై మళ్లీ విచారణ జరపండి

• చోడవరం, అనకాపల్లి కోర్టులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏలేరు భూ నష్ట పరిహారం చెల్లింపు వ్యవహారంలో జరిగిన కుంభకోణం పై మళ్లీ విచారణ జరపాలని విశాఖపట్నం జిల్లాలోని చోడవరం మరియు అనకాపల్లి సీనియర్ కోర్టులను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో ఫిర్యాదుదారులుగా వ్యవహరించాలని, ఇందుకు సంబంధించిన ఫిర్యాదులను విచారణాధికార పరిధి గల ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు దాఖలు చేయాలని హైకోర్టు చోడవరం, అనకాపల్లి కోర్టులకు స్పష్టం చేసింది. దీనికి ముందు గా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను రప్పించి సీఆర్ పీసీ లోని సెక్షన్ 340 ప్రకారం ముందస్తు విచారణ చేపట్టాలని ఆ కోర్టులను ఆదేశించింది. దీనిపై దర్యాప్తు కొనసాగించవచ్చున్ని హైకోర్టు సీబీసీఐడీకి స్పష్టం చేసింది. పిసినికాడ, యలమంచిలి, వైజాగ్ స్టీల్ ప్లాంటు మరియు ఏలేరు భూసేకరణలకు సంబంధించిన చెక్కుల దరఖాస్తులపై కేసులను తిరిగి ప్రారంభించాలని (రీఓపెన్) హైకోర్టు కింది కోర్టులకు తేల్చిచెప్పింది. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎస్ వి.భట్, జస్టిస్ ఎం.సీతారామమూర్తిలతో కూడిన త్రిసభ్య డివిజన్ బెంచ్ విభజనకు ముందు ఈ మేరకు తీర్పును వెల్లడించింది. ఈ వ్యవహారంపై గత 22 సంవత్సరాల నుంచి హైకోర్టు న్యాయమూర్తితో పాటు సీఐడీ పలు మార్లు దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్. రాధాకృష్ణన్ ఇందు కోసం ఫుల్ బెంచ్ ను ఏర్పాటు చేశారు. తూర్పు గోదావరి జిల్లా, ధవలేశ్వరం సమీపంలోని ఏలేరు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు నీరు సరఫరా చేసేందుకు కాలువ నిర్మాణం నిమిత్తం ఏపీ ప్రభుత్వం 1980లో భూసేకరణ చేపట్టింది. చాలా కాలం తర్వాత రైతులకు పరిహారం చెల్లించింది. ఆ సమయంలోనే అనకాపల్లి మరియు చోడవరం సబ్ కోర్టుల్లో పలు వ్యాజ్యాలు ధాఖలయ్యాయి. ఈ వ్యవహారంలో సబ్ జడ్జి పి.స్వామి, స్థానిక న్యాయవాది పీలా పోతినాయుడు కుమ్మక్కై నేరపూరిత కుట్ర కు పాల్పడ్డారు. దీంతో పెద్ద మొత్తంలో నష్టపరిహారం రైతులకు చెల్లించాలంటూ సబ్ జడ్జి తీర్పులు ఇచ్చారు..సబ్ జడ్జి ఆదేశాలను అమలు చేయాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో సొమ్మును కోర్టులో జమ చేసింది. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో ప్రజా ధనం దుర్వినియోగానికి గురైంది. ప్రతిపక్షాల ఒత్తిడి మేరకు ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపేందుకు జస్టిస్ బీకే.సోమశేఖర కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం ఆ సబ్ జడ్జి అరెస్ట్ అయ్యారు. విధులను నుంచి కూడా తొలగించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ న్యాయవాది కోర్టులో నిశ్శబ్దంగా ఉన్నంత వరకు న్యాయమూర్తి కూడా ఏం చేయలేని పరిస్థితి. ఈ కేసులో పలువురు ఐఏఎస్ అధికారులు, రెవెన్యూ, నీటిపారుదల, ట్రెజరీ అధికారులు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

సంక్రాంతి సంబరానికి...
పందెం కోళ్లు రెడీ



అమరావతి, ఆంధ్రప్రభ : 'అడ్డుకొని తీరతామంటూ పోలీసులు.. ఆడి తీరతామంటూ నిర్వాహకులు' ఏటా సంక్రాంతి కోడి పందేల నిర్వహణలో జరిగే సాధారణ తంతు. హైకోర్టు ఆదేశాల పేరిట పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేయడం.. నిర్వాహకులు సుప్రీం తలుపు తట్టి స్టే తేవడం తరుచూ జరుగుతూనే ఉంటోంది. ఎటొచ్చి ఈ ఏడాది ఎన్నికలు రావడంతో నిర్వాహకులు కోడి పందేల కట్టడి ఉండబోదనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు వీరికి తగిన భరోసా కూడా ఇచ్చినట్లు తెలిసింది. సంక్రాంతికి వారం రోజులే ఉండటంతో ఏర్పాట్లపై నిర్వాహకులు బిజీబిజీగా ఉన్నారు. ఉన్నత స్థాయి భరోసా నేపథ్యంలో సంక్రాంతి కోడి పందేలకు పెట్టింది పేరైన పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే 100 నుంచి 150 వరకు భారీ నుంచి ఓ మోస్తరు బరులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని నిర్వాహకులు కూడా మామిడి తోటలు, ఖాళీ మైదానాల్లో ప్రత్యేక 'బరులు' చేస్తున్నారు. సంక్రాంతి వచ్చిందంటే కోస్తా జిల్లాల్లో కోడి పందేలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది. మరీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పరిసర ప్రాంతాల్లో జరిగే కోడి పందేలను తిలకించేందుకు సినీతారలు, తెలంగాణా, మహారాష్ట్రకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, విదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు వస్తుంటారు. ఈ ఏడాది జరిగే కోడి పందేలు తిలకించేందుకు పేరొందిన సినీతారలే కాకుండా ఇప్పుడిప్పుడే పరిశ్రమలో నిలదొక్కుకుంటున్న వర్థమాన తారలు కూడా ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. పందేలను చూసేందుకు వచ్చే సందర్శకులతో భీమవరం పరిసర ప్రాంతాలు కిటకిటలాడుతుంటాయి. ఇక్కడి హోటల్స్, లాడ్జీలు రెండు నెలల ముందుగానే రూములు బుక్ చేసుకుంటారు. సాధారణ రోజుల్లో రూ.2వేలు రోజు వారీ అద్దెగా ఉంటే గదులు, సంక్రాంతి రోజుల్లో రూ.5వేల వరకు ఉంటాయి. గతేడాది కోడి పందేల రూపంలో రూ.500 కోట్లు చేతులు మారినట్లు అనధికారిక వర్గాల అంచనా. ఈ ఏడాది ఇది రెట్టింపు అయ్యే అవకాశం ఉండొచ్చని చెపుతున్నారు. గతేడాది పోలీసులు కోడి పందేలను నిలువరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హైకోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని కోడి పందేల నిర్వాహకులు, కోళ్లకు కత్తులు కట్టే వారిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1800కు పైగా కేసులు నమోదు చేయగా.. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఏడొందల వరకు కేసులు నమోదు చేశారు. ఆఖరిలో అప్పటి బీజేపీ నేత రఘురామ కృష్ణంరాజు సుప్రీం కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో పందేలు యధావిధిగా సాగాయి. కోడి పందేలు జరిగిన తీరుపై హైకోర్టు ఆగ్రహించడంతో డీజీపీ మాలకొండయ్య కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. కోడి పందేలపై ఉక్కుపాదం మోపనున్నట్లు గత డిసెంబర్‌లోనే పోలీసులు హెచ్చరించారు. అయితే ఆ దిశగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కోడి పందేల విషయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరించాలంటూ ప్రజాప్రతినిధులు ఇప్పటికే పోలీసులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి సఫలీకృతం అయినట్లు చెపుతున్నారు. ఈ క్రమంలోనే కోడి పందేల నిర్వహణకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోడి పందేలు నిర్వహించే ప్రాంతాల్లో గుండాట, కోత ముక్కలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. మూడు రోజుల పాటు వీటిని నిర్వహించేందుకు రూ.లక్షలు పెట్టి హక్కులు సొంతం చేసుకుంటారు. కోడి పందేలు నిర్వహించే బరులకు సమీపంలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. గతేడాది అనధికారిక మద్యం అమ్మకాలను నిలువరించాలంటూ ఎక్సైజు కమిషనర్ డాక్టర్ లక్ష్మీనరసింహం అధికారులను ఆదేశించారు. దీంతో కొన్ని చోట్ల గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయాలు సాగినప్పటికీ.. అంతకు ముందు ఏళ్లతో పోల్చితే తక్కువేనని చెప్పొచు. అయితే ఈసారి చేపట్టనున్న చర్యలపై ఇప్పటి వరకు ఎక్సైజు అధికారులకు ఏ విధమైన ఆదేశాలు అందలేదు. ఈసారి అడ్డంకులు ఉండబోవని నిర్వాహకులు ఇస్తున్న భరోసాతో పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి అమ్మకాలను సొంతం చేసుకునే ప్రయత్నాల్లో మద్యం వ్యాపారులు ఉన్నారు. ఏదేమైనా ఈ ఏడాది కోడి పందేల నిర్వాహణకు ఏ విధమైన అడ్డంకులు ఉండవనే ధీమాతో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కోడి పందేల నిర్వాహణపై పోలీసు శాఖ హైకోర్టు ఆదేశాలపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

22న దావోస్ సదస్సుకు చంద్రబాబు బృందం

అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్రంలోని పారిశ్రామిక పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడుతోపాటు మరో 10 మంది సభ్యుల బృందం ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి బయల్దేరి 'దావోస్' పర్యటనకు వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఈ బృందంలో సభ్యులుగా రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు, మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ఆర్టీజీఎస్ సీఈఓ అహ్మద్‌బాబు, ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు మరో ఇద్దరితోపాటు మొత్తం పదిమంది సభ్యులు దావోస్‌లో ఈనెల 22 నుండి జరిగే పారిశ్రామిక పెట్టుబడల సదస్సులో పాల్గొననున్నారు. చంద్రబాబునాయుడు బృందం తిరిగి 25వ తేదీ అర్థరాత్రికి గన్నవరం విమానాశ్రాయానికి చేరుకుంటారు. 26న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే గణతంత్ర దినోత్సవ రాష్ట్రస్థాయి ఉత్సవాలలో గవర్నర్‌తోపాటు కలిసి పాల్గొంటారు.

మోడీకి సుప్రీం పాఠం

- ఆర్థిక మంత్రి యనమల



అమరావతి, ఆంధ్రప్రభ : దేశంలోని కేంద్ర విచారణ సంస్థ (సీబీఐ) కార్యకలాపాల్లో బీజేపీ నేతల అతి జోక్యానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసిందని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూసేవారికి తగిన గుణపాఠం ఉంటుందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తమ స్వార్థ ప్రయోజనాలకు సీబీఐ సంస్థను వాడుకోవాలని ప్రయత్నించిన ప్రధాని నరేంద్రమోడీకి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టువంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం మంత్రి తన కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో కేంద్రంపై మండిపడ్డారు. మోడీ పాలనలో ఆర్‌బీఐ, సీబీఐ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశారని, ఈడీ, ఐటీ దర్యాప్తు సంస్థలను తమ సొంతానికి వాడుకున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగ సంస్థల అధికారాలను కాలరాయాలని ప్రయత్నిస్తూ, బీజేపీ పెడ ధోరణులకు సుప్రీం తీర్పు కొరడా దెబ్బలాంటిదన్నారు. వ్యక్తిగత గోపత్య హక్కుకు భంగం కలిగించాలని చూశారని, కంప్యూటర్లలో సమాచారాన్ని చూసేందుకు 10 సంస్థలకు అధికారం ఇచ్చారని, పౌరుల వ్యక్తిగతీ స్వేచ్ఛ హరించాలని ప్రయత్నిస్తే, రాజ్యంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే భారత న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోదన్నారు. పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ప్రాథమికంగా ప్రతీ ఒక్కరూ స్వాగతిస్తారని, ఆప్రక్రియలో భాగంగా అడ్డంకుల కల్పనపైనే అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈబీసీల రిజర్వేషన్ల వెనుక బీజేపీ చిత్తశుద్ది ప్రశ్నార్థకమని, ప్రాథమికంగానే బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, కులపర, మతపర రిజర్వేషన్లను గతంలో వ్యతిరేకించిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. రాఫెల్ కుంభకోణం నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈబీసీ రిజర్వేషన్లను తెరమీదికి తెస్తున్నారన్నారు.

అవినీతికి అంబాసిడర్‌గా జగన్

- ఆయన అఫిడవిట్‌లోనే 76 పేజీల్లో ఉంది
- 5 ఏళ్లలో 775 రెట్లు సంపాదన ఎలా సాధ్యం?
- క్రిమినల్‌మైండ్ రాజకీయాలకు సరికాదు
- ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, ప్రభన్యూస్: క్రిమినల్ మనస్తత్వం ఉన్న వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి అవినీతికి అంబాసిడర్ అని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఆయన స్వయంగా దాఖలు చేసిన అఫిడవిట్ అందరికీ భిన్నంగా 78 పేజీలు కలిగి ఉండగా, అందులో 76 పేజీల్లో స్వయంగా ఆయనే తాను ఏఏ కేసుల్లో నేరస్తునిగా ఉన్నారో., వాటి స్టేటస్ ఏమిటో స్వయంగా ప్రకటించుకున్నారని ఆయన ప్రకటించారు. సంబంధిత అఫిడవిట్‌ను కూడా ఆయన మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన జగన్‌మోహన్ రెడ్డిపై ధ్వజమెత్తారు. స్వయంగా అవినీతిమయ జీవితం కలిగి, తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న అయిదేళ్ల కాలంలోనే తన ఆస్థిపాస్తులు 775 రెట్లు ఎలా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. 2003-4 కాలంలో రూ.9,19,951లు ఆదాయపు పన్నుగా చెల్లించినట్లుగా ఆయనే దాఖలు చేసిన అఫిడవిట్ చెబుతుందన్నారు. 2004లో జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అయ్యాక అక్కడి నుంచి ఆయన ఆస్తులు 775 రెట్లు పెరిగినట్లుగా చూపుతున్న వైనం ఎలా సాధ్యం అయ్యిందని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి చేసిన పాదయాత్రలో ఏం సాధించారని, మంత్రి గంటా ప్రశ్నించారు. విశాఖ పాదయాత్రలో ఇక్కడి ప్రధాన సమస్య అయిన ప్రత్యేక రైల్వే జోన్ అంశం ఎందుకు జగన్ ప్రస్తావించలేకపోయారని, మోడీని ఎందుకు విమర్శించలేకపోయారని అడిగారు. రైల్వే జోన్ గురించి కానీ, రాఫెల్ కుంభకోణం గురించి కానీ, కొత్త రాష్ట్రం అభివృద్ధికి నిధులివ్వని కేంద్రం తీరుని ఏరోజూ ప్రశ్నించలేకపోయిన జగన్ ఈ రాష్ట్ర ప్రజలకు ఏం చేద్దామని పాదయాత్ర అని చెప్పారు. 2017 నవంబరు ఆరోతేదీన ప్రారంభించి గొప్పగా జనవరి తొమ్మిదో తేదీన పూర్తి చేస్తానని చెబుతున్న జగన్ 3,648 కిలోమీటర్లును, 341 రోజుల్లో నడిచానని చెబుతున్నారని, ఇందులో 47 శుక్రవారాలు కోర్టులు చుట్టూ తిరిగారని, కోడి కత్తి కేసు పేరుతో మరో రెండు శుక్రవారాలను కోర్టుకు వెళ్లకుండ దాటవేసారని ఎద్దేవా చేశారు. కొత్త రాజధాని నిర్మాణానికి రూ.15 వందల కోట్లు ఇచ్చిన ప్రదాని పటేల్ విగ్రహానికి రూ.3,000 కోట్లను ఇచ్చిన మోడీ వైఖరిని కనీసం ప్రశ్నించని క్షమించరాని రాజకీయ నాయకుడని జగన్‌ను ఆయన విమర్శించారు. ఏపీ అభివృద్ధి జగన్‌కు నచ్చదని, అభివృద్ధి చేస్తున్న చంద్రబాబు నాయుడు నచ్చరని, కేవలం తనకు అవసరమైన సీఎం సీట్‌కు అవసరమయ్యే మోడీ, ఇతరులు మాత్రమే అవినీతికి అంబాసిడర్ జగన్మోహన్ రెడ్డికి కావాల్సిన వారన్నారు. ఇదే సమావేశంలో పార్టీ విశాఖ అర్బన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ ఇతర నాయకులు స్వాతి కృష్ణారెడ్డి, కాశీవిశ్వనాథం బొడ్డేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో స్నేహంగా మెలగండి

- ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: బస్సులను తనిఖీ చేసే సమయాల్లో చెకింగ్ అధికారులు సంయమనం పాటిస్తూ, ప్రయాణికులతో స్నేహపూర్వక వాతవరణంలో సంభాషించాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ ఎన్.వి. సురేంద్ర బాబు సూచించారు. తనిఖీ సమయంలో తాము అధికారులమని పరిచయం చేసుకుని ప్రయాణికుల సహకారాన్ని తీసుకుని చెకింగ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని ఆర్టీసీ జోనల్ శిక్షణా కళాశాలలో బస్సు చెకింగ్ అధికారులకు, ఫాటల్ యాక్సిడెంట్లు చేసిన డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో సురేంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ తరగతుల్లో పాల్గొన్న 74 మంది తనిఖీ అధికారుల నుండి, డ్రైవర్లనుండి ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గుర్వ్యేటానికి గల కారణాలపై ఆరా తీశారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాల పట్ల తాను కఠినంగానే కాక నిర్మొహమాటంగా వ్యవహరిస్తానని సురేంద్ర బాబు హెచ్చరించారు.

వచ్చే ఎన్నికల్లో జనసేనతో పొత్తు!

- సీపీఎం కార్యదర్శి మధు

అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలకు ధీటుగా ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ ఏర్పడాలని గత కొద్ది కాలంలో వామ పక్షాలు చేస్తున్న కృషి ఫలించనున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు అన్నారు. మంగళవారం సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి విజయవాడలో 'జనసేన' అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసిన అనంతరం మధు విలేకరలతో మాట్లాడారు. వర్తమాన రాజకీయాలు విలువలు కొల్పోయిన స్థితిలో ప్రజా హితాన్ని కాంక్షించే ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసే విషయంలో జనసేన, వామపక్ష పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్న నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు మధు తెలిపారు. సీపీఎం, సీపీఐలు జనసేనతో పొత్తు పెట్టుకోనున్న నేపథ్యంలో రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో బలమైన రాజకీయ కూటమి ఆవిర్భవించనున్నదని మధు తెలిపారు. ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ ఏర్పాటు విషయంలో తమ అభిప్రాయాలను విన్న పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించి వామపక్షాలతో పొత్తుకు సంబంధించి త్వరలోనే ఒక ప్రకటన విడుదల చేస్తామని చెప్పారని మధు వివరించారు. సంక్రాంతి పండుగ తరువాత మరోసారి పవన్ కల్యాణ్‌తో సీపీఎం, సీపీఐ నేతలు సమావేశమవుతారని, అ వెంటనే భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని మధు తెలిపారు.



ఫిబ్రవరిలో పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా

- 'ఆశా' ప్రతినిధులకు మంత్రి ఫరూక్ హామీ

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ప్రైవేటు వైద్యశాలకు ఎన్టీఆర్ వైద్యసేవలకు సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల విడుదలపై ముఖ్యమంత్రితో చర్చించి మంగళవారం ఒక నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ ఆశా ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈమేరకు సోమవారం మంత్రిని కలిసిన ఆశా ప్రతినిధుల ప్రతినిధులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.300 కోట్లలో తొలివిడతగా 50శాతం బకాయిలను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేస్తామని, అలాగే ఉద్యోగుల హెల్త్ స్కీం చెల్లింపులను ప్రతినెలా చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. జన్మభూమి కార్యక్రమం ముగిసిన వెంటనే మిగిలిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వారికి తెలిపారు. దీనిపై స్పందించిన ఆశా ప్రతినిధులు మంగళవారం జరిగే తమ అంతర్గత సమావేశంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖ సహా ఆరు జిల్లాల్లో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- రాజ్యసభలో ఆరోగ్య మంత్రి జవాబు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల ఉమ్మడి ఆరోగ్య సూచిక ప్రాతిపదిక ప్రకారం విశాఖపట్నంతో పాటు విజయనగరం, కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ప్రజారోగ్యం మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నట్లుగా జాతీయ ఆరోగ్య మిషన్ అధ్యయనంలో తేలిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా మంగళవారం రాజ్య సభలో వెల్లడించారు. వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ ఆరు జిల్లాలను అత్యంత ప్రాధాన్యత జిల్లాలుగా గుర్తించి ఆ జిల్లాల్లో వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక వసతులు ఇతర కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆరోగ్య సూచిక ప్రాతిపదికన చూస్తే ఆ ఆరు జిల్లాల్లో శిశు జననం, కుటుంబ నియంత్రణ, గర్భిణీ సంరక్షణ, సురక్షిత ప్రసవం, రోగ నిరోధక కార్యక్రమాలు, శిశువుల్లో పౌష్టికాహార లోపం వంటి ముఖ్యమైన అంశాల్లో వెనుకబడి ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని మంత్రి చెప్పారు.

ప్రజారోగ్యంలో అత్యధిక ప్రాధాన్యత జిల్లాగా గుర్తించిన విశాఖపట్నంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపట్టిన చర్యలలో భాగంగా అనకాపల్లిలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్పు చేయడం, అరకు, పాడేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం, అనకాపల్లిలో వంద పడకల మాతా, శిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణం, పాడేరు ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవల కల్పన, నర్శీపట్నంలో ఈ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం, విశాఖపట్నంలో 25 ఈఅర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభం, నర్సీపట్నం, పాడేరులోని ఏరియా ఆస్పత్రులలో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలను మంత్రి నడ్డా వివరించారు.

జీఎస్టీ సులభతరం కోసం చట్టాల సవరణ

వర్తక, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు, వివిధ భాగస్వాముల నుంచి అందిన విజ్ఞప్తుల ప్రాతిపదికన కొన్ని చట్ట సవరణలు చేయాలని జిఎస్టీ కౌన్సిల్ చేసిన సిఫార్సుల మేరకు సీజీఎస్టీ, యూనియన్ టెరిటరీ జీఎస్టీ, గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్, ఐజీఎస్టీ చట్టాల సవరణ జరిగింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ఆమోదం కూడా లభించిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ ప్రతాప్ శుక్లా మంగళవారం రాజ్య సభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు జవాబుగా చెప్పారు. గత డిసెంబర్ 22న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 31వ సమావేశంలో సవరించిన ఈ చట్టాలను వచ్చే ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి తీసుకు రావాలని కూడా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఫార్మా, బయోటెక్, మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమల రంగాల నుంచి వచ్చిన వినతులతోపాటు భాగస్వాములు లేవనెత్తిన అంశాలపై విస్త త సంప్రదింపులు జరిపిన మీదట ఈ చట్టాల సవరణ ప్రక్రియను చేపట్టినట్లు శివ ప్రతాప్ శుక్లా చెపపారు.

ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లిన జడ్జీలు వీరే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో జిల్లా జడ్జీ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న 23 మంది న్యాయాధికారులను ఉమ్మడి హైకోర్టు విభజనలో భాగంగా తెలంగాణ రాష్టానికి కేటాయించారు. వీరంతా వారికి పోస్టింగ్ ఇచ్చిన కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లా మరియు సెషన్స్ జడ్జి హోదాలో సికింద్రాబాద్ లోని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల జుడీషియల్ అకాడెమీలో డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న సి.సుమలత ను మాత్రం అదే పోస్టులో కొనసాగాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న వి.బి.నిర్మల గీతాంబ ను హైదరాబాద్ లోని పారిశ్రామిక ట్రిబ్యునల్ చైర్ పర్సన్ గా నియమించారు. కర్నూలు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జి.అనుపమ చక్రవర్తి కి కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలు లోని ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జి.ప్రియదర్శిని ని ఆదిలాబాద్ జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లో ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.తుకారాంజీ ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా నియమించారు. అనంతపురం జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శశిధర్ రెడ్డిని నల్గొండ జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. విశాఖపట్నం ఫ్యామిలీ కోర్టు కమ్ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న కె.సాయిరమాదేవి కి మెదక్ జిల్లా సంగారెడ్డి ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు. గుంటూరు జిల్లా 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.నర్సింగరావు కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు లోని 23వ అదనపు చీఫ్ జడ్జి కమ్ అదనపు ఎంఎస్ జే గా పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆయన అనంతరం హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) గా నియమితులయ్యారు. కృష్ణా జిల్లా విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్రహ్మణ్యం ను సికింద్రాబాద్ లోని తెలంగాణ , ఏపీ జుడీషియల్ అకాడెమీ అదనపు డైరెక్టర్ గా నియమించారు. గుంటూరు పారిశ్రామిక ట్రిబ్యునల్ చైర్మన్ కమ్ లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రేమావతిని కరీంనగర్ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. విశాఖపట్నం లోని సీబీఐ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బి.పాపిరెడ్డి ని హైదరాబాద్ సిటీసివిల్ కోర్టు 2వ అదనపు చీఫ్ జడ్జి గా నియమించారు.

విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ 1వ అదనపు జిల్లా జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.నాగార్జున కు నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) కేసుల చట్టం , కమ్ 8వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా పోస్టింగ్ ఇచ్చారు. విశాఖపట్నం మహిళా కోర్టు అదనపు ఫ్యామిలీ కోర్టు , జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న వి.వెంకట శేషు ను రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా నియమించారు. కర్నూలు ఫ్యామిలీ కోర్టు కమ్ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు విధులు నిర్వర్తిస్తున్న టి.రఘురాం కు మహబూబ్ నగర్ జిల్లా 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా పోస్టింగ్ ఇచ్చారు. కృష్ణా జిల్లా నూజివీడు 15వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వెంకటేశ్వర ప్రసాద్ ను నల్గొండ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. కడప ఫ్యామిలీ కోర్టు కమ్ 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బి.మంజరి ని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా నియమించారు. గుంటూరు జిల్లా నరసారావుపేట అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న కె.జయకుమార్ ను వరంగల్ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా 1వ అదనపు మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న బి.గౌతం ప్రసాద్ ను నిజామాబాద్ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. తూర్పు గోదావరి జిల్లా లోని కాకినాడ 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీనివాసచారి ని సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు 27వ అదనపు చీఫ్ జడ్జిగా నియమించారు. నెల్లూరు జిల్లా ఎస్పీఈ మరియు ఏసీబీ కేసులు కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ అబ్దుల్ రఫి ని ఖమ్మం 7వ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు. చిత్తూరు జిల్లా 8వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా ఎ.కరుణ కుమార్ ను మెదక్ జిల్లా సంగారెడ్డి లోని సెషన్స్ జ జడ్జి గా నిమమించారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ 5వ జిల్లా మహిళా విధులు నిర్వహిస్తున్న పి.లక్ష్మీ శారద ను రంగారెడ్డి జిల్లా కూకట్ పల్లి 15వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి గా నియమితులయ్యారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు లో 4వ అదనపు మెట్రోపాలిటన్ అదనపు చీఫ్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ టి శ్రీనివాస రావును హైదరాబాద్ సీబీఐ కోర్టు ప్రత్యేక జడ్జి గా నియమించారు.

కోహ్లీ @1

పుజారా@3, పంత్@ 21

ఐసీసీ తాజా టెస్ట్ ర్యాంకింగ్స్ వెల్లడి







దుబాయ్: ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో విజయ కేతనం ఎగురవేసిన భారత జట్టు ఆటగాళ్లు అటు ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకింగుల్లో కూడా దుమ్ము రేపారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ నెంబర్ 1 బ్యాట్స్‌మన్ ర్యాంక్‌లోనే కొనసాగుతుండగా... సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన చటేశ్వర్

3వ ర్యాంకులో పుజారా

ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో 521 పరుగులు చేసి ఇరుజట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచిన పుజారా భారత్ చారిత్రాత్మక సిరిస్ గెలుపుకు తోడ్పడ్డాడు. ఈ పర్యటనలో రాణించి తాజా ర్యాంకింగుల్లో మెరుగుపడ్డ మరో బ్యాట్స్‌మన్‌గా పుజారా నిలిచాడు.పుజారా ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకులోకి చేరుకున్నాడు. రవీంద్ర జడేజా బ్యాటింగ్‌లో ఆరు స్థానాలు ఎగబాకి 57కు చేరగా, కొత్తగా టెస్టుల్లోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ ఐదు స్థానాలు ఎగబాకి 62కు చేరాడు. ఈ ర్యాంకింగ్స్ ఇవ్వడానికి కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ ఆడిన రెండో టెస్ట్‌ను కూడా ఐసీసీ పరిగణనలోకి తీసుకుంది.

పుజారా ఒక స్థానం మెరుగుపడి 3వ స్థానంలోకి చేరగా, చివరి టెస్ట్‌లో సెంచరీతో కదం తొక్కిన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఏకంగా 21 స్థానాలు మెరుగుపడి 17కు చేరాడు. 1973లో మాజీ వికెట్ కీపర్ ఫారూఖ్ ఇంజనీర్ ఈ ర్యాంకును చేరాడు. కాగా కెప్టెన్, వికెట్ కీపర్‌గానేకాక, విజయవంతమైన బ్యాట్స్‌మన్‌గా పేరుపొందిన ఎంఎస్ ధోనీ తన కెరియర్ బెస్ట్‌గా సాధించినది 19వ ర్యాంకే. పంత్ 2016 ఐసీసీ అండర్ 19 క్రికెట్ వరల్డ్ కప్‌లో స్టార్‌గా మెరిశాడు. నేపాల్‌పై 18 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన పంత్ తన కెరియర్లో తొమ్మిదో టెస్ట్‌ను మాత్రమే ఆడుతూ 159 పరుగులు చేసి టాప్ 20లోకి అడుగు పెట్టాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ప్రారంభంలో పంత్ ఐసీసీ ర్యాంకుల్లో 59వ స్థానంలో ఉన్నాడు. ఒక సిరీస్‌లో 350 పరుగులు చేసి 20 క్యాచులు పట్టి వేగంగా మెరుగుపడ్డాడు.

బౌలర్లలో..

స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆస్ట్రేలియా చివరి టెస్ట్‌లో ఆడి తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి, ఏడు స్థానాలు మెరుగుపడి తన కెరియర్ బెస్ట్ 45కు చేరాడు. జస్ప్రీత్ బుమ్రా మునపటి 16వ స్థానంలోనే కొనసాగుతుండగా, మహ్మద్ షమీ ఒక స్థానం మెరుగుపడి 22కు చేరగా, జడేజా ఒక స్థానం మెరుగుపడి ఐదో స్థానంలో ఉన్నాడు. ఆల్ రౌండర్‌గా జడేజా ఒక స్థానం మెరుగు పడి రెండో స్థానంకు చేరాడు. రెండో స్థానంలో ఉన్న వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ మూడో స్థానానికి దిగజారాడు.

టాప్‌లో భారత్


టెస్టుల్లో భారత జట్టు అగ్ర స్థానం లో కొనసాగుతుండగా, ఆస్ట్రేలియా జట్టు ఒక పాయింట్‌ను కోల్పోయి నప్పటికి మునపటి ఐదో స్థానంలోనే ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఎడెన్ మర్‌క్రమ్ కేప్‌టౌన్ టెస్ట్‌లో పాకిస్తాన్‌తో ఆడుతూ 78 పరుగులు చేసి ఏడు స్థానాలు మెరుగుపడి తిరిగి 10వ స్థానానికి చేరాడు. దక్షిణాఫ్రికాకే చెందిన టెంబా బావుమా టాప్ 30లోకి ప్రవేశించాడు. పాక్‌తో ఆడిన టెస్ట్‌లో 75 పరు గులు చేయడంతో ఐదు స్థానాలు మెరు గుపడి 26కు చేరాడు. కెప్టెన్ డు ప్లెస్సిస్ పాక్‌తో రెండో టెస్ట్‌లో సెంచరీ చేయడంతో ఆరు స్థానాలు ఎగబాకి 16కు చేరాడు. దక్షిణాఫ్రికా బౌలర్ల ర్యాంకులను పరిశీలిస్తే.. వెర్నన్ ఫిలాండర్ ఒక స్థానం మెరుగుపడి మూడో స్థానానికి చేరుకున్నాడు. డుయన్నె అలివర్ 36 నుంచి 32కు చేరాడు.

భారత్ క్రికెటర్లకు బీసీసీఐ నగదు

నజరానా



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియా ను 71 ఏళ్ల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత ఓడించి టెస్ట్ సిరీస్‌ను గెలిచిన భారత క్రికెట్ జట్టు ఆటగా ళ్లకు భారతీయ క్రికెట్ నియం త్రణ మండలి (బీసీసీఐ) నగదు నజరానలను ప్రకటించింది. విరాట్ కోహ్లీ నేతృ త్వంలోని జట్టు ఆస్ట్రేలి యాను 2-1 తేడాతో ఓడించి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుం ది. ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ... ఈ పర్యటనకు ఎంపికైన జట్టులోనిఅందరు ఆటగా ళ్లకు(రిజర్వ్ ఆటగాళ్లు,సహాయ సిబ్బందికి కలిపి) నగదు పురస్కా రాలను ప్రకటించింది. బోనస్‌లు మ్యాచ్ ఫీగా చెల్లించేఅసలు మొత్తానికి సమానంగా ఉంటుంది. చివరి 11మందిలో ఉన్న ఆటగాళ్లకు ఒక్కొక్కరికి ఒక్కో మ్యాచ్ కు బోనస్ రూపేణ రూ. 15 లక్షలు రిజర్వ్ ఆటగాడికి రూ.7.5 లక్షలు వస్తాయి అని బీసీ సీఐ మంగళవారం ఒక ప్రకటన చేసింది. ఈ లెక్కన ఒక్కో ఆటగాడు నాలుగు టెస్టు లకు రూ.60 లక్షలు పొంద నుండగా, రిజర్వ్ ఆట గాడు రూ.30ల క్షలు పొం దనున్నా డు. కాగా కోచ్‌లకు తలా రూ. 25 లక్షలు, అందించ నుంది. కోచిం గేతర సిబ్బం దికి వారు పనిచేసిన సమ యాన్ని బట్టి ఇవ్వనున్నట్లు బీసీసీఐ పేర్కొంది. ఆస్ట్రేలియాలో భారత్ ఆడిన తొలి టెస్ట్‌లో గెలు పొందగా, రెండో టెస్ట్‌లో ఆసీస్ గెలి చింది. మూడో టెస్టు ను భారత్ సొం తం చేసుకోగా, చివరి టెస్ట్ డ్రాగా ముగి సింది. ఫలితం గా భారత్ సిరీస్‌ను 2-1 తేడాతో ముగించింది.



09-01-2019

విభజన చీకట్ల నుండి వెలుగులు - 60 రోజుల్లోనే సాధించాం విద్యుత్ మిగులు
పరుగెడుతున్న పారిశ్రామిక ప్రగతి - ఆర్థిక వృద్ధి కేంద్రంగా అమరావతి

6వ విడత
జన్మభూమి మా ఊరు
జనవరి 2-11 2019

2014లో 22 మిలియన్ యూనిట్ల విద్యుత్తు లోటు - నేడు మిగులు విద్యుత్తు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ - దేశానికే ఉత్తమ నమూనా

నాలుగున్నరేళ్లలో విద్యుత్ రంగంలో 138 అవార్డులు సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పనితీరుకు నిదర్శనం. అత్యుత్తమ వసతులతో రాజధాని నగరం, విమానాశ్రయాలు, ఓడరేవులు, ఆర్థిక నగరాలను నిర్మించడం ద్వారా అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించాం. పెట్టుబడులను ఆకర్షించడం, భారీ ఎత్తున పరిశ్రమల స్థాపన, లక్షలాది యువతకు ఉపాధి కల్పన ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా అత్యున్నత శ్రేణిలో నిలబెట్టాం.

విద్యుత్తు:

- రాష్ట్రంలో ఇప్పుడు విద్యుత్తు కోతలు, పవర్ హాలిడేస్ లేవు. న్యాయమైన మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాం.
- గృహాలకు, పరిశ్రమలకు 24 X 7 విద్యుత్ సరఫరా.
- వ్యవసాయానికి పగటి పూట 7 గంటల ఉచిత విద్యుత్తు.
- విద్యుత్తు సరఫరా, పంపిణీలో సంస్కరణలు — గణనీయంగా తగ్గిన ప్రసార, పంపిణీ నష్టాలు. భవిష్యత్తులో పంపిణీ నష్టాలను 6% శాతానికి తగ్గింపు.
- 4 ఏళ్లలో విద్యుత్తు రంగంలో రూ. 39,604 కోట్ల పెట్టుబడులు.
- పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రోత్సాహం — సౌర విద్యుత్, పవన విద్యుత్.
- కర్నూలులో ప్రపంచంలోనే అతి పెద్దదైన 1,000 మెగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రం స్థాపన.
- కర్నూలు, కడప, అనంతపురంలో 4,000 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు — ఇప్పటికే 1,850 మెగావాట్లు అందుబాటులోకి.
- 0 - 900 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే రైతులు, గృహాలకు విద్యుత్తు ఛార్జీలు పెంచలేదు. రాబోయే రోజుల్లో విద్యుత్తు చార్జీలు పెంచబోమని తెలిపిన ఏకైక రాష్ట్రం.
- ఆక్వా రంగానికి యూనిట్ రూ. 2కే విద్యుత్ సరఫరా. దోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్తు.
- ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు. (జగ్జీవన్ జ్యోతి)

అత్యుత్తమ నగరంగా అమరావతి:

- రైతుల త్యాగఫలం - ప్రజా రాజధాని నగరం అమరావతి - 34 వేల ఎకరాల భూమి సేకరించడం ఒక చరిత్ర.
- ప్రపంచంలోని 5 అత్యుత్తమ నగరాలలో ఒకటిగా మన రాజధాని అమరావతి నిర్మాణం.
- అమరావతిలో రాబోయే 35 ఏళ్లలో 35 లక్షల మంది నివాసం, 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు.
- రాజధాని నిర్మాణ వ్యయం అంచనా రూ.1,09,023 కోట్లు. మొదటి దశలో రూ.51,687 కోట్లు ఖర్చు. ప్రస్తుతం రూ.39,875 కోట్ల మేర పనులు — 190 రోజుల్లో ఇంటెరిమ్ గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణం.
- 12.16 లక్షల చదరపు అడుగుల్లో 250 మీ. ఎత్తుతో కోహినూర్ వజ్రాకృతిలో కొత్త అసెంబ్లీ భవనం — ప్రపంచంలోనే అత్యుత్తమ దిగ్గజ నిర్మాణం.
- 5 టవర్లుగా సెక్రటేరియట్- 40 అంతస్తులతో 4 టవర్లు, 50 అంతస్తులతో 5వ టవర్‌ల నిర్మాణం.
- 12.5 లక్షల చదరపు అడుగుల్లో 36 కోర్టు హాళ్లతో బౌద్ధ స్థూపాకృతిలో హైకోర్టు నిర్మాణం.
- 4 ఎకరాల్లో 23 కోర్టు హాళ్లతో సిటీ సివిల్ కోర్టు నిర్మాణం పూర్తి.
- 92 లక్షల చ.అ. విస్తీర్ణంలో న్యాయాధికారులు, సీనియర్ అధికారులు, ప్రభుత్వోద్యోగులకు శరవేగంగా నివాసాల నిర్మాణం.
- బ్లూ అండ్ గ్రీన్ సిటీగా అమరావతి - 3,100 కిలోమీటర్ల పాదచారి బాటలు, సైకిల్ ట్రాకుల నిర్మాణం - అటు జలం, ఇటు పచ్చదనం, నిత్య శోభితం.

రాష్ట్రం నుండే అంతర్జాతీయ విమాన సర్వీసులు:

- విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఇప్పటికే అంతర్జాతీయ సర్వీసులు ఆరంభం. త్వరలో తిరుపతి నుంచి కూడా ప్రారంభం.
- విజయవాడ నుంచి సింగపూర్‌కు విమానయాన సేవలు ఆరంభం.
- విశాఖ సమీపంలో భోగాపురం, నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయాల ఏర్పాటు పనులు వేగవంతం. కర్నూలు సమీపంలో ఓర్వకల్లు నుంచి విమానాశ్రయం ప్రారంభం.

ఓడరేవుల అభివృద్ధి:

- నౌకాయాన అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ పోర్ట్ పాలసీ — 2015 విడుదల.
- 2013-14 లో రాష్ట్ర ఓడ రేవుల నుంచి సరుకు రవాణా 180 మిలియన్ టన్నులు, 2018-19 నాటికి 315 మిలియన్ టన్నులకు పెరుగుదల — 75% వృద్ధి.
- మచిలీపట్నం ఓడరేవు పనులు శరవేగం. త్వరలో రామాయపట్నం, భావనపాడు.

సహజ వాయు నిక్షేపాల గని:

- నాచురల్ గ్యాస్ నెట్‌వర్క్ విస్తరణ — కాకినాడ-శ్రీకాకుళం పైపులైను ఏర్పాటుకు ప్రణాళిక.
- తూర్పు గోదావరి — పశ్చిమ గోదావరి మధ్య సిటీ గ్యాస్ పంపిణీ ప్రాజెక్టులకు అనుమతి సాధించాం. ఈ ప్రాజెక్టుతో 5% నుంచి 50% వరకు ఇంధన ఖర్చు ఆదా - ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి.


రహదారుల అభివృద్ధిలో ప్రాధాన్యం:

- 4,700 కి.మీ. రహదారుల అభివృద్ధి పనులు.
- 384 కి.మీ. అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారికి ఆమోదం.
- 2,164 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల స్థాయికి పెంపు.
- 4 ఏళ్లలో దాదాపు 5000 కి.మీ. రహదారుల నిర్మాణం.

డిజిటల్ సేవలు:

- ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ప్రతి గ్రామానికి డిజిటల్ సేవలు.
- ప్రతి ఇంటికి ఫోన్, కేబుల్, నెట్ - 15 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్.
- ల్యాండ్‌లైన్ ఫోన్, 300 ఛానల్స్ ద్వారా టెలివిజన్ ప్రసారాలు.

ఇక్కడ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి





ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగిద్దాం — పనిచేసే ప్రభుత్వానికి ప్రజా దీవెనలు అందిద్దాం -ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుదాం!

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

Lively
Interaction
For
Ever

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I

బుధవారం 9 జనవరి 2019



వెబ్ సిరీస్ వీరులు

విజయం వైపే... ఈ పరుగు!

సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో మొదటి వెబ్ సిరీస్ విడుదల చేసిన యువబృందం

వెబ్ సిరీస్...ఇప్పుడు యువతని బాగా ఆకట్టుకుంటున్న వినోదమాధ్యమం ఇది. యువత కోసం యువత తీస్తున్న వినూత్న చిత్రాలు ఇవి. నెట్ ఫ్లిక్స్, అమెజాన్, జీఫైవ్ లాంటి సంస్థలు వినోదాన్ని రిటైల్ గా ఇంటింటికీ చేరుస్తున్న నైపథ్యంలో సినిమాల పట్ల ఆసక్తి ఉన్న యువతరం వెబ్ సిరీస్ బాట పడుతున్నారు. ఈ కోవలోనే...యూత్‌కి నచ్చేలా మరో సిరీస్ నిన్ననే జీ5 యాప్ (ఓటిటి ప్లాట్ ఫామ్) వేదికగా విడుదలైంది. జీ5 యాప్‌లో 'ఎక్కడికీ ఈ పరుగు'తో ఒకేసారి మొదటి సిరీస్‌లోని మొత్తం ఆరు ఎపిసోడ్స్‌ని విడుదల చేశారు. ఈ సిరీస్‌కి జివి అనురాగ్ నిర్మాత కాగా కె. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించారు. తెలుగుసినీ హీరోలు ఆర్యన్ రాజేష్, శశాంక్ ఇందులో హీరోలుగా నటించారు. ఔత్సాహికులైన యువతకు తమ ప్రతిభని నిరూపించుకునేందుకు చక్కని వేదికగా వెబ్ సిరీస్ పేరు తెచ్చుకుంటున్న నేపథ్యంలో... తమ సిరీస్ సైతం ఇంటిల్లిపాదీని ఆకట్టుకుంటుందంటున్నారు...సిరీస్ యూనిట్. వారితో ఆంధ్రప్రభ లైఫ్ జరిపిన చిట్ చాట్ మీకోసం-

'మీడియా ఎన్ని రూపాల్లో జనం మధ్యకు దూసుకువస్తున్నా...సినిమాలదే అగ్రస్థానం'...అనే మాటని నేటితరం తుడిచేసే ప్రయత్నాలు చేస్తున్నది. సినిమా అంటే ప్రేమ, నటన అంటే ప్యాషన్, దర్శకత్వం అంటే ప్రాణం అంటున్న యువతరం...ఇప్పుడు సినిమా అవకాశాలకోసం పడిగాపులు పడే పరిస్థితి లేదు. ప్రతిభని నిరూపించుకునే వేదికలను డిజిటల్ మీడియా విస్తృతంగా అందిస్తోంది. యువతరం దానిని నూటికి నూరుపాళ్లు సద్వినియోగం చేసుకుంటోంది. ఈ క్రమంలో వచ్చిందే 'ఎక్కడికీ ఈ పరుగు'. దీనిని తెలుగుతో పాటు హిందీ, మలయాళం, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళ భాషల్లో సైతం విడుదల చేశారు.

ఆసక్తికరమైన కథ కథనాలు

సిరీస్ మొత్తం ఒక యువతి మిస్సింగ్ చుట్టూ తిరుగుతుందని...ఆ క్రమంలో సస్పెన్స్ థ్రిల్లర్ గా కథ నడుస్తుందని ఇందులో ఒక హీరో అయిన మధుర్ ఆనంద్ పాత్రలో నటించిన శశాంక్ తెలిపారు. ఆర్యన్ రాజేష్ మరో హీరోగా పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. వారిద్దరి మధ్య ఫైట్ ఉంటుందని...చివరివరకు పోలీస్ అధికారి పేరుని వెల్లడించడం లేదని సిరీస్‌ని మంచి కథనంతో...ఆసక్తిగా చూడాలనిపించేలా రూపొందించామని శశాంక్ అన్నారు. ఒక హీరోయిన్‌గా పావని గంగిరెడ్డి నటించగా... మరో హీరోయిన్ కల్పికా గణేష్. కథలో నాలుగు ప్రధాన పాత్రలతో పాటు కిడ్నాప్ గ్యాంగ్ కూడా ఉంటుంది. కథ మూడు ప్రత్యేక విభాగాలుగా సాగుతూ...ఒకదానికి మరొకటి అనుసంధానమై ఉంటుందని శశాంక్ అన్నారు. శశాంక్ పోషించిన మధుర్ ఆనంద్ పాత్ర చెఫ్. కాగా అతని భార్య వైష్ణవి మిస్సింగ్ చుట్టూ కథ తిరుగుతుంది. ప్రతి ఎపిసోడ్‌లో క్యూరియాసిటీ, టెంపో ఉంటాయని, అసలు ఏం జరిగింది... ఎవరు కిడ్నాప్ చేశారు... ఒక అమ్మాయి ఇండిపెండెంట్‌గా బతకాలి అంటే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాలి...అనే అంశాలు...కథను ఉత్సుకత రేకెత్తేలా నడిపిస్తాయని... అంతర్లీనంగా సామాజిక స్పృహ కూడా ఉంటుందని శశాంక్ తెలిపారు.

రానున్నకాలం వెబ్ సిరీస్‌లదే...

మొబైల్స్‌లో అందుబాటులో ఉంటూ యువతని బాగా ఆకట్టుకుంటున్న వెబ్‌సిరీస్...నట్టిళ్లలో రాజ్యమేలుతున్న టీవీ సీరియల్స్‌ని డామినేట్ చేయగలవా...అని ప్రశ్నించగా తప్పకుండా చేయగలవన్నారు ఆర్యన్ రాజేష్. ఒక్క ఎపిసోడ్ చూస్తే మొత్తం చూడాలనిపించేత గ్రిప్‌తో తమ సిరీస్ కథనం సాగుతుందని...కథ కథనాలు అంతగా ఆకర్షించడం వల్లనే తాను ఇందులో నటించానని రాజేష్ తెలిపారు. 'ఇండియాలో ఇప్పుడిప్పుడే వెబ్ సిరీస్ ఆరంభం అయ్యాయి. బయట దేశాల్లో ఇవి సినిమాల కన్నా కూడా పాపులర్ అయ్యాయి. ఇది ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్. అంటే ఎదుగుతున్న రంగం ఇది. విదేశాల వెబ్‌సిరీస్‌ల్లో ఎక్కువ థ్రిల్లర్స్ ఉంటాయి. ఎందుకంటే థ్రిల్లర్స్ చూడటానికి అందరూ ఎక్కువ ఇష్టపడతారు.' అని ఆయన అన్నారు. 'ఈ కంటెంట్, ఈ ప్లాట్‌ఫాంలో చాలా బావుంటుందనిపించింది. సస్పెన్స్ కంటెంట్ ఉన్నపుడు సక్సెస్ అయిన సందర్భాలున్నాయి. యువతే కాకుండా మా సిరీస్ అందరికీ నచ్చుతుంది' అన్నారు రాజేష్. ఇప్పటి వరకు వెబ్ సిరీస్ రూపకల్పనలో ఎలాంటి ప్రభుత్వపరమైన నియంత్రణలు లేవని ఆయన అన్నారు.

ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసి...

అభిలాష్ అనురాగ్ ఇద్దరూ ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేశారు. అభిలాష్ మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ కూడా పూర్తి చేశాడు. ఇంతకుముందు అభిలాష్ యధార్థం అనే షార్ట్ ఫిలిం తీశాడు. ఒక గంట నిడివి ఉన్న ఈ చిత్రాన్ని క్రౌడ్ ఫండింగ్‌తో చేసినట్టుగా అతను చెప్పాడు. ప్రొడ్యూసర్ అనురాగ్.... బి.కామ్ గ్రాడ్యుయేట్. ఫిలింమేకింగ్‌తో పాటు థియేటర్ కోర్సు చేశాడు. సినీ రంగంలో కొత్త జనరేషన్ అయిన మీరు ఎలాంటి కొత్తదనం తేవాలనుకుంటున్నారు...అని అడిగినప్పుడు...ఇవాళ రేపు డిజిటల్ మీడియా... ప్రజలను ఎక్కువగా చేరుతోందని...అయితే కేవలం సామాజిక స్పృహ మాత్రమే చూపిస్తామంటే ఎవరూ చూడరని ఈ యువకులు అభిప్రాయపడ్డారు.

- వడ్లమూడి దుర్గాంబ
శ్రీదేవి కవికొండల

కథను చెప్పడానికి ఇదో మార్గం

వెబ్‌సిరీస్‌లు సమాజానికి దగ్గరగా సజీవమైన పాత్రలతో వస్తున్నాయి. అవి జనాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటివరకు వెబ్‌సిరీస్‌గా వచ్చినవన్నీ ఎక్కువగా కామెడీ కుటుంబపరమైన కథనాలే. మేము వినూత్నంగా సస్పెన్స్ థ్రిల్లర్‌తో వచ్చాం. కథ అందరికీ నచ్చుతుందనే ఈ ప్రయత్నం చేశాం. ఒక కథని చెప్పాలని అనుకున్నపుడు దానిని ఏ ఫార్మాట్‌లో నైనా చెప్పవచ్చు...మేము వెబ్ సిరీస్ విధానాన్ని ఎంపిక చేసుకున్నాం. కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. సస్పెన్స్‌తో పాటు ఇందులో ఎమోషనల్ డ్రామా ఉంది.



-అభిలాష్

ప్యాషన్‌తో వచ్చా!

సినిమాల మీద ప్యాషన్‌తోనే ఈ రంగంలోకి వచ్చాను. కథ నచ్చడం వల్లనే క్రౌన్ నెట్‌వర్క్‌బ్యానర్ తో దీని నిర్మాతగా వ్యవహరించాను. డిజిటల్ మీడియా వచ్చాక సినిమా రంగంలో తమని తాము నిరూపించుకోవాలనుకునే మాలాంటివారికి ఒక మంచి వేదిక దొరికింది. అవకాశాలను సృష్టించుకునే అవకాశం ఇప్పుడు మా చేతుల్లో ఉన్నట్టయింది. ప్రతిభని నిరూపించుకునేందుకు పడిగాపులు పడాల్సిన అవసరం లేకపోవటం... ఒక మంచి పరిణామం.



-అనురాగ్

వీటిని ఇప్పుడు బాగా చూస్తున్నారు

వెబ్ సిరీస్ ఒక ప్రత్యేక ఫార్మాట్. సినిమాకు దీనికి చాలా తేడా ఉంది. తెలుగులో వెబ్ సిరీస్ పూర్తిస్థాయి థ్రిల్లర్ కథాంశంతో రాలేదు. కామెడీ, డ్రామా, లవ్ ఎక్కువగా తీశారు. ముద్దపప్పు ఆవకాయ... మొదటి వెబ్‌సిరీస్. యుట్యూబ్‌లో వచ్చింది. అప్పుడు ఒటిటి ప్లాట్‌ఫాంలు ఏం లేవు. మా 'ఎక్కడికీ ఈ పరుగు'...అందిస్తున్న జీ5కూడా...అమెజాన్ నెట్‌ఫ్లిక్స్ తరహాలో జనంలోకి వెళుతోంది. పిల్ల, ముద్దపప్పు ఆవకాయ, గ్యాంగ్‌స్టార్, మన ముగ్గురి లవ్‌స్టోరి లాంటివన్నీ వెబ్ సిరీస్‌ల పట్ల జనంలో ఆసక్తిని పెంచాయి. మనవాళ్లు వీటిని చూడటానికి అలవాటు పడుతున్నారు. మన కుటుంబాలకు దగ్గరగా, సమాజంలో పాత్రల్లాగే అనిపించే కథలు వెబ్ సిరీస్‌ని ఆసక్తికరంగా మార్చేస్తున్నాయి



-శశాంక్

ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు మంచి అవకాశం


ఈ స్క్రిప్ట్ బాగా నచ్చింది నాకు. నా క్యారక్టర్ కూడా నచ్చింది. నాకు శశాంక్ బాగా పరిచయం. తన ద్వారా డైరక్టర్ అండ్ టీమ్ పరిచయం అయ్యారు. దేనికైనా కథే ప్రధానం. కంటెంట్ నచ్చడం వల్లనే వెబ్ సిరీస్ చేశాను. కొత్త డైరెక్టర్, కొత్త ప్రొడ్యూసర్, అసలు ఎలా చేస్తారో...అనే అనుమానం ఉండేది. కానీ సిరీస్ మేకింగ్ గురించి వాళ్లు చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పడం వలన... ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రేక్షకులకు తిరిగి దగ్గరయ్యేందుకు ఇది మంచి మార్గంలా అనిపించింది. సినిమాకు వచ్చి మూడుగంటలు కూర్చునే పనిలేకుండా ఎప్పుడుకావాలంటే అప్పుడు చూసి వినోదాన్ని పొందగల అవకాశం ఇలాంటి సిరీస్‌లు అందిస్తున్నాయి. కాలపరిమితి చూడకుండా కథలను సమగ్రంగా చెప్పే అవకాశం ఈ విధానంలో ఉంది.



- ఆర్యన్ రాజేష్

* రంగవల్లిక *

13 చుక్కలు
7 వరుసలు 7 వరకు
సరిచుక్క




ఆర్. హేమలత సురేఖ
విజయవాడ
కృష్ణాజిల్లా



వి. బిజవ్వ
8వ తరగతి
బైంసా







ఐ.సత్య
తాండూరు

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు సరిచుక్క



19 చుక్కలు
1 వరకు
సరిచుక్క

కవితా ప్రసాద్
నారాయణపేట



మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ C/O ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

బాధకు కారణం ఏమిటి?

ఎన్ని సమస్యలు ఉన్నా ఎవరికైతే గురువు దయ ఉంటుందో వారికి ధైర్యం సడలిపోదు. ఎన్ని బాధలు కలిగినా నేను వీటన్నిటికీ అతీతమైన ఆత్మ స్వరూపాన్ననే జ్ఞానం మాత్రం అలాగే నిలిచి ఉంటుంది. ఎప్పుడు దుఃఖం కలిగినా అది మనసుకేనని, ఆత్మకు కాదని అసలు నేనంటే ఏమిటనే మంత్రాన్ని పదేపదే విచారించడం వల్ల మనసు తేలికపడుతుంది.

మనిషన్నాక సుఖదుఃఖాలు, బాధలు, ఆనందం వంటివి ఉంటాయి. 'నాకే బాధలూ లేవు' అంటుంటారు. అలా అనుకునే వారికి ఒక నమస్కారం. 'నాకెప్పుడూ బాధలే' అని కాని, అప్పుడప్పుడూ ఏవో బాధలు వస్తుంటాయని కాని అనిపిస్తూ ఉండేవారు ఉంటారు. వారి కోసమే ఈ విషయాలు.

ఏదైనా బాధ వచ్చినపుడు 'నన్ను బాధపెట్టేదెవ్వరు? అని ప్రశ్నించుకోవాలి. ఏమి సమాధానం వస్తుందో పరిశీలించాలి. ఆ సమాధానం అనేక రకాలుగా ఉండవచ్చు. బాధలకు కొన్ని కారణాలు ఈ కింద ఉన్నాయి. మన బాధకు వాటిలో ఏవి కారణమో ఆలోచించాలి.

వ్యక్తులు, పరిస్థితులు

ఉదాహరణ: భార్య, భర్త, పిల్లలు, అత్త, కోడలు, దాయాదులు, ఇరుగు పొరుగు, స్నేహితులు, పై అధికారులు, కింద పనిచేసేవారు, అప్పిచ్చినవారు, అప్పు తీసుకున్నవారు, మోసం చేసినవారు, ప్రభుత్వోద్యోగులు, అనారోగ్యం, డాక్టర్, మన ఊరు, మన దేశం, దేశాన్ని నడిపేవారు, వాతావరణం, అతివృష్టి అనావృష్టి, అధర్మం, అవినీతి, దేశ ఆర్థిక పరిస్థితులు, చుట్టూ ఉన్న సంఘం, గురువు, శిష్యులు, ఇల్లు, పొలం, ఆస్తిపాస్తులు , పశువులు వగైరా.

నేను

అసమర్థత, తెలివితక్కువ తనం, గుడ్డిగా నమ్మటం, జాలి, అనారోగ్యం, దురదృష్ట జాతకం, పూర్వ జన్మ పాపం, ఇలా తనను తాను నిందించుకోవడం.

దేవుడు లేదా గ్రహాలు


వాస్తు, ముహూర్తం, శాపం, చేతబడి వంటివి. పూజలు, మొక్కులు వ్యర్థమయ్యాయి, అసలు దేవుడు ఇంత ఘోరమైన ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడోవంటి భావాలు.

ప్రారబ్ధం

అనుభవించక తప్పదు, ఇప్పుడు మంచి చేస్తే ముందైనా సుఖం ఉంటుంది అనే భావన.

మనస్సు

సంకల్పాలు, వాసనలు, ప్రపంచం, వ్యక్తులు, పరిస్థితులు ఎలా ఉంటే ఏమిటని చూసే పద్ధతిలో మార్పు వస్తే బాధ



ఉండదు. రాగద్వేషాలు, సుఖ దుఃఖాలు, బాధలు, అన్నింటికి కారణం మనస్సే.

జన్మ

శరీరాన్ని ధరించటం లేదా అజ్ఞానం అంటే తాను సచ్చిదానంద సాక్షి స్వరూపాన్ని తెలుసుకోకపోవడం.

దుఃఖము లేదా దుఃఖ కారణమూ లేదు. దుఃఖాన్ని అనుభవించే భోక్త లేడు. అన్నీ తెరమీది బొమ్మలు లాగా జరుగుతున్నాయి.

వీటిలో మీ బాధలు దేని వల్ల కలుగుతున్నాయి. వాటి పరిష్కారానికి ఎటువంటి మార్పులు అవసరమో ఆలోచించుకోవాలి.

బాధలకు నివారణా మార్గాలు

ఎన్ని సమస్యలు ఉన్నా ఎవరికైతే గురువు దయ ఉంటుందో వారికి ధైర్యం సడలిపోదు. ఎన్ని బాధలు కలిగినా నేను వీటన్నిటికీ అతీతమైన ఆత్మ స్వరూపాన్ననే జ్ఞానం మాత్రం అలాగే నిలిచి ఉంటుంది.

ఎప్పుడు దుఃఖం కలిగినా అది మనసుకేనని, ఆత్మకు కాదని అసలు నేనంటే ఏమిటనే మంత్రాన్ని పదేపదే విచారించడం వల్ల మనసు తేలికపడుతుంది. గురుబోధ వంటివి చదివితే దానిలోని విషయాలు గుర్తుకు వస్తాయి. వాటి వల్ల సాంత్వన లభిస్తుంది. భగవద్గీతను అర్థం తెలుసుకుని చదివితే ఉత్సాహం ధైర్యం వస్తాయి. కర్మను కూడా యోగముగా చూడమంటుంది గీత,

అన్నిటిని సాక్షి భావంతో చూడడం

ప్రపంచానికి సాక్షి, శరీరానికి సాక్షి, సంకల్పాలకు (భావాలు వికారాలకు) సాక్షి, అహంకారానికి సాక్షి, ప్రపంచం నుంచి అహంకారం వరకు అన్నింటినీ కలిపి ఒకే బొమ్మగా చూచే అఖండ సాక్షి. ఇందువల్ల భావాతీత క్రమంలో పరిపూర్ణత సిద్ధిస్తుంది.

సానుకూల దృక్పథం

ఇక సానుకూల దృక్పథంతో చూడడం (ఇది మనస్సుకు సంబంధించినది) కొంతవరకూ బాధల నుంచి నివారణకు తోడ్పడుతుంది.

కొన్ని బాధల నివారణ మన చేతిలోనే ఉంటుంది. ఉదా: అనారోగ్యం బాధను వైద్య చికిత్స వంటివాటి ద్వారా నివారించుకోవచ్చు. అందుకే బాధ ఎవరి వల్ల వస్తోందో గ్రహించాలి. మన ప్రవర్తనలో లోపాలుంటే మార్చుకోవడం ద్వారా కొన్ని బాధలను నివారించు కోవచ్చు. అందుకే బాధ ఎవరి వల్ల వస్తోందో పరిశీలించాలి.

సర్వేజనాస్సుఖినో భవంతు

- కోసూరు హయగ్రీవరావు

9949514583

చింతన

తిరుప్పావై

పాశురం 25

ఒరుత్తి మగునాయ్ పిఱన్దు, ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగి త్తాన్ తీజ్గు నినైన్ద
కరుత్తై ప్పిళైప్పిత్తు క్కఞ్జన్ వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱనెడు మాలే! యున్నై
అరుత్తిత్తు వన్దోమ్; పఱై తరుతియాకిల్,
తిరుత్తక్కశెల్వముమ్ కేవకముమ్ యామ్పాడి
వరుత్తముమ్ తీర్న్దు మగిళ్ న్దేలో రెమ్బావాయ్

తాత్పర్యం

తనను చతుర్బాహు స్వరూపంతో కుమారునిగ కనవలెనని కోరిన సాటిలేని దేవకీ దేవికి ఒక రాత్రి కుమారుడై పుట్టి, అదే రాత్రి బాల చేష్టలను కనవలెనని తపమాచరించిన మరొక అద్వితీయమైన యశోదమ్మ ముద్దు బిడ్డడవై రహస్యముగ పెరుగుచుండ, ఆ వార్తను విని కంసుడు సహించలేక నీకు అపకారము చేయ తల్చగనే అతని అభిప్రాయము వ్యర్థమగునట్లు చేసి ఆ కంసుని కడుపులో నీవే కారుచిచ్చువలె అయి అతనిని సంహరించి, నిన్ను మాకనుగ్రహించిన మాపై దీర్ఘ వ్యామోహము కల వాడా! నిన్నే మేము యాచింపవచ్చినాము. పఱై అను వాయిద్య విశేషమున్ను ఇచ్చినచో శ్రీలక్ష్మీదేవి కూడ అభిమానించు నీ ఐశ్వర్యమును, అమె వినగోరు నీవీరచరితము లనేకములను మేము పాడి, నిన్ను పొందుటకై యింతవరకు పడిన శ్రమలన్నిటిని మరచి ఆనందింతుము.



పాశురం 26

మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్;
మేలైయార్ శెయ్వనగళ్ ;వేణ్డువనకేట్టియేల్ ;
ఞాలత్తై యెల్లామ్ నడుజ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్జ శన్నియమే
పోల్వన శజ్గజ్గళ్ , పోయ్ప్పాడు డైయనవే,
శాల ప్పెరుమ్ పఱైయే,పల్లాణ్డిశైప్పారే,
కోలవిళక్కే, కొడియే, వితానమే,
ఆలినిలై యాయ్! అరుళేలో రెమ్బావాయ్.

తాత్పర్యం

ఆశ్రితులయందత్యంత వ్యామోహము కలవాడా! ఇంద్రనీల మాణిక్య వర్ణుడా! మార్గశీర్ష మాసమున స్నానవ్రతమాచరించదలచితిమి. మా పూర్వులున్నూ ఈ స్నానవ్రతమాచరించి యున్నారు. వారాచరించిన విధానమును, అందులకవసరమగు పరికరములను నీవు దయ చేసి వినునట్లయితే తెలిపెదము. భూమండలమునంతయు వణికింపజేయునంత పెద్ద ధ్వనినిచ్చు, పాలవలె స్వచ్ఛమై, తెల్లనైన రంగు కల నీ పాంచజన్య శంఖమునే పోలిన అనేక శంఖములు కావలయును. ఒక మంగళ దీపము కావలయును. పెద్ద గరుడ ధ్వజము కావలయును. విశాలమైన చాందినీలున్నూ కావలెను. యివన్నియు నీవివ్వ గలిగినవే. లోకములను బొజ్జలో దాల్చి ఒక లేత మఱ్ఱి యాకుపై పవ్వళించిన నీకు చేత కానిదేమి ఉన్నది తండ్రీ! కరుణించుమా!



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

కర్ణునికి పరశురాముని శాపం



భారతంలో కర్ణుని గురించి తెలియనివారుండరు. అతను ఎన్నో శాపాలకు గురైనవాడు. క్షాత్ర విద్యల నిమిత్తం పరశురాముని వద్ద శిష్యునిగా చేరాడు. పరశురాముడు అన్ని విద్యలూ నేర్పాడు. ఒక రోజు పరశురాముడు కర్ణుని ఒడిలో తలపెట్టుకుని నిద్రకుపక్రమించాడు. కర్ణుడు దివ్యాస్త్రాలు ఉపదేశం పొందితే అర్జునునికి కష్టమని, లోకం అనుకుంటున్నట్టుగా అతను సూతుడనే విషయం బయటపెట్టాలని ఆలోచించి ఇంద్రుడు పథకం పన్నాడు. ఒక కందిరీగ రూపం ధరించి పరశురాముడు తలపెట్టుకున్న వైపున కర్ణుడి తొడను కుట్టటం ప్రారంభించాడు. అయితే గురువుకు నిద్రాభంగం కలిగితే తనను శపిస్తాడని పంటి బిగువున బాధను అదిమి పెట్టుకున్నాడు. కొంత సేపటికి కందిరీగ కుట్టిన చోట నుంచి వచ్చిన రక్తం పరశురాముని తలకు తగిలింది. ఆ తడికి ఆయనకు మెలకువ వచ్చి లేచాడు. కర్ణుని తొడ నుంచి కారుతున్న రక్తాన్ని చూశాడు. వెంటనే ఆయన ఆలోచించాడు. క్షత్రియుడైనవాడు ఇటువంటి బాధకు కారణమైన వారిని ఒదిలిపెట్టడు. వారికి సహనం తక్కువ అని ఆలోచించాడు. నీవు క్షత్రియుడివి కాదు. నాతో అబద్ధం చెప్పావు. అందువల్ల ఆ విధంగా నా వద్ద నేర్చిన విద్య నీకు ఉపయోగపడదు అని శపించాడు. అయితే గురు శాపంతో కర్ణుడు డీలా పడిపోలేదు. దుర్యోధనుని పంచన చేరాడు. రాజయ్యాడు. దాన కర్ణుడిగా, శూరునిగా పేరొందాడు. ఐతే కర్ణుణ్ణి భూమాత, ద్రోణుడు, కృపాచార్యుడు, ఒక బ్రాహ్మణుడు శపించాడనే కథలున్నాయి. **'అరయుంగా కర్ణుడిల్లై ఆర్పురి చేతన్'** అనే నానుడి పుట్టింది.

శాపగ్రస్తుల కథా కమామిషు-13

అర్జునునికి

పాండవుల వనవాసం పన్నెండేళ్లు ముగిసింది. అర్జునుడు ఇంద్రలోకం సందర్శించి ఇంద్రునిచే సన్మానాలూ, సత్కారాలూ పొందాడు. అక్కడ ఉన్నప్పుడు ఇంద్ర సభలో నాట్యం చేసే ఊర్వశి అర్జునుని ఏకాంతంగా చూసి అతని చేయి పట్టుకుంది. 'నీవు నాకు తల్లితో సమానం. నేనూ, శ్రీహరి నరనారాయణులుగా తపస్సు చేస్తున్న పుడు నీవు నారాయణుని ఊరువుల నుంచి జన్మించి ఊర్వశివయ్యావు. అందునా నీపై నాకా దృష్టిలేదు' అని అన్నాడు. అయితే ఊర్వశి 'ఇది దెవేంద్ర లోకం, ఇక్కడ అటువంటి బంధాలుం డవ'ని మళ్లీ అతనిని సమీపించింది. దానితో అర్జునుడు ఆమెను విదిలించుకుని దూరం జరిగాడు. ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 'ఇక్కడున్న నలుగురు అప్సరసల్లోనూ మిన్న అయిన నన్ను నీవు తిరస్క రిస్తున్నావు నీవు నపుంసకుడిగా బతుకు' అని శపించింది. అర్జునుడు కంగారు పడ్డాడు. అయితే ఇంద్రుడు ఈ విషయం తెలుసుకుని ఊర్వశి ఇచ్చిన శాపం మునుముందు అజ్ఞాతవాసంలో ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందని తెలిపాడు. ఆ శాపం అర్జునునికి ఏ విధంగా ఉపయోగపడిందీ విరాట పర్వం చదవితే అర్థమవుతుంది.

ధర్మ దేవతకు

మాండవ్య మహర్షిని ప్రాణాలు వదిలే స్థితి వరకూ పరీక్షించింది ధర్మ దేవత. మహర్షి ఓర్చుకుని తనను అంతగా ఇబ్బంది పెట్టడానికి కారణం అడిగాడు. 'నీలో సహనం ఎంత ఉందో పరీక్షించడానికే' అని సమాధానం ఇచ్చింది దేవత. నా సహనాన్ని ఇంతవరకూ పరీక్షించావు కనుక నీవు ద్వాపర యుగాన సహనం తో ఉండే దాసీ పుత్రునిగా జన్మించు అని మహర్షి శపించాడు. అతడే విదురుడు. దాసీ పుత్రునిగా పుట్టి ధృతరాష్ట్రునికి ఎప్పటికప్పుడు ధర్మబోధలు చేస్తూ వచ్చాడు. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక ధృతరాష్ట్రుడు గాంధారి, కుంతిలతో వానప్రస్థాశ్రమం వెళ్లి అక్కడే శేష జీవితం గడుపుతూ నిర్యాణం చెందాడు.

దుర్యోధనునికి

మహాభారతంలో దుర్యోధనుని పాత్ర అందరికీ తెలిసిందే. పాండవులతో ధర్మంగా మెలగమని ఎందరో అతనికి ధర్మబోధ చేశారు. అతను ఎవరి మాటనూ లక్ష్యపెట్టలేదు. ఒక పర్యాయం మైత్రేయ మహర్షి వచ్చి సభలో అందరూ కొలువుతీరి ఉండగానే దుర్యోధనునికి తనూ హితవు చెప్పాడు ఎంతో నిదానంగా, అనునయంగా. అయితే దుర్యోధనుడు పెడసరంగా, మొండిగా, మూర్ఖుడై, ముసిముసిగా నవ్వుతూ తన కాలిబొటనవేలు నేల రాస్తూ, మధ్య మధ్య తన చేత్తో తొడల మీద తాళం వేస్తూ అహంభావంతో కూర్చున్నాడు. మైత్రేయ మహర్షికి ఒళ్ళు మండింది. 'ఈ అహంభావానికి ప్రతిఫలం అనుభవిస్తావు. యుద్ధంలో భీముడు నీ తొడలు విరగ్గొడతాడు అప్పుడు నీకు మరణం కలుగుతుంది' అని కటువుగా శపించాడు. దుర్యోధనుని పక్షాన ధృతరాష్ట్రుడు ఆయనను శాంతపరచి, క్షమాపణలు కోరి శాప విమోచనం అడిగాడు. 'నీ కొడుకు పాండవులతో స్నేహం చేసుకుంటే నా శాపం ఏమీ తగలదు, లేకపోతే నా శాపానికి తిరుగులేదు' అన్నాడు మహర్షి, దుర్యోధనుడు ఆ శాపాన్ని లెక్క చేయలేదు. కురుక్షేత్ర యుద్ధంలో భీముడు దుర్యోధనుడి తొడలు విరగ్గొట్టాడు.

- డాక్టర్ దేశిరాజు లక్ష్మీనరసింహారావు

9985844558

దిన ఫలాలు

మేష రాశి: కోర్టు సంబంధిత వ్యవహారాలలో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగు తాయి. ప్రయాణాల విష యంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కా రాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవు తాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్య క్రమాలు కలసి వస్తాయి. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతం లోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నా లతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయా ణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగి స్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటా యి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొం టారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విష యాల్లో సులువుగా అవకాశాలు లభి స్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పను లలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరో గ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదా యంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనం దాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యా లలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అను కూల/ ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసు కోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పని సరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటు ంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.




శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కాళికాదేవి

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

1949లో భగవాను చేతికి నాలుగో ఆపరేషను గూడ అయిన వెనుక ప్రస్తుతం నిర్వాణ రూం అని చెప్పబడుతూ వున్న ఆ చిన్న గదికి భగవాను మకాం మార్చారు. అట్లా మార్చిన వెనుక భగవాను సన్నిధిలో ఎక్కువసేపు కూర్చునే అవకాశము లేక నా బసకు, ఆశ్రమానికీ చాలాసార్లు తిరుగుతూ వుండేదాన్ని. భగవానుకు ఎల్లా గున్నదో ఏమోనన్న భయంతో, ఆ తిరగటంలో ఒకనాటి మధ్యాహ్నం, నా బసకు, ఆశ్రమానికి మధ్యలో రోడ్డు నానుకొని వున్న కాళికాదేవి కోవెలలో నేను ఆశ్రమానికి వెళ్లేముందే ఏదో కోలాహలంగా వున్నది. ఏదో పూజ జరుగుతున్నది గాబోలనుకున్నాను.

ఆ వెనుక మేక యొక్క ఆర్తనాదమూ వినిపించింది. ఓహో! బలి జరుగుతూ వున్నది గాబోలనుకున్నాను. అలా ఆర్తనాదాలు నా బసలో వున్నప్పుడున్నూ అప్పుడప్పుడు వినిపించేవే గాని నేనంతగా దానియందు లక్ష్యం పెట్టలేదు. ఇప్పుడు భగవాను శరీరం బాగుండనందువల్ల ఆశ్రమ సమీపంలో ఈ బలులేవమా? అని అనిపించింది. సరే, ఆశ్రమంలో వున్న భక్తులతో భగవాన్ ఆరోగ్యమును గురించి ప్రశ్నించి తెలుసుకొని తిరిగి బసకు బయలుదేరి వస్తూ వుంటే కాళికాదేవి కెదుటనున్న వధ్యశిల మీద రక్తంచిమ్మబడి బీభత్సంగా వున్నది. జనం ఎవ్వరూ లేరు. ఆ రక్తం చూడగానే నా శరీరం కంపించి చెమటలు పోసినవి. అయ్యో? భగవంతుడా! జనమధ్యంలో ఈ బలులేమి? భగవాను శరీరం బాగుండనప్పుడు ఆశ్రమసమీపంలో ఈ మూఢాచారం జరగవచ్చునా? ఎలాగైనా ఇది ఆపాలని గట్టిగా తోచింది. ఆ సాయంత్రమే రమణనగరంలో నివసించే భక్తులలో కొందర్ని కలుసుకొని ''అన్నా! ఇదేమి అన్యాయం, ఆశ్రమ సమీపంలో ఈ రక్తపాతమేమి? కూడదని వారించరాదా?''అన్నాను. ''అమ్మా వాళ్లు క్షుద్రమంత్రవేత్తలు. మనం ఏదన్నా అంటే మనమీద ప్రయోగం చేస్తారేమోనమ్మా. ఈ విషయంలో మనము కల్పించుకోటం కష్టం''అని ఎవరూ ఆ పనికి నిలబడలేదు. రెండు మూడు రోజులు చూచాను. లాభం లేకపోయింది. బలులా అంతకంతకూ అధికం అవుతున్నవి. ఆ రక్తపాతం, ఆ



నోరులేని జంతువుల ఆర్తనాదం చూడలేకా, వినలేకా ఈ విషయంలో భగవాను సూచన ఎలాగుంటుందో చూద్దామని ఒక రోజున సాహసించి సమీపవర్తులగు కృష్ణస్వామి వాళ్లతో చెప్పి మధ్యాహ్నం మూడు గంటల వేళ ఎవరూ లేకుండా చూచి భగవాన్ సన్నిధికి వెళ్లి నమస్కరించి లేవగానే ''ఏమి?'' అన్నట్లు చూచారు భగవాన్. నేను చేతులు నలుపుకుంటూ ''ఇక్కడ కాళికా దేవాలయంలో ఘోరంగా బలులు జరుగుతూ వున్నవి. ఇదివరకంతగా లేదు. ఇప్పుడు మరీ ఎక్కువైనవి. భగవాన్ వున్న ఈ గదికి కూడా ఆ పశువుల ఆర్తనాదం విన బడవచ్చును. ఆ రక్తపాతం చూడలేకుండా వున్నానే?'' అన్నాను. భగవాన్ దయాపూర్ణ దృష్టితో చూస్తూ ''అవును. వినబడుతూనే వున్నవి. కానీ ఎవరూ అది పట్టించుకోరు. ఏం జేసేదీ?''అన్నారు.


(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

ఆంధ్రప్రభ నాయిక



సాహసం

వైకల్యం శరీరానికే గాని మనసుకు కాదని ఆమెలోని పట్టుదలను చూస్తే అర్థమవుతుంది. ప్రమాదంలో కాలు కోల్పోయినా తన లక్ష్యసాధనకోసం కృత్రిమకాలును ఏర్పాటుచేసుకుని ముందుకు సాగి విజయం సాధించింది. ఆమే అరుణిమా సిన్హా.

ఆమెకు తలవంచిన 'శిఖరం'



స్ఫూర్తి



2013సం.లో 30యేళ్ల వయసులో ఆమె మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన మొట్ట మొదటి దివ్యాంగురాలిగా పేరు సంపాదించుకున్నారు. ఈసందర్భంగా భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆమె లక్ష్యం అక్కడితో ఆగిపోలేదు. ఇంకా ఏదో సాధించాలనే తపన ఆమెలో ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఆ తపనతోనే అంటార్కిటికాలో ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించి మరో రికార్డును సృష్టించింది. వైకల్యం అనేది శరీరానికే గాని మనసుకు కాదని, లక్ష్యసాధన దృఢంగా ఉంటే ఎంతటి శిఖారాలనైనా అధిరోహించవచ్చని నిరూపించింది. అరుణిమా సిన్హా. కొన్ని సంవత్సరాల క్రితం 2011స.ంలో జరిగిన ఒక ప్రమాదంలో ఆమె తన కాలును పోగొట్టుకుంది. ఆమె రైలులో ప్రయాణిస్తున్నప్పుడు దోపిడీదొంగలు ఆ రైలులో ప్రవేశించారు. ఆమె వారిని అడ్డుకోవడంతో రైలులో నుంచి తోసివేశారు. ఆ సమయంలో ఆమె కాలును కోల్పోయింది. ఆమెను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో జాయిన్ చేశారు. అప్పటికే ఆమె పర్వతారోహకురాలిగా పేరు తెచ్చుకుంది. ఆమెకు ఇటువంటిప్రమాదం జరగటం వల్ల అందరూ ఆమెవైపు జాలిగా చూసేవారు. ఆ జాలిచూపులు ఆమెను మరింత బాధపెట్టేవి. ఆ బాధనుంచే పట్టుదల పెరిగింది. ఎలాగైనా తన లక్ష్యాలనుచేరుకోవాలని ఆ క్షణమే నిర్ణయించుకుంది. తన లక్ష్యసాధనకోసం ఏంచేయాలా అని ఆలోచించడం మొదలుపెట్టి మనోధైర్యంతో ముందుకు సాగింది. ఆ మనోధైర్యమే ఆమెను విజయపథంలో నడిపించాయి. మొట్టమొదటిసారి ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన దివ్యాంగురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. ఈమధ్యనే అంటార్కిటికాలో ఉన్న మౌంట్ విన్సన్ పర్వతాన్ని అధిరోహించి మరోసారి తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుంది. ఆమె సాధించిన ఈ విజయాన్ని గుర్తించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆమె ధైర్యసాహసాలను అభినందించి పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. ''అత్యున్నత శిఖరాలను అధిరోహించిన అరుణిమా సిన్హాకి అభినందనలు. ఆమె భారతదేశానికి గర్వకారణం. తన అకుంఠిత శ్రమతో అనుకున్న లక్ష్యాలను సాధించారు. ఆమె భవిష్యత్ మరింత ప్రకాశవంతంగా ఉండాలని, మరెన్నో లక్ష్యాలను సాధించాలని ఆశిస్తున్నాను'' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు.

ఆమె భారతీయ పర్వతారోహకురాలే కాకుండా జాతీయస్థాయి వాలీబాల్ ప్లేయర్. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన దివ్యాంగురాలిగా ఆమె రికార్డు సృష్టించారు. అదేకాకుండా ఆఫ్రికాలోని కిలిమంజారో, ఆస్ట్రేలియాలోని మౌంట్ కౌసియస్కో, యూరోప్‌లోని మౌంట్ ఎల్బరస్, సౌత్ అమెరికాలోని మౌంట్ అకాన్‌కాంగ్వా కూడా అధిరోహించారు. తనకు జరిగిన ప్రమాదం వల్ల తన కాలులో రాడ్, ఒక ప్లేట్‌ను అమర్చారని, దీనివల్ల పర్వతాలు ఎక్కేటప్పుడు కొంచెం బాధ అనిపిస్తుందని, కాని లక్ష్యసాధన కోసం ఎంతటి బాధనైనా భరిస్తానని, ఆరు ఖండాలలోని ఆరు పర్వతాలను అధిరోహించడమే తన ఆశయం''అని అరుణిమా సిన్హా చెబుతుంది.

కెమెరా కంట కన్నీరు!

మీడియాలో రిపోర్టింగ్ విభాగంలో పనిచేయాలంటే సాహసం, తెగువ ఉండాలి. హఠాత్పరిణామాలు ఎదురైనప్పుడు భయపడి బేలముఖంతో నిలబడిపోకుండా ధైర్యంగా ముందుకు సాగిపోవాలి. అప్పుడే వారు తమ విధి నిర్వహణలో రాణించగలుగుతారు. అలాంటి విపత్కరపరిస్థితుల్లో తన కర్తవ్యాన్ని వీడకుండా ధైర్యంగా తన విధులను నిర్వహించి సోషల్ మీడియాలో హల్ చల్ సృష్టిస్తోంది. ఆమే కెమెరా ఉమెన్ షాజిలా అబ్దుల్ రహ్మాన్.

షాజిలా అబ్దుల్ రహ్మాన్ కైరాలి టీవీలో కెమెరా ఉమెన్‌గా పనిచేస్తుంది. శబరిమలలో జరుగుతున్న నిరసన ఉద్యమాల దృశ్యాలను చిత్రీకరించే బాధ్యత ఆ టీవీ యాజమాన్యం ఆమెకు అప్పగించింది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ కొన్ని గ్రూపులు నిరసన ప్రదర్శనలను కేరళలోని తిరువనంతపురంలో చేపట్టారు. ఆ దృశ్యాలను షాజిలా చిత్రీకరించడం చూసిన నిరసనకారులు ఆమె దగ్గరకు వచ్చి కెమెరాషూట్ చేయడం ఆపివేయమని బెదిరించారు. భౌతిక దాడి కూడా చేశారు. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. వారి బెదిరింపులకు ఒకవైపు బాధపడుతూనే కెమెరాను ఆఫ్ చేయకుండా అక్కడి సన్నివేశాలను ధైర్యంగా చిత్రీకరించింది. నిరసనకారులు ఆమెతో ప్రవర్తించిన తీరుకు ఆమె చాలా



బాధపడింది. కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. అలా కన్నీళ్లతోనే కెమెరా షూట్‌చేస్తుండడం ఇంకో కెమెరామెన్ చూసాడు. ఆమె ఎదుర్కొన్న సంఘటనను, ఆమె పడిన బాధను వివరిస్తూ ఫొటోలను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దానికి చాలా మంచి స్పందన వచ్చింది. చాలామంది ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ మెసేజ్‌లు పెట్టారు.

తమ టివికి స్పెషల్ న్యూస్ కోసం ఆమె ఎంతో ధైర్యంగా వ్యవహరించింది. శబరిమల ఆలయంలో ఇద్దరుమహిళలు ప్రవేశించడాన్ని నిరసిస్తూ కేరళ వ్యాప్తంగా అల్లర్లు జరిగాయి. ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు మహిళలు అయ్యప్పను దర్శించుకున్నారు. 10 నుంచి 50 యేళ్ల లోపు మధ్య వయస్సున్న ఆడవాళ్లకు అయ్యప్ప ఆలయ ప్రవేశం నిషిద్ధమన్న విషయం తెలిసిందే. అయితే, అయ్యప్పను దర్శించుకునే హక్కు మహిళలకూ ఉందని, అందుకు అనుమతించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆ మధ్య తీర్పు ఇచ్చింది. దీంతో కొంతమంది మహిళలు ఆలయ ప్రవేశానికి ప్రయత్నించారు. హిందూసంఘం, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దీనిని అడ్డుకోవడంతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రప్రభుత్వం 2వతేదీన పోలీసు సిబ్బందిని రక్షణగా ఇచ్చి ఆ ఇద్దరు మహిళలను ఆలయంలోకి పంపించింది. వారిద్దరూ 40 ఏళ్ల లోపువారే. దీంతో తిరువనంతపురంలో చెలరేగిన అల్లర్లను చిత్రీకరించడానికి షాజిల్లా వెళ్లింది. ఆమె వెంట ఉన్న మీడియా మిత్రులు చాలామంది ఆలయ నిరసనకారుల నుంచి దాడులను ఎదుర్కొన్నారు. ఆమె కూడా చాలా సవాళ్లను ఎదుర్కొంది. అయినా ఆమె భయపడలేదు. మొత్తం సన్నివేశాలను చిత్రీకరిస్తూనే ఉంది. నిరసనకారులు ఆమె దగ్గరనుంచి కెమెరా తీసుకోవడానికి కూడా ప్రయత్నించారు. అయినా ఆమె వారి నుంచి తప్పించుకోగలిగింది. ఆ సంఘటనలో ఆమెకు గాయాలై ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. మెడకు నెక్ బెల్ట్ పెట్టుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

''నిరసనకారులలో ఐదారుగురు నన్ను చుట్టిముట్టి, నా కెమెరాను లాక్కొని నన్ను క్రిందపడవేశారు. అంతమందిని నేను ఎలా ప్రతిఘటించగలను? నేను వారికి భయపడి ఏడవలేదు. నా కెమెరా లాక్కున్నందుకు ఏడ్చాను. నానిస్సహాయతకు ఏడుపు వచ్చింది. అప్పటి వరకు నేను తీసిన ఎన్నో సన్నివేశాలు మిస్సయిపోతాయేమోనని భయంతో ఏడ్చాను. నాకెమెరా నాకు దక్కగానే ముందుగా దానిలో అన్నీ ఉన్నాయో లేదోనని చెక్ చేసుకున్నాను. నా బాధ ఎవరికీ కనబడకూడదనే నేను కెమెరాను నా ముఖానికి అడ్డుగా పెట్టుకున్నాను. అయినా ఎవరో నా సంఘటనను షూట్‌చేసి సోషల్‌మీడియాలో పెట్టారు''అని షాజిదా చెప్పింది.

సోషల్‌మీడియాలో ఆమె ఫొటోలను, సంఘటనను చదివి తెలుసుకున్న ప్రతి ఒక్కరూ వృత్తిపట్ల ఆమెకున్న అంకితభావాన్ని, ఆమెలోని సాహసాన్ని మెచ్చుకుంటూ ప్రశంసలు అందజేశారు.

సప్తసముద్రాలు జయించిన బుల

ప్రత్యేకం



సముద్రపు నీరంటేనే ఆమెకు అలెర్జీ. కాని స్విమ్మింగ్ చేయాలనే బలమైన కోరిక ఉండేది. తన కోరిక తీరడం కోసం అలెర్జీని కూడా లక్ష్యపెట్టకుండా ఏడు సముద్రాలను దిగ్విజయంగా స్విమ్ చేసిన మహిళగా గుర్తింపు పొందారు బుల చౌదరి. స్విమ్మింగ్ వైపు ఆమె పయనమెలా సాగిందో తెలుసుకుందాం.

మనకు సరిపడలేదని దేని నైనా వదలిపెట్టడం తేలికైన పనే. కాని అందులో పట్టుదలతో రాణిస్తే కోరుకున్న విజయాలను సులువుగా చేరగలము, అలా ఆమెకు నచ్చిన స్విమ్మింగ్‌లో రాణించగలిగింది బుల చౌదరి. ఆమె సముద్రంలో దిగితే శరీరమంతా మంటలు మాత్రమే కాదు దురద కూడా మొదలవుతుంది. అయినా తన లక్ష్యసాధనకోసం వాటిని లక్ష్యపెట్టకుండా ఇంగ్లీష్ ఛానెల్ మొత్తం స్విమ్మింగ్ చేసింది. ఆమె వయసు 48 సంవత్సరాలు. మూడు సంవత్సరాల వయసు నుంచే ఆమె స్విమ్మింగ్ చేయడం మొదలుపెట్టింది. స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. కాని మొదట్లో స్విమ్మింగ్ చేయడమంటే చాలా భయం ఉండేది. వాళ్ల ఇంటికి దగ్గరలో ఉన్న చెరువు దగ్గరకు తండ్రి తీసుకువెళ్లినప్పుడు అక్కడ స్విమ్మింగ్‌చేసే వాళ్లని చాలా ఆసక్తితో చూస్తూ కూర్చునేది. ఒకరోజు అకస్మాత్తుగా బుల నీటిలో పడిపోయింది. స్విమ్ చేయడం తెలీదు కాబట్టే రక్షించండి అని అరవడం మొదలుపెట్టింది. ఒక ధైర్యవంతుడు ఆమెను కాపాడాడు. ఆరోజే ఆమె తండ్రి కూతురికి ఇటువంటి పరిస్థితి మళ్లీ ఎదురైతే ఏం జరుగుతుందోననే భయంతో స్విమ్మింగ్ నేర్పించాలనే నిర్ణయాన్ని తీసుకున్నాడు. తండ్రి కోరిక నెరవేర్చాలని ఆమె కూడా నిర్ణయించుకుని స్విమ్మింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఒక సంవత్సరం స్విమ్మింగ్ నేర్చుకున్న తర్వాత ఎక్కడ నేర్చుకుందో అదే క్లబ్‌లో స్విమ్మింగ్ నేర్పే శిక్షకురాలిగా చేరింది.

ఆమె పశ్చిమబెంగాల్‌లోని చిన్న నగరానికి చెందినది. స్విమ్‌సూట్ ఏవిధంగా ఉంటుందనే అవగాహన కూడా లేని ప్రాంతంలో పెరిగింది. ఫ్రాక్ వేసుకునే స్విమ్మింగ్ నేర్చుకునేది. ఒకరోజు తల్లి ఒక షాపులో స్విమ్‌సూట్‌ని చూసి ఆవిధంగా కూతురు కోసం ఒక సూట్‌ని కుట్టించింది. ఆర్థికంగా కుటుంబ పరిస్థితి బాగోక పోయినా అమ్మాయికోసం ఆమె మంచి కాటన్ క్లాత్‌తో ఒక సూట్ తయారుచేసింది. కాని బులకి దాని నాణ్యత గురించి తెలీకపోవడంతో అది వేసుకుని చాలా నిర్లక్ష్యంగా స్విమ్మింగ్ చేసేది. ఆమెకు స్విమ్మింగ్ అంటే ప్రాణమని ఆమెను నేర్పించిన వారందరూ ఆమెలోని నైపుణ్యాన్ని గుర్తించారు.

''నా క్యాంప్‌లో ఉన్న మిగతా 14మంది బాలికలలో బుల ప్రత్యేకమైనది. చాలా శక్తిసామర్థ్యాలు కలది. ఆమె చాలా చిన్నవయసులోనే స్విమ్మింగ్‌లోకి ప్రవేశించింది. దానివల్ల ఆమె స్విమ్మింగ్‌లోని టెక్నిక్స్ ఎన్నింటినో సులువుగానే నేర్చుకుంది'' అని 1982సం.లో ఆమె కోచ్ బెర్నార్డ్ జాన్క్ అన్నారు.

పన్నెండు సంవత్సరాల వయసులో బుల నాలుగు అడుగుల ఐదు అంగుళాల పొడవు, 34 కేజీలు బరువు ఉండేది. కాని నీటిలో చేపపిల్లలా చాలా వేగంగా ఈత కొట్టేది. యువ స్విమ్మర్‌గా అప్పటివరకు ఉన్న చాలా రికార్డులను ఆమె తిరగరాయడమే కాకుండా తిరుగులేని రికార్డులను సృష్టించింది. ఆమె కామన్‌వెల్త్ గేమ్స్ నుంచి ఏసియన్ ఛాంపియన్ షిప్‌స్థాయి వరకు పోటీలలో పాల్గొనేది. కాలం గడిచిన కొద్దీ స్విమ్మింగ్ పూల్ బులకి చిన్నదవడం మొదలైంది. ఆమె దృష్టి సముద్రం మీద పడింది. 1989లో ఆమె ఇంగ్లీష్ ఛానెల్‌లో స్విమ్ చేయడానికి శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. అప్పుడే ఆమెకు సముద్రపు నీటితో అలెర్జీ వస్తుందని తెలిసింది. కాని అక్కడితో ఆమె ఆగిపోలేదు. స్విమ్ చేశాక రాత్రంతా మంటతో బాధపడేది. ఇలాంటి చిన్నచిన్న అవాంతరాలు లక్ష్యపెట్టలేదు. ప్రొఫెషనల్ స్విమ్మర్ కావాలన్నదే ఆమె కోరిక. 1989సం.నాటికి ఆమె వయస్సు 19 సంవత్సరాలు. ఆమె మొదటి డ్రైవ్‌ను ఇంగ్లీష్ ఛానెల్‌లో మొదలుపెట్టింది. తిరిగి పది సంవత్సరాల తరువాత కూడా అందులోనే చేసింది. 2004లో ఆమె ప్రపంచ రికార్డును సృష్టించింది. ఏడు సముద్రాలను దాటిన మొట్టమొదటి మహిళగా ఆమె పేరు సంపాదించు కుంది. శ్రీలంకలోని తలైమన్నార్ పాక్ జలసంధి నుంచి భారతదేశంలోని తమిళనాడు వరకు వచ్చింది. 2005లో ఐదు విభాగాల నుంచి సముద్ర ఛానెల్స్‌లో స్విమ్ చేసిన మొట్టమొదటి మహిళగా పేరు తెచ్చుకుంది. 30కిలోమీటర్ల ట్రాక్‌ను మూడు గంటల 36 నిమిషాల్లో పూర్తిచేసి రికార్డు సృష్టించింది. సౌత్ ఏసియన్ ఫెడరేషన్ గేమ్స్‌లో విజేత, వరల్డ్ రికార్డ్ గ్రహీత కూడా. ఆమె అర్జున అవార్డు, పద్మశ్రీ అవార్డును కూడా పొందింది. భారతదేశ ప్రతిష్టాత్మకమైన నాలుగు అవార్డులను ఆమె దక్కించుకుంది.

''నీరే జీవితమని చెప్పారు. అది నా జీవితంలో ముమ్మాటికీ నిజం అయ్యింది. కొన్ని రోజులు డే జాబ్స్ చేశాను. కాని వాటిమీద శ్రద్ధ పెట్టలేకపోయాను. ఒక్క స్విమ్మింగ్ మీదనే నా శ్రద్ధంతా ఉందని గ్రహించాను. అప్పటినుంచి నా దృష్టంతా దానిపైనే పెట్టాను. ఆర్థిక ఇబ్బందులు, అలర్జీలు వంటివి నాలక్ష్యసాధనకు అడ్డంకులుగా మారనివ్వలేదు'' అని బులచౌదరి చెబుతుంది.

ప్రస్తుతం బెంగాల్‌లో స్విమ్మింగ్ ఇన్సిస్ట్యూట్‌ను ప్రారంభించి విజయవంతంగా నడుపుతుంది. అందులో తనలాంటి ఎంతోమంది స్మిమ్మర్‌లను తయారుచేస్తుంది.

ప్రయాణాలు చేయాలంటే కొంతమందికి ఎక్కడలేని నీరసం వస్తుంది. అలాంటి వారు ఒకరోజు ప్రయాణం చేస్తే వారం రోజులు విశ్రాంతి తీసుకుంటారు. కాని ఆమెకు ప్రయాణమే జీవితం. ఈ ప్రయాణం కూడా రైలో, బస్సో అని అనుకుంటే పొరబాటు పడ్డట్టే. ఆమె రోజూ పడవలో ప్రయాణం చేసి నదులు దాటి, కొండలెక్కి పర్వతాల మీద ఉన్న గిరిజన పిల్లలకు విద్యాభ్యాసాలు నేర్పుతుంది. ఆమే ఉషాకుమారి. కేవలం విద్య మాత్రమే కాకుండా వారిని మంచి సంస్కారవంతులుగా తయారుచేయాలన్నదే తన ఆశయమని చెబుతుంది. అడవుల్లోకి వెళ్లి ఈవిధమైన బాధ్యతాయుతమైన విధులు ఎలా నిర్వహించాల్సి వచ్చిందనే వివరాలు తెలుసుకుందాం.

గిరిజన గూడెంలో 'ఉషో'దయం

ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమానం. ఇంట్లో తల్లిదండ్రులు మంచి అలవాట్లు నేర్పిస్తే. స్కూల్లో టీచర్లు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పి సమాజానికి మంచి పౌరులను అందజేస్తారు. వీరిద్దరి పాత్ర చాలా కీలకమైనది. వారు గనుక తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోతే పిల్లల భవిష్యత్ అంధకారమే. కాని కె.ఆర్.ఉషాకుమారి అటు తల్లిదండ్రుల బాధ్యతను, ఉపాధ్యాయుల విధులను రెండింటిని సక్రమంగా నిర్వర్తిస్తుంది. ఆమెతిరువనంతపురం జిల్లాలోని అంబూరి గ్రామానికి చెందినది. గిరిజన పిల్లలకు విద్యాభ్యాసాలు నేర్పించడానికి ఆమె ప్రతీరోజూ నదులు దాటి, కొండలెక్కి సరైన సమయానికి స్కూల్‌కి వెళ్లి వారికి పాఠాలు నేర్పిస్తుంది. ఈ విధంగా ఆమె 16సంవత్సరాల నుంచి తమ విధులను క్రమం తప్పకుండా నిర్వర్తిస్తుంది. ఆమె ప్రయాణం ఉదయం 7.30ని.లకు ప్రారంభమవుతుంది. తన స్కూటీమీద కుంబిక్కల్ నుంచి కడవు వరకు వెళుతుంది. అక్కడ బండిని పార్కింగ్ చేసి, పడవ మీద అవతలి ఒడ్డుకు ప్రయాణిస్తుంది. అక్కడ దిగి కాలినడకన కొన్ని గుట్టలు ఎక్కుతుంది. అలా కొన్ని కిలోమీటర్లు ప్రయాణించాక చాలా దట్టమైన అటవీ ప్రాంతం వస్తుంది. చుట్టు పక్కల మనుషులెవరూ కనబడరు. అటువంటి ప్రాంతంలో కూడా ఆమె ధైర్యంగా నడుచుకుంటూ వెళుతుంది. ఆ ప్రాంతంలో ఎక్కువగా ఏనుగులు, చిరుతపులులు ఉంటాయి. వీటన్నింటిని తరమడానికని ఆమె ఒక కర్రను చేత్తో పట్టుకుని నడుస్తుంది. వెళ్తున్న దారిలో స్కూల్‌కి వచ్చే పిల్లల ఇళ్లు ఉంటే వారిని తనతో పాటు తీసుకుని వెళుతుంది. ఆ పిల్లలందరూ కున్నతులలోని కన్ని



ఆదర్శం

ట్రైబల్ జాతికి చెందినవారు. స్కూల్ పేరు అగస్త్య ఇగ అధ్యాపక విద్యాలయ. ఈ స్కూల్ అగస్త్యర్‌కూడమ్ ప్రాంతానికి 1868మీటర్ల (6,129అడుగుల) ఎత్తులో ఉంది. అలా ఆమె రోజూ నడుచుకుంటూ రెండు గంటలు ప్రయాణించాక వారి గమ్యం వస్తుంది. ఆవిధంగా ఆమె పదహారు సంవత్సరాల నుంచి ఈ ప్రయాణాన్ని చేస్తుంది. ఏ ఒక్క రోజు కూడా స్కూల్ సమయానికి ఆలస్యంగా వెళ్లలేదని ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉషాకుమారి చెప్పింది. స్కూల్ సమయం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు. ఆమె ఒక్కరే ఉపాధ్యాయిని. అన్ని భాషల్లో అన్ని సబ్జెక్టులను బోధిస్తుంది. లెక్కలు, విజ్ఞానశాస్త్రం, తెలుగు భాష అన్నింటిని నేర్పుతుంది. క్లాస్ 1 నుంచి క్లాస్ 4 వరకు మొత్తం పద్నాలుగు మంది పిల్లలకు నేర్పుతుంది.

తిరువనంతపురం ట్రైబల్ ప్రాంతాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. 1999 నుంచి ప్రారంభమయ్యాయి. అంతకుముందు నుంచే మలప్పురం వంటి ప్రాంతాల్లో అమలులో ఉంది. ఆమె కేవలం టీచర్‌గా విద్యను చెప్పడమే కాకుండా, స్కూల్‌కి కావలసినవి, పిల్లలకు కావలసిన అవసరాలను తెలుసుకుని తీర్చుతుంది. వారికి మధ్యాహ్నం పోషకాహారంతో భోజనాన్ని పెట్టిస్తుంది. పాలు, గుడ్లు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఆమె రాని సమయంలో ఇవన్నీ నిర్వహించడానికి ఒక కేర్‌టేకర్‌ను కూడా నియమించింది. ఆమె ఈ విధి నిర్వహణను ఒక ఛాలెంజింగ్‌గా తీసుకుని నిర్వహిస్తుంది. తనకు ఒక్కోసారి జీతం పంపించ డానికి చాలా సమయం పడుతుంది. అయినా పిల్లలకు ఎటువంటి లోటు రాకుండా చూసు కుంటుంది. ప్రభుత్వం నిధులు పంపించలేనప్పుడు తన పాకెట్‌మనీతో వారికి తిండి పెట్టిస్తుంది. ఇప్పుడు పాఠశాల బిల్డింగ్‌ను కొత్తపద్ధతిలో నిర్మించాలని అనుకుంటుంది. దీనికి ప్రభుత్వ సాయాన్ని కోరు తుంది. దీనికోసం కొద్దిరోజులు వారుచెట్ల కింద రాళ్లమీద కూర్చుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఉంది. స్కూల్‌కోసం ఎన్ని బాధలలైనా భరిస్తామని ఆమె చెబుతుంది. ఆమె చిత్తశుద్ధితో చేస్తున్న కృషిని గుర్తించిన సేవాసంస్థలు ఎన్నో అవార్డులను అందజేశాయి. అందులో సాక్షరత పురస్కార్, కన్‌ఫెడ్ (కేరళ అసోసియేషన్ ఫర్ నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్) అవార్డు ముఖ్యమైనవి. ఆమె నేర్పిన విద్యతో పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి తమ జీవితాలను ప్రగతిపథంలో నడిచేలా మార్చు కోవడమే తనకు అసలైన అవార్డు అని, నా లక్ష్యం సాధించేవరకు నా ప్రయాణం ఆగదని ఎంతో ఆనందంగా ఉషాకుమారి చెబుతుంది.

టాలీవుడ్‌లో తగ్గాయి... కోలీవుడ్‌లో పెరిగాయి


రకుల్ ప్రీత్‌సింగ్

కళాకారులకు భాషతో నిమిత్తం లేదంటారు. కెరీర్ పరంగా ఎప్పుడూ బిజీగా ఉండటం కోసం ఎక్కడ అవకాశాలు లభిస్తే అక్కడికి పరుగులు తీయడం చూస్తున్నదే. ఒకప్పటితో పోల్చుకుంటే ఇలా పలు భాషల్లో నటించడం అన్నది గత కొన్నేళ్లుగా ఊపందుకుంది. ఈ కోవలో టాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన కొందరు హీరోయిన్లకు ఇక్కడ అవకాశాలు సన్నగిల్లడంతో ఇప్పుడు వారు తమిళంలో బిజీ బిజీగా ఉన్నారు. వాస్తవానికి వారు తెలుగు, తమిళ భాషల సినిమాలు మొదట్నుంచి చేస్తూ వచ్చినప్పటికీ వారి చేతిలో ఇప్పుడు తమిళ సినిమాలే అధికంగా ఉండటం గమనార్హం. అలాగని అడపాదడపా తెలుగులో వచ్చిన అవకాశాలను వదిలిపెట్టకుండానే సంఖ్యాపరంగా తమిళసినిమాలను అధికంగా చేసేందుకు పచ్చజెండా ఊపుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే...

తెలుగు సినీరంగంలో పలువురు ప్రముఖ హీరోల సరసన నటించడంతో పాటు పలు విజయాలను సొంతం చేసుకున్న రకుల్‌ప్రీత్‌సింగ్‌కు స్పైడర్ చిత్రం తర్వాత అవకాశాలు సన్నగిల్లాయి. ఫెయిల్యూర్లు రావడం వల్లే ఆమెకు అలాంటి పరిస్థితి ఎదురైందని అంటున్నారు. దాంతో కొంతకాలంగా ఆమె తమిళ సినీరంగంపై దృష్టి నిలిపింది. తెలుగులో ఎన్.టి.ఆర్. కథానాయకుడు చిత్రంలో శ్రీదేవి పాత్రలోను, వెంకీ మామ చిత్రంలో నాగచైతన్య సరసన నటిస్తున్న ఆమె చేతిలో మూడు తమిళ చిత్రాలున్నాయి సూర్య సరసన ఎన్.జి.కె., కార్తి సరసన దేవ్, శివకార్తికేయన్ సరసన ఓ చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. ఇక అచ్చ తెలుగు భామ అంజలి విషయానికి వస్తే...చిత్రాంగధ చిత్రం తర్వాత తెలుగులో అవకాశాలు రాకపోవడంతో తమిళ సినిమారంగంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ప్రస్తుతం తమిళంలో ఆమె నటిస్తున్న లిసా చిత్రాన్ని తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే ఓ అనే తమిళ చిత్రంతో పాటు విజయ్ సేతుపతి నటిస్తున్న వేరొక చిత్రంలోనూ అంజలి మెరవబోతోంది. తెలుగులో తన కెరీర్ మళ్లీ ఎప్పుడు మలుపు తిరుగుతుందోనని ఆమె కోటి ఆశలతో ఎదురు చూస్తోంది. మరో అందాల భామ కాజల్ అగర్వాల్ సైతం తెలుగులో అడపాదడపా సినిమాలు చేస్తూనే ఉన్నా తమిళంలో మరిన్ని ఎక్కువ అవకాశాలు లభిస్తుండటంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది.తెలుగులో కవచం ఫెయిల్యూర్ తర్వాత ఇప్పుడామె బెల్లంకొండ శ్రీనివాస్ సరసనే తేజ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తోంది. తమిళంలో మాత్రం మూడు అవకాశాలు ఇప్పుడామె చేతిలో ఉన్నాయి. పారిస్ పారిస్, కోమలి వంటి తమిళ చిత్రాలు చేస్తున్న ఆమెకు కమల్‌హాసన్ వంటి జాతీయస్థాయి నటుడి చిత్రంలో నటించే అవకాశం లభించింది. ప్రధానంగా ఈ చిత్రం తమిళంలో రూపుదిద్దుకోనున్నప్పటికీ తెలుగు వంటి ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. ఈ క్రమంలోనే రాశిఖన్నా కూడా తెలుగు చిత్రాలకు మంచి ప్రాధాన్యమిస్తూ రావడమే కాదు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటోంది. శ్రీనివాస కల్యాణం తర్వాత తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన క్రాంతిమాధవ్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్ నిర్మిస్తున్న చిత్రంలో ఆమె నటిస్తోంది. తమిళంలో ఇప్పటికే ఆమె నటించిన రెండు సినిమాలు విజయం సాధించడంతో ఇప్పుడు పలు అవకాశాలు వెతుక్కుంటూ వస్తుండటంతో ఆమె రాశి బావుందని వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా విశాల్ సరసన అయోగ్య చిత్రంలోనూ, సిద్ధార్థ్ సరసన సైతాన్ కా బచ్చా చిత్రంలోనూ నటిస్తోంది. హీరో విజయ్, దర్శకుడు అట్లీ కాంబినేషన్ అంటే తనకు చాలా ఇష్టమని ఆమె చెబుతోంది. వారి కలయికలో వచ్చిన తెరి, మెర్సల్ చిత్రాలు చూశానని...వారి కాంబినేషన్ అంత గొప్పగా ఉంటుందని...అందుకే వారిద్దరూ చేసే చిత్రంలో నటించాలని తానెంతో కోరుకుంటున్నానని ఆమె చెప్పుకొచ్చింది. ఇక ఇంకో అందాల భామ రెజీనా కాసండ్రకు కూడా తెలుగులో అవకాశాలు లేకుండా పోయాయి. ఆ మధ్య వరుసగా వచ్చిన ఫెయిల్యూర్లు ఆమెకు టాలీవుడ్‌లో క్రేజ్‌ను తగ్గించేశాయి. దాంతో ఆమె కూడా తమిళ సినిమాలను చేస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్‌లో ఎస్.జె.సూర్య కథానాయకుడిగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలోనూ, ఇంకా జై కథానాయకుడిగా రూపొందుతున్న పార్టీ చిత్రంలోనూ రెజీనా నటిస్తోంది. అర్జున్‌రెడ్డి ఫేమ్ షాలినిపాండే కి కూడా తెలుగుతో పోల్చుకుంటే తమిళంలోనే అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అర్జున్‌రెడ్డి వంటి సూపర్‌డూపర్ హిట్ చిత్రం తర్వాత తమిళంలో మంచి అవకాశాలు రావడంతో అక్కడి సినిమాలను అంగీకరించినట్లు ఆమె చెబుతోంది. జి.వి.ప్రకాష్ సరసన 100 పర్సంట్ కాదల్, జీవా సరసన గొరిల్లా, విజయ్ అంటోని సరసన అగ్నిసిరగుగళ్ వంటి తమిళ సినిమాలలో ఆమె నటిస్తోంది. అంజలిలానే మరో అచ్చ తెలుగమ్మాయి ఆనందికి కూడా తెలుగులో కంటే తమిళంలోనే వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ఈరోజుల్లో, బస్టాప్, గ్రీన్‌సిగ్నల్ వంటి సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఆమె సుపరిచితమే. ప్రస్తుతం తెలుగులో ఆమెకు అవకాశాలు లేకపోయినా తమిళంలో మాత్రం టైటానిక్ అనే చిత్రంలో నటిస్తోంది. ఇలా ఈ భామలంతా కోలీవుడ్ సినిమాలతో కెరీర్‌ను నెట్టుకొస్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తే నటించడానికి ఎప్పుడూ సిద్ధమేనని అంటున్నారు.


షాలినిపాండే


కాజల్ అగర్వాల్


రెజీనా


అంజలి


రాశిఖన్నా

ప్రతీ ఇంట్లో ఇలాంటి వాడు ఉండాలనుకునే పాత్ర


- రామ్ చరణ్

నాన్నగారి స్ఫూర్తితో ఒక నటుడిగా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నాను. కేవలం ఒక తరహా చిత్రాలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. ఆ కోవలోనే రంగస్థలం చిత్రం తర్వాత దానికి భిన్నమైన వినయ విధేయ రామ చిత్రం చేశాను అని హీరో రామ్‌చరణ్ అన్నారు. రామ్‌చరణ్, కైరా అద్వాని నాయకానాయికలుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో రామ్‌చరణ్ కొద్దిసేపు ముచ్చటించారు.

వినయ విధేయ రామ కథాకమామీషు ఏంటి?

బోయపాటి జోనర్‌లో ఉంటుంది. అన్ని అంశాలకు సమాన ప్రాధాన్యం ఉంది. ఈ సంక్రాంతికి రాదగ్గ చక్కటి కథాచిత్రం. మాస్ అంశాలతో పాటు ఫ్యామిలీ ప్రేక్షకులు మెచ్చే అంశాలున్నాయి. కథకు సరిపోయే మంచి టైటిల్ కుదిరింది. గతంలో బోయపాటి దర్శకత్వం వహించిన జయ జానకి నాయక చిత్రం టైటిల్ కూడా అప్పట్లో నన్నెంతో ఆకట్టుకుంది. అలానే ఈ టైటిల్ కూడా సినిమాకు అంతబాగా సరిపోయింది.

ఇందులో మీ పాత్ర స్వభావం ఎలా ఉంటుంది?

ఈ సినిమాలో రామ్ పాత్రలో నటించాను. ప్రతీ ఇంట్లో ఇలాంటి వాడు ఒకడు ఉండాలని అనుకునే పాత్ర నాది. రాముడులా వినయంగా ఉంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించేలా ఉంటుంది. అంతమాత్రాన యాక్షన్ అంశాలు ఎక్కువగా ఉండవు. కాకపోతే యాక్షన్ ఓ అంశంగా హైలైట్‌గా ఉంటుంది. భద్ర సినిమా మొదలుకుని సరైనోడు చిత్రం వరకు బోయపాటి సినిమాలను చూస్తే...కేవలం యాక్షన్ అంశాలే కాకుండా మంచి ఫ్యామిలీ డ్రామాతో పాటు లవ్ అంశాలకు ఎంత ప్రాధాన్యమిచ్చారో తెలియంది కాదు. దానివల్లే ఆయనకు ఒక బ్రాండ్ ఇమేజ్ వచ్చింది.

రంగస్థలం తర్వాత ఈ తరహా చిత్రం చేయడానికి కారణం?

ప్రతీ సినిమాను రంగస్థలం మాదిరిగా చేయాలనుకోవడం కరెక్ట్ కాదు. ఒకనటుడిగా ఒకే తరహా చిత్రాలకు పరిమితం కాకుండా అన్ని జోనర్ చిత్రాలు చేయాలన్నదే నా ఉద్దేశ్యం. 1980లో నాన్నగారు కూడా అన్ని తరహా సినిమాలు చేశారు. ఆ స్ఫూర్తితోనే ఒక సెన్సిబుల్ చిత్రం సినిమా చేయాలనుకున్నాను. అదే ఈ చిత్రం చేయడానికి కారణమైంది.

ఓ నటుడిగా ఈ పాత్రలో మారడానికి కష్టమనిపించలేదా?

వాస్తవానికి రంగస్థలం తర్వాత ఈ చిత్రం చేసేందుకు ముందు ఇంకాస్త సమయం ఉంటే బావుండేదనిపించింది. కానీ రంగస్థలం షూటింగ్ అయిపోయిన 15 రోజుల గ్యాప్‌లోనే ఈ చిత్రాన్ని మొదలుపెట్టడం తప్పనిసరి అయింది. ఎందుకంటే బోయపాటికి, అలాగే నాకు ఉన్న వేరే కమిట్‌మెంట్స్ వల్ల తొందరగా మొదలు పెట్టాల్సి వచ్చింది. అయితే దర్శకుడిగా బోయపాటికి ఉన్న స్పష్టత వల్ల నాకు ఈ చిత్రంలోని రామ్ పాత్ర చేయడం పెద్ద కష్టమేమీ అనిపించలేదు.

సినిమా కోసం పాటించే ఆహార నియమాలను ఎప్పుడూ కొనసాగిస్తుంటారా?

ఈ సినిమా కోసం బాడీ వర్క్‌వుట్స్ కోసం కొన్ని ఆహార నియమాలను పాటించాను. కానీ ఎప్పుడూ అలాంటి ఆహార నియమాలనే పాటించాలంటే కష్టమౌతుంది. సినిమా కోసం ఒకటీ, రెండు నెలలు అలా పాటిస్తాను. మిగతా టైమ్‌లో ఆహారం మామూలుగానే తీసుకుంటాను.

ఆర్‌ఆర్‌ఆర్‌లో మీ పాత్ర గురించి?

రాజమౌళి మళ్లీ డీ గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర ప్రేక్షకులకు చాలాబాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ ఏడాది మొత్తం ఈ సినిమాకే కేటాయించాను.

ఆర్‌ఆర్‌ఆర్‌లో ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎలా ఉంది?

ఎన్టీఆర్ నాకు ఎప్పట్నుంచో సన్నిహితంగా ఉండే మంచి మిత్రుడు. ఈ చిత్రంలో మా ఇద్దరి కాంబినేషన్ సీన్లు చాలాబాగా వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేస్తుండటం ఆనందంగా ఉంది.

మీ బేనర్‌లో వేరే హీరోలతో కూడా సినిమాలను నిర్మిస్తారా?

లేదండి. అది కేవలం నాన్నగారి సినిమాల కోసమే పెట్టాం. అందులో నేను హీరోగా కూడా సినిమాలు చేయను. నాకు చాలా మంచి నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతానికైతే వేరే హీరోలతో సినిమాలను నిర్మించే ఆలోచన లేదు.

సైరా...చిత్రం సంగతులు?



సైరా నరసింహారెడ్డి చిత్రం అనుకున్న దానికంటే షూటింగ్ కొంత ఆలస్యమైంది. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. వేసవిలో విడుదల చేయాలన్న లక్ష్యాన్ని అనుకున్నాం కానీ అది వాయిదా పడింది. రీ షూటింగ్ జరుగుతున్నాయన్న వార్తలలో నిజం లేదు. మరో రెండు నెలల్లో ఈ చిత్రం షూటింగ్ పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్మాణానంతర పనులను పూర్తిచేసి..దసరా సీజన్‌లో సినిమాను విడుదల చేయనున్నాం. సైరా...చిత్రానికి ఉన్న స్థాయిని దృష్టిలో పెట్టుకుని హిందీ భాషలో కూడా విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. దీనివల్ల ఈ చిత్రం జాతీయ స్థాయి చిత్రమైంది. తప్పకుండా ఈ చిత్రం దేశవ్యాప్త ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

సైరా బడ్జెట్ ఎంత?

నాన్నగారితో పాటు అమితాబ్‌బచ్చన్, సుదీప్, విజయ్ సేతుపతి వంటి ప్రముఖ నటులతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం బడ్జెట్ పరిమితి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. నాన్న చేస్తున్న ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం ఎంత ఖర్చయినా ఫర్వాలేదనుకున్నాం. కానీ సినిమా స్థాయి గురించి చెప్పడం కోసం 200 కోట్ల పైనే బడ్జెట్ ఉంటుందని చెప్పవలసి వస్తోంది.

సైరా...కోసం మీ నాన్నకు ఎంత పారితోషికం ఇస్తున్నారు? ఆయన తదుపరి సినిమాలేంటి?

అత్యధికంగా పారితోషికం తీసుకునే హీరో ఆయన. ఆ స్థాయికి తగ్గకుండానే భారీ పారితోషికమే ఇస్తున్నాను. కావాలంటే ఆయననే అడగండి. అలాగే ఈ చిత్రం తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో నాన్నగారు నటించే సినిమా వేసవి కాలంలో మొదలవుతుంది. ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో నాన్నగారు నటిస్తారు అంటూ ఇంటర్వ్యూ ముగించారు.

ఆర్ ఆర్ ఆర్ తర్వాత..?


ఎన్టీఆర్

అరవింద సమేత తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. రాజమౌళి దర్శకుడు. ఇందులో రామ్ చరణ్ మరో హీరో. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్ నటించే సినిమాపై ఇంకా క్లారిటీ లేదు. అయినప్పటికీ సందీప్ రెడ్డి దర్శకత్వంలో నటించేందుకు ఆయన అంగీకరించారని సమాచారం. అర్జున్ రెడ్డి సినిమాతో వెలుగులోకి వచ్చిన సందీప్ తన తదుపరి చిత్రం ఎవరితో అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. అర్జున్ రెడ్డి చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నారు. తెలుగులో మహేష్‌బాబుతో కలిసి చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు ఎన్టీఆర్, సందీప్ కాంబినేషన్ సినిమా ఉంటుందని తెలిసింది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

నిర్మాతగా అల్లు అర్జున్!



అల్లు అర్జున్ నిర్మాతగా మారనున్నారని తెలిసింది. సొంత నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఉన్నప్పటికీ, తనకంటూ సొంతంగా నిర్మాణ సంస్థను నెలకొల్పాలనే యోచనతో ఉన్నట్టు తెలిసింది. అయితే నిర్మాతగా మారుతోంది టీవీ కోసం అని అంటున్నారు. సొంతంగా రియాలిటీ షోలు నిర్వహించాలనే ఉద్దేశం ఉందని సన్నిహితులు అంటున్నారు.

హీరోగా మంచి క్రేజ్ ఉన్న అల్లు అర్జున్ ఇటీవల లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. నా పేరు సూర్య సినిమా తర్వాత ఆయన మరే చిత్రం అంగీకరించలేదు. ఇటీవలే త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించేందుకు అంగీకరించారు.

రజనీ కొత్త సినిమా



తమిళ సూపర్‌స్టార్ రజనీ కాంత్ వరుసగా కొత్త సినిమాలు అంగీకరిస్తున్నా రు. ఇప్పటికే ఆయన రాజకీయ ప్రవేశం చేయనున్నట్టు ప్రకటించి ఉన్నారు. తమిళ నాడులో ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున, ఈ లోపు సినిమాలు కమిట్ అవుతున్నారు. ఇటీవలే రజనీ నటించిన కాలా రిలీజైంది. ఆ తర్వాత 2.ఓ సినిమా సైతం ప్రేక్షకుల ముందుకువచ్చింది. సంక్రాంతికి పేట విడుదలకానుంది. ఈ సినిమాలన్నీ తక్కువ వ్యవధిలోనే ఆయన పూర్తిచేశారు. తాజాగా మురుగదాస్ దర్శకత్వంలో నటించేందుకు అంగీకరించినట్టు తెలిసింది. ఈ చిత్రానికి నర్కాలి తెలుగులో కుర్చీ అని అర్థం. రజనీ రాజకీయ ప్రవేశం దృష్టితోనే ఈ సినిమాకు నర్కాలి అని టైటిల్ నిర్ణయించినట్టు అభిమానులు భావిస్తు న్నారు. మురుగదాస్ దర్శకత్వం వహించగా ఇటీవలే వచ్చిన సర్కార్ సినిమా ఓటు ప్రాముఖ్యతను తెలిపే కథాంశంతో తీసిన సంగతి తెలిసిందే.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?



అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

